ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కర్నూలు

: fb.com/vaartha Digital

Published from Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-3-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 58 పేజీలు: 10+4 వెల: 6.50


పట్టాలు తప్పిన కామాఖ్య ఎక్స్‌ప్రెస్

పుతిన్ లగ్జరీ కారులో భారీ పేలుడు

5లో

## ఎండ మంటల్లో జనం విలవిల



### ఒంటిమిట్ట, కొమ్మిపాడు తదితర ప్రాంతాల్లో 42° దాటిన ఉష్ణోగ్రతలు

### 89 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

**విజయవాడ,మార్చి30,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎండలు భయపడేతున్నాయి. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఆదివారం ఉగాదిరోజున జనాన్ని ఎండలు భయపెట్టాయి, అనేక మంది ఎండల దెబ్బకి రక్తపోటు, చక్కెర తగ్గి ఆస్పత్రి పాలవుతున్నారు. గతమూడు రోజుల్లో ప్రకాశం జిల్లా నందనటమారెళ్లలో 42.4, నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 42.2, కడపజిల్లా ఒంటిమిట్టలో 42.1, కర్నూలులో 41.7, మన్యం జిల్లా సీతంపేటలో 41.4, తిరుపతి జిల్లా రేణిగుంటలో 41.3, చిత్తూరు జిల్లా కొత్తపల్లి, నంద్యాల జిల్లా రుద్రవరంలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఇవ్వాళ శీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని 89 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు 208 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రేపటికి 230 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఎండ, వడగాల్పుల తీవ్రత కొనసాగింది.

మార్చిలోనే సాధారణ ఉష్ణోగ్రతకు మించి ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక వేసవిలో ఎక్కువగా దాహం వేస్తుంటుంది. ఎన్ని నీళ్ల తాగినా.. దాహం తీరినట్లు అనిపించదు. పైగా శరీరం త్వరగా డీహైడ్రేట్ అవుతుంది. ఇలాంటి సమ్యలకు చెక్ పెట్టడం కోసం వేసవిలో చాలా మంది జ్యూసులకు పెద్ద పీట వేస్తారు. ప్రతి రోజు ఏదో ఒక జ్యూసు తాగుతుంటారు. అయితే ఇలా నిత్యం పండ్ల రసాలు సేవించడం ఆరోగ్యానికి మంచిది కాదట. వేసవిలో

>>2


# ఇక 'బంగారు కుటుంబాలు'

### రాష్ట్రంలో ఆగస్టు నాటికి పి-4 కార్యక్రమంలో 5 లక్షల మంది

### పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్ట్‌నర్‌షిప్‌గా పి-4 విధానం

### మంగళగిరికి చెందిన నరసింహా తొలి బంగారు కుటుంబంగా ఎంపిక

### పి-4 లోగోను ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్



ఆదివారం పి-4 లోగోను ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తదితరులు

**విజయవాడ,మార్చి30,ప్రభాతవార్తప్రతినిధి:** ఉగాది వేళ ఆంధ్రప్రదేశ్‌లో పి4 జీరో పావర్టీ అనే కార్యక్రమానికి శ్రీకారంచుడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పి4 కార్యక్రమాన్ని రాజధాని అమరావతి వేదికగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి పి4 లోగోను ఆవిష్కరించారు. అదేవిధంగా స్వర్ణాంధ్రా పి4 ఎట్‌దా రేట్ ఆఫ్ ఏపీ.గొవ్. ఐన్‌నుమెయిల్ ఐడీగాను, 8008944791 ఫోన్ నంబర్‌తో ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్‌షిప్‌గా ఈ విధానం ఉండనుంది. తొలి దశలో దాదాపు 20 లక్షల మందికి లబ్ధి చేకూరేలా ప్రణాళికలు రూపొందించారు. వెలగపూడిలోని సచివాలయానికి సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. మార్గదర్శి బంగారు కుటుంబం నినాదంతో పి4 కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మంగళగిరికి చెందిన నరసింహా కుటుంబాన్ని తొలి బంగారు కుటుంబంగా, భవన నిర్మాణ కార్మికుడు ఇమ్మాన్యుయెల్ కుటుంబాన్ని రెండో బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బంగారు కుటుంబాలను సత్కరించి, మార్గదర్శులకు చంద్రబాబు ప్రశంసా పత్రాలు అందించారు. పి4

>>2

## 50 మంది మావోయిస్టుల లొంగుబాటు

### వరస ఎన్ కౌంటర్లు.. లొంగుబాట్లతో సతమతం

### మావోయిస్టు ఉద్యమానికి భారీ నష్టం

**చర్ల,మార్చి 30, ప్రభాతవార్త :** రెండు దశాబ్దాల పాటు బస్తర్ దండకారణ్యాన్ని ఎదురు లేకుండా తమ కనుసన్నల్లో పాలించిన మావోయిస్టు పార్టీ నేడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. వరుస ఎన్ కౌంటర్లు లొంగుబాట్లతో వందల మంది పార్టీ సభ్యులను మీలీషియా సభ్యులను గ్రామ కమిటీలను కోల్పోతుంది. ఇటువంటి పరిస్థితిలో ఉద్యమాన్ని దండకారణ్యం నుండి నడిపించాలా లేక ఇతర ప్రాంతాలకు వలస( సేఫ్‌జోన్) కి కొంతకాలం తలదాచుకోవాలి అన్న ఆలోచనలో మావోయిస్టు పార్టీ ఇన్నట్లు తెలుస్తుంది. వలస వెళ్లడమా ఇక్కడే ఉండి ఉద్యమాన్ని ఎదుర్కోవడమా మావోల దారెడు అన్న ఆలోచన సానుభూతిపరుల్లో అభిమానుల్లో అలోచన రేకెత్తిస్తుంది..

దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమం తగ్గుముఖం పట్టే సంకేతాల మధ్య ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. 50 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను వదిలి భద్రతా దళాలకు లొంగిపోయిన ఘటన సంచలనం గా మారింది. వీరిలో ప్రధానంగా ఏరియా కమిటీ సభ్యులు పిఎల్‌జిఎ ( పిపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ) పిఎల్‌జిఎ బెటాలియన్ 01, కంపెనీ 02, 07 సభ్యులు.నేషనల్ పార్క్ ఏరియా కమిటీకి చెందిన ఎసిఎం స్థాయి నాయకులు ఉన్నారు.లొంగిపోయిన మావోయిస్టులపై 68 లక్షల రివార్డు ఉంది.లొంగుబాటుకు ప్రధాన కారణాలను చూస్తే భద్రతా దళాల ఒత్తిడి ఒకవైపు ,కొత్త పోలీసు శిబిరాల ఏర్పాటు మరో వైపు.అభివృద్ధి కార్యక్రమాలు రోడ్లు, విద్యుత్, సంక్షేమ పథకాలుమావోయిస్టు పార్టీలో విభేదాలు అవిశ్వాసం పెరుగుతున్న కారణాలు ప్రదానంగా మావోయిస్టు పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.ప్రధానంగా పోలీసులు ఆదివాసిగ్రామాల్లో ప్రజలను చైతన్యపరిస్థితి ప్రోగ్రాంలాంటి నిర్వహిం

>>2

## పేదల సొంతింటికల నెరవేర్చడమే లక్ష్యం

### -మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,మార్చి30,ప్రభాతవార్తప్రతినిధి:** పేదల సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ఆశయమని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం మచిలీపట్టణం గో సంఘంలో 1700 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు, డాక్యుమెంట్లను మంత్రి

>>2

## పేదల సహాయనిధిపై సిఎం ఉగాది తొలిసంతకం

**విజయవాడ,మార్చి30,ప్రభాతవార్తప్రతినిధి:** ఉగాది రోజు పేదలకు సాయంపై సిఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు.అందుకు అనుగుణంగా రూ.38 కోట్ల సహాయ నిధి ఫైలుపై సిఎం ఉగాది రోజు తొలి సంతకం చేసారు. 3,456 మంది పేదలకు లబ్ధి కలుగుతుంది. ఇప్పటివరకు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.281 కోట్లు విడుదలచేసారు. పేదలకు సాయం అందించేందుకు ఉగాది రోజున తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలను ఆదుకునేందుకు సిఎం సహాయ నిధి ఫైలుపై సంతకం చేశామన్నారు. రూ.38 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపారు. దీంతో 3,456 మందిపేదలకు లబ్ధికలుగనుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పటివరకు 23,418 మంది పేదలకు రూ.281.38 కోట్లను ప్రభుత్వం అందించింది. ఎవ్వరికి వైద్య సాయం అందక ఇబ్బంది పడకూడదని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.






ఆదివారం ఉగాది సందర్భంగా దేవాదాయ సమాచార దర్శినిని ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు



హాస్యబ్రహ్మ శంకరనారాయణకు కళారత్న అందిస్తున్న సిఎం చంద్రబాబు

# ప్రపంచంలో తెలుగువారి పాత్ర కీలకం

## ప్రతి ఒక్కరి జీవితంలో ఉగాది కొత్త ఉత్సాహాన్ని నింపాలి

### పలువురు ప్రముఖులకు కళారత్న, ఉగాది పురస్కారాలను ప్రదానం చేసిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి30,ప్రభాతవార్తప్రతినిధి:** చిన్న,చిన్న ఇబ్బందులకు భయపడకండి అన్నింటిని ఆత్మస్థయిర్యంతో ఎదుర్కొందామని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. సంకల్పం పట్టుదల ఉండే ఏమైనా సాధిస్తామన్నారు. ప్రపంచంలో మనదేశం, భారతీయులు అగ్రస్థానంలో ఉండాలని, అందులో 30శాతానికి పైగా తెలుగువారే ఉండాలని సిఎం చంద్రబాబు ఆకాంక్షించారు. భారతీయులు అగ్రస్థానంలో ఉంటే నాయకత్వం వహించే శక్తి తెలుగుజాతికి ఇవ్వాలని అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రులు ఆనం నారాయణరెడ్డి,కందుల దుర్గేష్,కొలసు పార్దసారధి, సిఎస్ విజయానంద్, ఎంఎల్ఏలు బొండా ఉమామశ్వరరావు, గద్దెరామ్మోనరావు, సృజనాత్మ, సంస్కృతి సంస్థ చైర్మన్ పొడపాటి తేజస్విని, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, కార్యనిర్వహణాధికారి రేగుండ్ల మల్లిఖార్జునరావు,మాజీ మంత్రి ఉండవల్లి శ్రీదేవి, జనసేన ఎంఎల్ఏ అధికార భాషా సంఘం పూర్వాధ్యక్షులు కళా ప్రపూర్ణ జీవి పూర్ణచంద్‌లతో కలిసి వెలిగించి సిఎం చంద్రబాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉగాది పచ్చడిని నేతలు స్వీకరించారు. వేడుకల సందర్భంగా పలువురు కళాకారులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పండితులు మాడుగుల నాగఫణిశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ ఏడాది చిన్న,చిన్న కష్టాలు వచ్చిన అంత బాగుంటుందన్నారు. చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం మంచి ఫలితాలు సాధిస్తోందన్నారు.
తెలుగు వారందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, ప్రతి ఒక్కరి జీవితంలో ఉగాది పండుగ నూతన ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. నాగరికత, సంస్కృతి మరిచిపోతే మన ఉనికిని కోల్పోతామన్న చంద్రబాబు, వర్షాలు పడితే సగం సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. సమస్యలను అధిగమించే ఆలోచనలు చేస్తూ ముందుకెళ్లాలని సూచించారు.

**మంచి చెబితే ఎవరూ అర్థం చేసుకోరు**

ఏ కార్యాలయానికి వెళ్లకుండానే పనులు జరిగేలా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చామని చంద్రబాబు తెలిపారు.ఆర్థికకష్టాలు ఉన్నా రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టామని, తాను ఏదైనా మంచి చెబితే ఎవరూ అర్థం చేసుకోరని అన్నారు. జాతీయ రహదారులను ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్నందున బాగున్నాయన్న చంద్రబాబు, సమాజం వల్ల కొందరు ఉన్నతంగా ఎదిగారని తెలిపారు.

రాష్ట్ర ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం కలిస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చనే ఆలోచనలతో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుడు తోంది. ఈ ఉగాది సందర్భంగా మిమ్మలను కోరుతున్నాను. రాష్ట్రంలోని స్థితిమంతులు, బయటప్రాంతాల్లో స్థిరపడిన శ్రీమంతులు కలిసి తమ జన్మభూమిలో పేద కుటుంబాలకు ఎలా ఉపయోగపడవచ్చు అనేదే పి4 విధానం. స్థానిక అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రవాసాంధ్రుల భాగస్వామ్యం, ఊరికి మేలు చేయాలన్న స్ఫూర్తి రగిలించేలా ప్రభుత్వం వారధిలా ఎలా ఉండాలన్నదే దీని ఉద్దేశం. అట్టడుగున ఉన్న ప్రజలకు సంపన్న కుటుంబాల తోడ్పాటే లక్ష్యంగా పి4 కార్యక్రమం సాగనుంది. పేదలకు మద్దతుగా నిలిచేందుగా స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఎవరైనా పి4 వేదికను వినియోగించుకోవచ్చు. ప్రభుత్వ పాత్ర కేవలం ఇరువర్గాలను ఒక వేదికపైకి తీసుకురావడమే. ప్రభుత్వం తరపున ఎవరికీ అదనపు సాయం ఉండదు. ఉన్నతవర్గాల వాళ్లు సాయానికి ముందుకొచ్చేలా వారిలో స్ఫూర్తి నింపటమే ప్రభుత్వ బాధ్యతగా ఉండనుంది. లబ్ధి పొందేవారిని బంగారు కుటుంబంగా, సాయం చేసే వారిని మార్గదర్శిగా పిలవనున్నారు. బంగారు కుటుంబానికి ఎంపికలో ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పి4కి, ప్రభుత్వ పథకాల అమలుకు ఎలాంటి సంబంధం ఉండదు. 5 ఎకరాలు మెట్ట భూమి ఉన్న భూ యజమానులను, ప్రభుత్వ ఉద్యోగులను, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారిని, ఫోర్ వీలర్ వెహికల్ ఉన్నవారిని, 200 యూనిట్లు కన్నా ఎక్కువ విద్యుత్ వినియో గిస్తున్న వారిని, మున్సిపల్ ఏరియాలో సొంత ఆస్తి ఉన్నవారిని, ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న కుటుంబాల వారిని ఈ కార్యక్రమం నుంచి మినహాయించారు. ఉగాది పండగ రోజున మార్గదర్శి బంగారు కుటుంబం అనే వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు

**పంచాంగ శ్రవణం అవసరం ఎంతో ఉంది**

ఉగాది రోజున పంచాంగ శ్రవణం అవసరం ఎంతో ఉందని సిఎం చంద్రబాబు అన్నారు. పంచాంగ శ్రవణంలో పండితులు చెప్పే అంశాలు జీవితగమనానికి ప్రణాళికను ఇస్తాయన్నారు. భవిష్యత్తును ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ఆలోచన పెరుగుతుందన్నారు. ముందుగా విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం జ్యోతిని వెలిగించి సిఎం చంద్రబాబు ఉగాది సంబరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని నిర్వాహకులు అతిథులకు అందచేశారు. అనంతరం పండితులు, శతావధాని మాడుగుల నాగఫణిశర్మ పంచాంగ శ్రవణం చేశారు. తదుపరి సిఎం చేతుల మీదుగా టిటిడి, వ్యవసాయ, ఉద్యానవన శాఖల విశ్వావసునామ సంవత్సర పంచాగాలను విడుదలచేశారు. అలాగే సాంస్కృతిక శాఖ వార్షిక ఉత్స వాల కేలండర్ ను సీఎం ఆవిష్కరించారు. ఇక చివరగా సాహిత్యం, కళలు, జర్నలిజం, హాస్యావధానం, బాల సాహిత్యం, పద్యం, సాంస్కృతిక సేవలు, మిమిక్రీ, బుర్రకథ, హరికథ, నాటకం, సామాజిక సేవ, సినిమా ఇలా అనేక రంగాల్లో సేవలందించిన ప్రముఖులు 202 మందికి ఈ అవార్డులను ప్రకటించగా వీరిలో 86 మందికి కళారత్న(హంస), 116 మందికి ఉగాది పురష్కారాలు ప్రతి ఒక్కరికీ సిఎం చంద్రబాబు నాయుడు స్వయంగా అందించారు.

# పేదల సొంతింటికల నెరవేర్చడమే లక్ష్యం

>> అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని చక్కగా వర్షాలు కురిసి చక్కగా పంటలు పండాలని, ఉపాధి అవకాశాలు బాగా పొందాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టే అబివృద్ధి కార్యక్రమాలకు భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నామన్నారు. 201419లో తమ ప్రభుత్వం మునిసిపల్ ప్రాంతాలలో జి ప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు మచిలీపట్నం మున్సిపాలిటీలో 6,400 ఇళ్లు మంజూరు అయితే అందులో 4 వేల ఇల్లు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈలోగా ఆగిపోయాయన్నారు. అందులో 2,300 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. ఈరోజు 1700 మందికి ఇంటి తాళాలతో పాటు డాక్యుమెంట్లు అందజేశామని, ఉగాది పండుగ కానుకగా ఇచ్చామని, ఇదొక శుభదినం అన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇంకా 1800 మంది ఇల్లు ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఇంకా డ్రా తీసినవారు 4,200 మంది ఉన్నారని వారికి కూడా ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. గతంలో సెంటు భూమి ఇచ్చిన వారు ఇల్లు నిర్మించుకుంటున్నారని, కొంతమందికి 2 సెంట్లు భూమి ఇవ్వనున్నామని ఒక్కొక్క ఇల్లు 3 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించడం జరుగుతుందన్నారు. ఎస్సీ ఎస్టీలు అయితే అదనంగా 50 వేల రూపాయలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ,మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, స్థానిక నాయకులు గొర్రెపాటి గోపీచంద్ గృహ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# టిటిడిలో ఇక వారి డొనేషన్ పాసు బుక్కులు రద్దు !

## సేంద్రీయ వ్యవసాయ రైతులకిచ్చిన సౌకర్యాలు నిలుపుదల

**తిరుమల,మార్చి 30ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి నిత్యకల్యాణ చక్రవర్తి గాక భోజనప్రియుడుగా కూడా ఆలయ అర్చకులు చెబుతారు. నిత్యం మూడుపూటలా ఏడుకొండల స్వామికి రుచిగా శుచిగా ఆలయంలోపల పోటులో పరిచారకులు స్వయంగా తయారుచేసే అన్నప్రసాదాలకు వినియోగించే ఆహారపదార్థాలను పూర్తిగా సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులనే సేకరించాలని 2021లో అప్పటి రాష్ట్రప్రభుత్వం, టిటిడి పాలకమండలి నిర్ణయించింది. 2019-2020లో ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందడంతో పౌష్టికాహారాన్ని స్వీకరించాలని అప్పట్లోనే కేంద్ర ఆరోగ్యశాఖ సూచించింది. దీంతో ఆ ఏడాది తిరుమల తిరుపతిదేవస్థానం కూడా దేవునికి తయారుచేసి నివేదించే అన్నప్రసాదాలకు పూర్తిగా సేంద్రీయ వ్యవసాయ పంటలను పండించే ఉత్పత్తులను వాడాలని ఆమోదించింది. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించి,సేంద్రీయ ఉత్పత్తులతో తయారు చేసే నిత్య అన్న ప్రసాదాలనురుచిగా శుచిగా వండి నైవేద్యంగా సమర్పించారు. దీనికోసం కొందరు రైతులను అప్పటి టిటిడి అధికారులు,పాలకమండలి ఎంపిక చేశారు. ఎంపిక చేసిన సేంద్రీయ వ్యవసాయం చేసేరైతులకు దాతల పేరున అన్ని ప్రయోజనాలు కల్పించాలని కూడా ఆమోదించారు. అయితే ఈ సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులతో తయారుచేసిన అన్నప్రసాదాలు రుచిగా లేదనే విమర్శలు, అసంతృప్తి భక్తులువ్యక్తంచేశారు. అంతేగాక ఈ అన్నప్రసాదాలు నివేదించిన మూడునాలుగు గంటల తరువాత తినడానికి కూడా బాగుండటం లేదనేది భక్తుల నుండి వినిపించాయి. అయినా అప్పటి టిటిడి అధికారులు దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. టిటిడి పథకాలకు, ట్రస్ట్‌లకు లక్షలాది రూపాయలు, కోట్ల రూపాయలు విరాళాలుగా ఇచ్చే దాతలకు కల్పించే సదుపాయాలు సేంద్రీయ వ్యవసాయం చేసే టిటిడికి ఉత్పత్తులు సరఫరా చేసిన రైతులు 85మందివరకు దాతలుగా గుర్తించి, దాతల పాసుపుస్తకాలను జారీచేసింది. ఏడాదిలో మూడుసార్లు వెంకన్న విఐపి బ్రేక్ దర్శనాలు చేసుకునే వెసలుబాటు కల్పించారు. అయితే ఈ వ్యవహారంలో కొందరు సేంద్రీయ వ్యవసాయ రైతులేకాదని, కొందరు ఏకంగా తమకున్న పలుకుబడి ఉపయోగించి అప్పట్లో టిటిడి పాలకమండలిని, అధికారులను ఒప్పించి ఈ పాసుపుస్తకాలు అందుకున్నారు. వీటిని కొందరు దుర్వినియోగం చేశారనేది గత ఏడాది జూన్‌లో ఏర్పాటైన ఎన్‌డిఎ కూటమిలోని ప్రభుత్వం, టిటిడి పాలకమండలి గుర్తించింది. విజిలెన్స్ అధికారులు కూడా దీనిపై విచారణ చేసి టిటిడి నిబంధనలకు విరుద్ధంగా ఈ రైతులకు ప్రయోజనాలు చేకూర్చారని తేల్చారు. దీంతో మూడునాలుగు నెలల క్రిందటే టిటిడిలో దేవునికి తయారుచేసి నివేదించే అన్నప్రసాదాలకు సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాను నిలిపివేసింది. ఈ వ్యవహారంపైప్రస్తుత టిటిడి పాలకమండలి దృష్టి సారించింది. ఎవరి ప్రయోజనాల కోసం సేంద్రీయ ఉత్పత్తులను దేవుని ప్రసాదాల తయారీకోసం వినియోగించారు?సరఫరా చేసిన వాళ్లకు, దాతలుగా అవకాశం కల్పించిన ఆ రైతులకు సమకూర్చిన ప్రయోజనాలపై నివేదిక తెప్పించారు. దీంతో వారంరోజుల క్రిందట తిరుమలలో జరిగిన టిటిడి పాలకమండలి సమావేశంలో సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల రైతులకు ఇచ్చిన దాతల పాసుపుస్తకాలను రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు .అంతేగాక ఆ వ్యవసాయ ఉత్పత్తులను నిలుపుదలచేసినట్లు తెలిపారు.

# ఎఐ స్టార్టప్‌ను నెలకొల్పి స్ఫూర్తిగా నిలిచావు

## దివ్యాంగ విద్యార్థి రఘునాథరెడ్డిని అభినందించిన మంత్రి లోకేష్

### మంత్రి చొరవతో గతంలో ఎన్ఐటి కాలికట్‌లో సీటు పొందిన విద్యార్థి

### ఇంటర్ ధృవపత్రంలో తప్పును సరిదిద్ది గతంలో 25 మంది దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్ కాపాడిన మంత్రి లోకేష్

**విజయవాడ,మార్చి30,ప్రభాతవార్తప్రతినిధి:** విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో గతంలో ఎన్ఐటి కాలికట్‌లో సీటు పొందిన దివ్యాంగ విద్యార్థి సి.రఘునాథరెడ్డి ఎఐ స్టార్టప్‌ను నెలకొల్పి పలువురికి స్ఫూర్తిగా నిలిచాడు. గతేడాది జులైలో దేశవ్యాప్తంగా వివిధ ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు పొందిన దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు సర్టిఫికెట్ అప్‌లోడ్ విషయంలో సమస్య ఎదురైంది. సదరు సమస్యను వాట్సాప్ ద్వారా మంత్రి లోకేష్ దృష్టికి తీసుకురావడంతో మెరుపు వేగంతో స్పందించారు. దివ్యాంగ విద్యార్థుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక జిఓ విడుదల చేసి 25 మంది విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడారు. దీంతో వారంతా పేరెన్నికగన్న ఐఐటి, ఎన్ఐటి వంటి జాతీయస్థాయి ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశం పొందారు. తమకు అండగానిలిచిన మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి చొరవతో విజయవాడకు చెందిన సి.రఘునాథరెడ్డి ఎన్ఐటీ కాలికట్‌లో సీటు పొందాడు. తన ప్రతిభతో ఇటీవల విద్యార్థులో నైపుణ్యం, నెట్ వర్కింగ్ సామర్థ్యాలపెంపునకు ఎన్ఐటి స్టార్టప్ ఇంక్యుబేటర్ ప్రోత్సాహంతో ఎఐ స్టార్టప్‌ను నెలకొల్పాడు. గతంలో మంత్రి లోకేష్ ఇచ్చిన సహకారం, మార్గదర్శకంవల్లే రాణించగలగుతున్నానని రఘునాథరెడ్డి ఎక్స్ ద్వారా కృతజ్ఞతలు తెలిపాడు. రఘునాథరెడ్డి ట్వీట్‌పై స్పందించిన మంత్రి నారాలోకేష్.. మీ ప్రయాణంనిజంగా స్ఫూర్తిదాయకమన్నారు. మీ విజయంలో నేను చిన్న పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఎఐ స్టార్టప్‌ను నెలకొల్పిన రఘునాథరెడ్డిని, బృందాన్ని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.




ఆదివారం ఎఐ స్టార్టప్‌ను నెలకొల్పిన దివ్యాంగ విద్యార్థి రఘునాథరెడ్డిని మంత్రి లోకేష్ అభినందిస్తున్న దృశ్యం

# జనం విలవిల

>> జ్యూసుల స్థానంలో ఆరోగ్యానికి మేలు చేసే ప్రత్యామ్నాయాలు చాలా ఉన్నాయి అంటున్నారు నిపుణులు. జ్యూసులు తాగడం కన్నా పండ్లను నేరుగా తినడమే ఆరోగ్యానికి మంచిది అంటారు నిపుణులు. అందుకు కారణం జ్యూసులు రుచిగా ఉండటం కోసం వాటిల్లో చక్కెర కలుపుతారు. అయితే నిత్యం ఇలా చక్కెర తీసుకోవడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు.జ్యూసులకు బదులుగా కొబ్బరి నీరు, నిమ్మరసం, మజ్జిగ, నీటి శాతం అధికంగా ఉండే పుచ్చకాయ వంటి పండ్లను తినడం మంచిదని న్యూట్రిషన్లు అంటున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 31-03-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల విదియ ఉ.9.12, తదియ తె.5.42
అశ్వని మ.1.46
వర్జ్యం రా.10.19-రా.11.45
దు.మ.12.37-1.26, 2) మ.3.04-3.53
శుభసమయం : ఉ.9.15-10.10
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** ఎంతో సన్నిహితంగా ఉన్నవారు మీకు విరుద్ధంగా మారి మిమ్మల్ని నిందారోపణలకు గురి చేస్తారు.

**వృషభం :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఇంక్రిమెంట్లు లభిస్తాయి.

**మిథునం:** పిల్లల క్షేమం కోసం, మీ భవిష్యత్తు కోసం ఎక్కువ యోచిస్తారు. విదేశీ పర్యటనలు.

**కర్కాటకం:** చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు.

**సింహం:** స్థిరాస్తి వృద్ధి చెందుతుంది. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. వస్త్రలాభం.

**కన్య :** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**తుల :** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. షేర్ల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన ఒకానొక విషయంలో ఏ నిర్ణయం తెలుసుకోలేని సందిగ్ధావస్థను ఈ రోజు ఎదుర్కొంటారు.

**ధనుస్సు:** శరీర ఆరోగ్యం గురించి తగిన జాగ్రత్తలు ముందుగానే తీసుకోవలసి వుంటుంది.

**మకరం:** ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదాపడకుండా చూడండి. శుభవార్తలు అందుకొంటారు.

**కుంభం:** అకాల భోజనం, శారీరక శ్రమ ఈ రోజు అనివార్యం. సోదరుల కలయిక.

**మీనం:** వ్యాపార లావాదేవీలలో ముఖ్యంగా అమ్మకాలలో నష్టం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇక 'బంగారు కుటుంబాలు'

>> కార్యక్రమానికి మార్గదర్శులుగా గ్రీన్ కో ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ అధినేత అనిల్ కుమార్ చలమలశెట్టి, ఉక్కు పారిశ్రామిక వేత్త సజ్జన్ కుమార్ గోయంకా, మెఘా ఇంజినీరింగ్ అధినేత పివి కృష్ణారెడ్డి ఉండనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి, డిబివి స్వామి, కూటమి ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 2047 నాటికి మన ప్రజలు ఆదాయంలో వరల్డ్ నంబర్ 1గా నిలుస్తారని అన్నారు. వారిలో 30 శాతం మంది తెలుగువారే ఉండాలనేది తన ఆకాంక్షని తెలిపారు. పి4 ప్రోగ్రాం అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం చేపడుతున్నారు. మొదటగా నాలుగు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపడతారు. ఆయా గ్రామాల్లో 5,869 ఫ్యామిలీలకు లబ్ధి చేకూరుతుంది. సంపద అధికంగా ఉన్న ఫ్యామిలీలు అట్టడుగున ఉన్న ఫ్యామిలీలకు సపోర్టుగా నిలబడటమే ఈ కార్యక్రమ ఉద్దేశం. ఈ ప్రోగ్రాంలో భాగంగా లబ్ధిదారులను గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న సమాచారంతో పాటు సర్వే, గ్రామసభల ద్వారా గుర్తిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 40 లక్షల ఫ్యామిలీలు దీనికి అర్హులుగా నిలుస్తుందొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో సర్వే చేశారు. ఈ సర్వే ద్వారా అట్టడుగున ఉన్న వారిని గుర్తిస్తారు.
లబ్ధిదారుల ధ్రువీకరణ అనంతరం వారి వివరాలను సమృద్ధి బంధనమ్ ప్లాట్‌ఫాంలో ఉంచుతారు. లబ్ధిపొందాల్సిన ఫ్యామిలీలను సాయం చేసే ఫ్యామిలీలతో అనుసంధానించడమే ఈ పీ4 విధానంలో ప్రభుత్వం పాత్ర. నేరుగా సర్కారు ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించదు. ఆయా కుటుంబాలు ఇందులో స్వచ్ఛందంగానే పాల్గొనవచ్చు. ఈఏడాది ఆగస్టు నాటికి ఏపిలో మొత్తం 5 లక్షల కుటుంబాలను భాగస్వామి అయ్యేలా అధి.కారులు చర్యలు తీసుకుంటున్నారు.
ఈ విధానం ద్వారా అట్టడుగున ఉన్న 20 మందికి మేలు జరుగుతుంది. ప్రభుత్వం, ప్రైవేటుతో పాటు ప్రజలు భాగస్వాములై పేదరిక నిర్మూలన కోసం పనిచేయాల్సి ఉంటుంది. సంపదలో ఉన్నత స్థితిలో ఉన్న వారిలో 10 మంది అట్టడుగున ఉన్న వారిలో 20 మంది పేదలను దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. దీని ద్వారా ఆర్థిక అసమానతలు రూపుమాపొచ్చని ప్రభుత్వం భావిస్తోందని ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు వివరించారు. తెలుగు ప్రజలు ఆత్మస్థయిర్యం పట్టుదల ఉన్నవారిని ఈ సభలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. కొంచెం అండగా ఉంటే కొంతలబ్దిని సాధిస్తారన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు దూర దృష్టితో పి4 కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఇది సామాజిక బాధ్యత, ఇతరుపట్ల బాధ్యత,మనకు మనం అభివృద్ధి చెందడానికి వేసే అడుగుగా వర్ణించారు. సమాజానికి సాయం చేసేవాళ్లు చాలా మంది ఉన్నారని వారంతా చంద్రబాబు దూరదృష్టితో చేపట్టిన కార్యక్రమానికి అండగా ఉండాలన్నారు. చాలా మంది ధనికులకు ఎలా సేవ చేయాలో తెలియదని, గ్రామాలను దత్తత తీసుకునేందుకు అనేక మంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవడం కూడా చాలా మందికి తెలియదన్నారు. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా కష్టపడి పని చేస్తారని భారతీయులకు పేరుందని వివరించారు. తమ కంపెనీల్లో సుమారు 4 లక్షల మంది పని చేస్తున్నట్లు తెలిపారు. భయపడకుండా కష్టపడితే అనేక అవకాశాలు వస్తాయని అన్నారు. పి4 ద్వారా కృష్ణా జిల్లా ప్రజలకు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నామని కృష్ణారెడ్డి స్పష్టంచేశారు.



పి4 కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు

# మావోయిస్టుల లొంగుబాటు



భద్రతాదళాల వద్ద లొంగిపోయిన మావోయిస్టులు

>> చదమే కాకుండా మావోయిస్టులకు సహకరించొద్దని జనజీవన స్రవంతిలో మావోయిస్టు కలవాలని ఇంటికి వెనుతిరగాలని ప్రచారం రూపొందుకోవడం ప్రధానంగా ఈ లొంగుబాటులకు కారణంగా కనిపిస్తుంది. ఇప్పటి వరకు ప్రభుత్వ అధికార గణాంకాల ప్రకారం 2024 సంవత్సరం నుండి ఇప్పటి వరకు 656 మంది మావోయిస్టులు అరెస్టు కాగా346 మంది లొంగుబాట్లు జరిగాయి.141 ఎదురు కాల్పుల్లో మృతి చెందారు.ఈ ఏడాది 2025 (జనవరిమార్చి) వరకు 153 మంది అరెస్టు 157మంది లొంగిపోయారు. 83 ఎదురు కాల్పుల్లో మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.మావోలొంగుపోయిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బస్తర్ ఐజి సుందర్ రాజ్ మాట్లాడుతూ ఇది ప్రభుత్వ పునర్వాస విధానం మరియు భద్రతా దళాల విజయమని చెప్పారు. మావోయిస్టుల లొంగుబాటుతో ఆ ప్రాంతంలో శాంతి నెలకొనటానికి ఇది మంచి సూచన అని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తామని భవిష్యత్తులో వీరికి మరిన్ని పునరావాస పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. భద్రతా వ్యూహాలు భవిష్యత్ ప్రణాళికలు చూస్తే ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేస్తూ కొత్త పోలీస్ శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. మావోయిస్టుల ప్రభావాన్ని తగ్గించేందుకు, విద్య, వైద్యం, రహదారుల నిర్మాణంపై దృష్టి పెట్టింది.కాగా మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఇటీవల మావోయిస్టు పార్టీ ఛత్తీస్గఢ్ కమిటీ కేంద్ర కమిటీ.జగన్ లో పేరుతో వరుస లేఖలు.. అలాగే పోలీసు వాహనాలు ముఖ్యంగా బీజాపూర్ జిల్లా గొర్ల అడవి ప్రాంతంలో పోలీసు వాహనంపై ఐడి దాడి సంచలనంగా మారింది మరోవైపు లేఖలో మైనర్లు సైతం మావోయిస్టు పార్టీ వైపు చూస్తున్నారని. నవరత్నం మావోయిస్టు పార్టీకి అవసరమని అలాగే రిక్రూట్మెంట్లు సంబంధించి.. ముఖ్యంగా ట్రైనింగ్ చేస్తున్న మావోయిస్టుల వీడియో అంతర్జాలంలో వైరల్ గా మారటం మావోయిస్టు పార్టీ వ్యూహం ఏంటనేది కొంత అనుమానాలు దారి తీస్తుంది అయితే మావోల వ్యూహాలకు ప్రతి వ్యూహాలు రచిస్తూ దండకారణ్యంలోకి భద్రతా బలగాలు దూసుకెళ్తున్నాయి. భద్రత బలగాలు 2026 మార్చి 30 కల్లా మావోయిస్టు పార్టీ రూపురేఖలు లేకుండా చేస్తామని మావోయిస్టు రహిత దేశంగా మారుస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటనతో భద్రత బలగాలు అడవుల్లో భారీగా సోదాలు నిర్వహిస్తున్నాయి..ఐతే ఐదు ఆరువేల మందికి పైగా అడుగడుగున అడవిని జలవబడుతున్నాయి అంటే భద్రతా బలగాలు ఏ రీతిలో మావోయిస్టులపై విరుసుకు పడుతున్నాయంటే అర్థం అవుతుంది.అందుకు ఈ మధ్యకాలంలో జరిగిన వరస ఎన్ కౌంటర్లే ఉదాహరణ. ఏదైనాప్పటికీ వరుస ఎన్కౌంటర్లు వరుస లొంగుబాట్లు వరుస అరెస్టులతో మావోయిస్టు పార్టీకి భారీ నష్టం వాటిల్లుతుందని చెప్పవచ్చు.

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న తమిళనాడు ప్రభుత్వ బస్సు

## జాతీయ రహదారిపై తృటిలో తప్పిన పెను ప్రమాదం

**తడ, మార్చి 30 ప్రభాతవార్త:** తడ బస్టాండు వద్ద ఆదివారం ఉదయం ఆర్టీసీ బస్సును తమిళనాడు బస్సు వెనుక నుంచి ఢీకొంది. అయితే అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు కనిగిరి నుంచి చెన్నైకి వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను దించి నిలిచి ఉండగా, వెనుక నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్లే తమిళనాడు ప్రభుత్వ బస్సు ఢీకొంది. ఆర్టీసీ బస్సులో వెనుక వైపు కూర్చున్న ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. అయితే అక్కడ రెండుబస్సులు చిక్కుకుపోవడంతో చెన్నై వైపు వెళ్లే పలువాహనాలు జాతీయ రహదారిపై నిలిచిపోయాయి. పోలీసులు క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న బస్సులను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం ఆర్టీసీ బస్సులోఉన్న ప్రయాణికులను అటు వైపు వెళ్లే మరికొన్ని బస్సుల్లో ఎక్కించి పంపించారు. తమిళనాడు ప్రభుత్వ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి ఆర్టీసీబస్సును ఢీకొన్నట్లు కనిగిరి బస్సు డ్రైవర్ లక్ష్మినారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కొండప్పనాయుడు ఆధ్వర్యంలో బస్సులను పోలీసుస్టేషన్‌లో ఉంచి కేసు దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వారు అక్కడికక్కడే స్థానిక ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు.

# తిరువూరు ఎమ్మెల్యే వివాదాస్పద వైఖరిపై సిఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి

**విజయవాడ,మార్చి30,ప్రభాతవార్తప్రతినిధి:** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వివాదాస్పద వైఖరిపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకో కుంటే నిర్ణయం కఠినంగానే తీసుకొంటి అంటూ మండిపడ్డారు.ఎక్కడ లేని సమస్యలు తిరువూరు లోనే ఎందుకొస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్యకర్తల మనోభావాల మేరకే ఎవ రైనా పనిచేయాలని స్పష్టం చేశారు.తిరువూరు ఎంఎల్ఏ వైఖరిపై నియోజకవర్గ టీడీపీ కార్య కర్తలు పలు ఆరోపణలు చేస్తున్నారు.వ్యవహారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లింది.ఈ పరిస్థితుల్లో ఆయన వ్యవహారశైలిపై సీఎం ఆగ్రహంతో ఉన్నారు.వివాదాలు పునరావృతం కాకుండా కార్యకర్తల అభీష్టం మేరకు వేరొకరిని ఇంఛార్జిగా పెట్టడం లేదా సమన్వయ కమిటీని ఏర్పాటు చేసే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు తెలిసింది.

**కొలికపూడి తీరుపై సీఎం అసంతృప్తి:** తిరువూరు నియోజకవర్గంలో ప్రతిసారీ ఏదో ఒక వివాదం తలెత్తడంపై సీఎం చంద్రబాబు అస హనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి పరిస్థితులు, కార్యకర్తలు లేవనెత్తిన అం శాలు, 10 నెలలుగా జరిగిన సంఘటనల్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘు రామ్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని చంద్రబాబుకు వివరించారు.

అన్ని వర్గాల నుంచి విస్తృత స్థాయిలో సమాచారం సేకరించి, కార్య కర్తలతో మాట్లాడి ఓ నిర్ణయానికి రావాలనే ఆలో చనలో సీఎం ఉన్నట్టు తెలుస్తోంది.

# గురుకులాల్లో ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

**విజయవాడ మార్చి 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల కళాశాలల్లో ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువును ప్రభుత్వం పొడిగించిందని కృష్ణా జిల్లా నిమ్మకూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డి.మధుసూదన రావు శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని నిమ్మకూరు పులిగడ్డ, విజయవాడ, మచిలీప ట్నం, ముసునూరు గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆయా పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు 6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీల్లో ప్రవేశాలకు గడువు పొడిగించిందన్నారు. ఏపీఆర్ఎస్ సెట్-2025 నిమ్మకూరు, నాగార్జునసాగర్, తాటిపూడి, గుం టూరు, వెంకటగిరి జూనియర్ గురుకుల కళాశా ల్లో ప్రవేశాలకు ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్షకు ఆన్లైన్ దరఖాస్తుల గడువు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 6వరకు పొడిగించిందన్నారు.

# చంద్రబాబు చేస్తున్న కృషికి కృతజ్ఞతలు

## ఎపి హోటల్స్ అసోసియేషన్ల ప్రతినిధులు

**విజయవాడ మార్చి 30 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో ఎక్కడాలేని సదుపాయాలు రాష్ట్రంలోని టూరిజం రంగానికి కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్లు హోటల్స్ అసో సియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ఆయనతో 10 నిమిషాలు అనుకున్న సమావేశం 40 నిమిషాలు జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. గత 9 నెలలుగా టూరిజం అభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషికి దేశంలోని అన్ని హోటల్స్ సంఘాల తరుపున కృతజ్ఞతలు. అరకు లోయ, విశాఖపట్నం అభివృద్ధితో పాటు రాష్ట్రానికి అంతర్జాతీయ విమాన సర్వీసులను కోరాం, ఏపీకి ఉన్న తీరం పొడవునా 20 నుంచి 25 ప్రాంతాల్లో అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఉంది. అంతర్జాతీయ సంస్థలన్నింటినీ ఒకే వేదికపై తీసుకొచ్చి దానిపై ఒక నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రం గ్రోత్ రేట్ 8 శాతం నుంచి 22 శాతానికి తీసుకెళ్లాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. ఫెడరేషన్స్ ఆఫ్ హోటల్స్, రెస్టారెంట్ అసోసియేషన్ సమావేశాన్ని విజయవాడ లేదా విశాఖపట్నంలోని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టిన ఆల్ ఇండియా హోటల్ అసో సియేషన్‌కు అధ్యక్షుడు అయినందుకు ఆయనను చంద్రబాబు అభినందించారు. రాత్రి 12 గంటల వరకు హోటల్స్ తెరిచే ఉంచుకునే ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించారు. మిగతా రాష్ట్రాల్లో టూరిజం డెవలప్మెంట్ విధానాలను అడిగి తెలుసుకున్నారు అనిఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆల్ ఇండియా హోటల్స్ అసోసియేషన్ సౌత్ ఇండియా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాం పలు రాష్ట్రాల హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



ఒంటిమిట్ట సీతారాములకల్యాణానికి రావాలని సీఎం చంద్రబాబు నాయుడును ఆహ్వానిస్తున్న టిటిడి చైర్మన్, ఈవో, ముస్తాబవుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయం

# ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి రావాలని సిఎంకు ఆహ్వానం

**రాజంపేట అర్బన్, మార్చి 30 ప్రభాతవార్త:** ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట శ్రీకోదండ రాముల యం లో జరిగే సీతారాముల కళ్యాణ మహోత్సవానికి రావాలని ముఖ్యమంత్రివర్యులు నారా చంద్ర బాబు నాయుడును తిరుమల తిరుపతి దేవస్థా నం ఆహ్వానించింది. ఆదివారం ఉగాది పర్వది నాన ముఖ్యమంత్రిని తిరుమల తిరుపతి దేవస్థా నం చైర్మన్ బిఆర్ నాయుడు, ఇవో శ్యామలరావు కలిసి ఆహ్వాన పత్రికను, శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. ఒంటిమిట్ట శ్రీ సీతా రాముల కళ్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 3న "హరిద్రా ఘటనం"తో అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఉదయం గర్భాలయం లోపల పసుపు కొమ్ములకు, రోళ్ళు, రోకళ్లకు స్వామి పాదాల చెంత ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని పసుపు కొమ్ములను పోసి సాంప్రదాయ బద్దంగా రోలు లో దంచనున్నారు. తద్వారా శ్రీ సీతా రామ కల్యాణ మహోత్సవ ఏర్పాట్లు ప్రారంభమవు తాయి. పసుపు దంచే కార్యక్రమంలో వచ్చిన పసుపును ఉత్సవ వరులకు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో తలం బ్రాల తయారీకి ఉపయోగిస్తారు.ఈ నెల4న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఈనెల 11న జరిగే సీతారాముల కల్యాణంకు సంబం ధించిన ఏర్పాట్లపై సీఎంకు వారు వివరించారు.

# చిన్న కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపు: మంత్రి పయ్యావుల

**విజయవాడ,మార్చి30,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో ఆదివారంఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ భేటీ అయ్యారు. ఆర్థిక శాఖ అధికారులతో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు పయ్యావుల భేటీ కీలక ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులపై కసరత్తు చేశామని తెలి పారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మీడి యాతో మాట్లాడారు. బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేస్తున్నామని అన్నారు. రూ. 2 వేల కోట్ల మేర ఏపీ ఆర్థిక శాఖ బిల్లుల చెల్లింపులు చేపట్టనుందని చెప్పారు. సుమారు 17 వేల మందికి ఏపీ ఆర్థిక శాఖ బిల్లులు చెల్లించనుందని మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. 9 వేల మంది చిన్న కాంట్రా క్టర్లు, 8 వేల మంది నీరుచెట్టు లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు చేస్తున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. దీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న వివిధ బిల్లుల చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. సాధ్యమైనంత మేరకు



ఫిఫో పద్ధతిని పాటిస్తూ చెల్లింపులు జరపాలని మంత్రి పయ్యావుల కేశవ్ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. మొత్తం విడుదల చేస్తున్న బిల్లుల్లో రూ. 2000 కోట్లల్లో 90 శాతం చిన్న కాంట్రాక్టర్లకు.. కేవలం 10 శాతం మాత్రమే పెద్ద కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరపనున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రూ. కోటి లోపు ఉన్న బిల్లులే ప్రాధాన్యంగా చెల్లింపుల ప్రక్రియ జరుగుతోందని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. నీరుచెట్టు, పాట్ హోల్ ఫ్రీ రోడ్లు, నాబార్డు పనులకు బిల్లుల చెల్లింపులు చేస్తున్నామని ప్రకటించారు. ఇరిగేషన్ మెయింటనెన్స్ బిల్లులతో పాటు పోలవరం ప్రాజెక్టుకూ కొంత మొత్తం బిల్లులను విడుదల చేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించాలన్న సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో పని చేస్తున్నామని తెలిపారు. ఎన్ని ఇబ్బందులున్నా పెండింగ్ బిల్లులు చెల్లిస్తున్నామని అన్నారు. ఏపీ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడడానికి బిల్లుల చెల్లింపులు దోహద పడతాయని చెప్పారు. మూడు, నాలుగేళ్ల నుంచి పెండింగులో ఉన్న బిల్లులను చెల్లిస్తున్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించాలన్న సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో పని చేస్తున్నాం.ఎన్ని ఇబ్బందులున్నా పెండింగ్ బిల్లులు చెల్లిస్తున్నాం.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పడడానికి బిల్లుల చెల్లింపులు దోహద పడతాయి.మూడునాలుగేళ్ల నుంచి పెండింగులో ఉన్న బిల్లులను చెల్లిస్తున్నామని మంత్రి తెలిపారు.

# కన్నుల పండువగా మల్లన్న రధోత్సవం

## రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకారం



ఆలయ పురవీధుల్లో ఊరేగిన రథోత్సవం

**శ్రీశైలం ప్రాజెక్టు, మార్చి 30, ప్రభాతవార్త:** శ్రీగిరిక్షేత్రంలో ఉగాది మహోత్సవముల సంద ర్భంగా నాల్గవరోజైన ఆదివారం నాడు శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు జరిపించ బడ్డాయి.ఆ తరువాత స్వామివారి యాగశాలలో చండీశ్వరపూజ, మండపారాధనలు, లోక కల్యాణం కోసం జపానుష్టానాలు రుద్రహోమం నిర్వహిం చబడ్డాయి.అదే విధంగా ఉదయం అమ్మవారి యాగశాలలో చండీహోమం జరిపించబడ్డాయి. ఉత్సవములో భాగంగా అమ్మవారికి విశేషకుం కుమార్చనలు, నవావరణార్చనలు చేయడం జరిగింది. కాగా సాయంత్రం 5.30గంటలకు సాయంకాల పూజలు, జపానుష్టానములు జరిపిం చబడ్డాయి. ఉగాదిమహోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంకాలం రదోత్సవంలో సంప్రదాయాన్ని అనుసరించి ముందుగా రధాంగపూజ, రధాంగహోమం, రధాంగబలి, కార్యక్రమాలు జరిపించబడ్డాయి.రధాంగబలిలో వసం తంతో నింపిన గుమ్మడికాయలు, కొబ్బరి కాయ లు, కుంభం(అన్నరాశి)సాత్వికబలిగా సమర్పిం చబడ్డాయి.తరువాత శ్రీస్వామిఅమ్మవార్ల రధం పైకి వేంచేబు చేయించి రధోత్సవం జరిపిం చబడింది.

ఈ రధోత్సవ దర్శనం వలన సర్వపాపాలు తొలగిపోతాయని,కోరిన కోరికలు నెరవేరుతా యని చెప్పబడుతోంది. కాగా రధోత్స వం సందర్భంగా రధానికి విశేషంగా పుష్పా లంకరణ చేయడం జరిగింది.రధోత్సవంలో కోలాటం, చెక్కభజన,జానపద పగటి వేశాల ప్రదర్శన,కేరళ కథాకేళి,తప్పెట చిందు,కర్ణాటక జాంజ్,వీరగాసీ, కొమ్మువాయిద్యం,కన్నడ జాన పదడోలు, నందికోలుసేవ, మొదలైన కార్యక్ర మాలను ఏర్పాటు చేయడం జరిగింది.

ఉగాది ఉత్సవాలల్లో చేయబడే శ్రీఅమ్మవారి అలంకా రంలో భాగంగా ఆదివారంనాడు అమ్మవారి ఉత్సవమూర్తికి రమావాణీ సేవిత రాజరాజేశ్వరీ అలంకారం,అలంకారమూర్తికి విశేషపూజలు జరిపించబడ్డాయి.చతుర్భుజాలు కలిగిన ఈ దేవి పాశం,అంకుశం, పద్మం, చెరుకుగడను ధరించి దర్శనం ఇచ్చారు.

# డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ విభాగంలో న్యూట్రిఫుల్ యాప్‌కు మొదటి బహుమతి

## హార్షం వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, భువనేశ్వరిపై ప్రశంసలు

**విజయవాడ,మార్చి30,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కు చెందిన న్యూట్రిఫుల్ యాప్, ఈ సంవత్సరం జరిగిన స్కోచ్ అవా ర్డులలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో మొదటి బహుమతిని గెలుచుకుంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిని ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అభినందించారు. నారా భువనేశ్వరి న్యూట్రిఫుల్ బృందానికి అభినందనలు అంటూ చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు. అందరికీ ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిం చడంలో వారు చేస్తున్న కృషి అభినందనీ యమని, వారికి మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలోని ఈ యాప్‌కు 4 లక్షలకు పైగా ఎన్‌రో ల్మెంట్‌లు ఉన్నాయని. ఆరోగ్య సంరక్షణ



స్కోచ్ అవార్డు స్వీకరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ముఖ్య ఉద్దేశంగా ఇది పనిచేస్తూ, 4 లక్షలకు పైగా ఉచిత సంప్రదింపులు మరియు ఆహార ప్రణాళికలను అందిస్తోందని చంద్రబాబు వివరించారు. అత్యాధునిక ఫుడ్ స్కానర్‌తో సహా తాజా ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేస్తున్న ఈ యాప్‌కు శిక్షణ పొందిన న్యూట్రిషనిస్టుల బృందం మద్దతు ఇస్తోందని వెల్లడించారు. న్యూట్రిఫుల్ యాప్ ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో విశేషమైన ముందడుగు వేస్తోందని వివరించారు.

న్యూట్రిఫుల్ యాప్‌కు స్కోచ్ అవార్డు లభించిన నేపథ్యంలో కంగ్రాచ్యులేషన్స్ అమ్మా అంటూ లోకేశ్ తన తల్లి నారా భువనేశ్వరి అభినందనలు తెలిపారు. తన తల్లి నారా భువనేశ్వరి, ఎన్టీఆర్ ట్రస్ట్ ఘనతల పట్ల గర్విస్తున్నానని పేర్కొ న్నారు. సామాజిక సేవలో, ఆరోగ్యకరమైన భవి ష్యత్తును నిర్మించడంలో ఆమెకున్న అచంచల మైన అంకితభావం తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తిని స్తుందని తెలిపారు. స్కోచ్ అవార్డు లభించడం ఆమె దార్శనికతకు, కృషికి తగిన గుర్తింపు అని లోకేశ్ స్పష్టం చేశారు.



వెండి రథంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తున్న శ్రీ స్వామి అమ్మవార్లు, పుష్పార్చనలందుకుంటున్న అమ్మవారు,హోంమంత్రి అనితకు దుర్గమ్మ ప్రసాదాలందజేస్తున్న దృశ్యం

# దుర్గమ్మ ఆలయంలో వైభవంగా ఉగాది వేడుకలు

**ఇంద్రకీలాద్రి, మార్చి 30, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఉగాది వేడుకలు ఆదివారం వైభవంగా జరి గాయి. ఉదయం 9 గంటల వరకు స్నపనా భిషేకం తదితర ప్రత్యేక పూజలను దుర్గమ్మ వారికి నివేదించిన పండితులు అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఉదయం 9 గంటలకు భక్తులను దుర్గమ్మవారి దర్శనానికి అనుమతించారు. అనంతరం ఉగాది సందర్భంగా ఆలయంలో భక్తులు ఉగాది ప్రసాదం అందించారు. వేసవి తాపం నుండి రక్షణకు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

**వేడుకగా రథోత్సవం:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల రథోత్సవం ఉగాది పర్వదినాన వేడుకగా నిర్వహించారు. శ్రీ స్వామి అమ్మవార్లు వన్‌టౌన్ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అను గ్రహించారు. ఇఓ కె రామచంద్రమోహన్ టెం కాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తుల కోలాటాలు, తాళాలు, తప్పెట్లు, భజనలు నడుమ జై దుర్గా నామస్మరణగావిస్తూ రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

**ఆగమోక్తంగా పుష్పార్చన:** దుర్గమ్మవారి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రారంభమయ్యే వసంత నవరాత్రుల ఉత్స వాలను ఆదివారం ఆగమోక్తంగా ప్రారంభిం చారు. శ్రీ నటరాజ స్వామివార్ల ఆలయం ప్రక్కనే వున్న పూజామండపంలో పుష్పార్చన జరిగింది. దేవస్థానం ఆస్థాన సిద్దాంతి చల్లా శ్రీనివాసశర్మ పంచాంగ శ్రవణం చేస్తూ శ్రీ దుర్గమ్మవారి అనుగ్రహంతో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా లభిస్తాయని, ధార్మిక కార్యక్రమాలు విస్తృతంగా జరుగు తాయని తెలిపారు.

**సిఎంకు దుర్గమ్మ ప్రసాదం:** దుర్గమ్మ వారి ప్రసాదాలను ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా ఈఓ కె రామచంద్ర మోహన్, ఆలయ అర్చక పండితులు సిఎం చంద్రబాబు నాయు డుకు దుర్గమ్మవారి ప్రసా దాలను అందించారు. వేదపండితులు ఆశీర్వచ నాలందించారు. అలాగే రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు దుర్గమ్మవారి ప్రసాదాలను అందించారు.

# తిరుమల సమాచారం



# కొండపై ఆసక్తిగా షడ్రుచుల సమ్మేళనం

**తిరుమల,మార్చి 30 ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు ఉగాది పర్వదినాన ఆదివారం సాయంత్రం తిరు మలలోని నాదనీరాజనం వేదికపై కవిసమ్మేళనం వైభవంగా జరిగింది. షడ్రుచుల సమ్మే ళనం, సప్తపర్వత సమ్మేళనంగాసాగింది. కవులు, అవధానులైన సురభి శంకరశర్మ, అన్నాపంతుల జగన్నాథరావు, డాక్టర్ మైలవరపు మురళీకృష్ణ, ఎస్.సాయిప్రసాద్,పొన్నగంటి సూర్యనారా యణ, సురభి బాలరాఘవ సుహ ర్షిణి, చింతా రామకృష్ణరావు తెలుగు భాషవైభవం, మన సం స్కృతిసాంప్రదాయాలు, టిటిడి భక్తులకు చేస్తు న్న సేవలపై పద్యాల రూపంలో వివరించారు.



# శోభాయమానం వెంకన్న ఆలయం

## ఆకట్టుకున్న ఆలయం పరిసరాలు పుష్పాలంకరణలు

**తిరుమల,మార్చి 30ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన ఆది వారం ఉదయం హిందూ పుణ్యక్షేత్రం తిరుమల అంతటామరింత ఆధ్యాత్మికత ఉట్టిపడింది. టిటిడి ఉద్యానవనవిభాగం ఆధ్వర్యంలో ఫల, పుష్ప అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. 8టన్నుల సాంప్రదాయ పుష్పాలు, కట్‌ఫ్లవర్స్ వినియోగించారు. వివిధ రకాల పండ్ల గుత్తు లతో,అపురూపమైన ఉత్తమజాతి పుష్పాలతో ఆలయాన్ని మరింతగా శోభాయమానంగా తీర్చి దిద్దారు.ఆలయం వెలుపల గొల్లమండపం పక్కన పల్లకిలో శయనిస్తున్న శ్రీనివాసుడి ఇరువైపుల గరుత్మంతుడు, హనుమంతుడి రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రకృతిని ఆస్వాదిస్తున్న రాధాకృష్ణులు,వేణుగానం చేస్తున్న చిన్నికృష్ణుడు, తోటలో మిత్రులతో కలసి మామిడిపండ్లను ఆర గిస్తున్న చిన్నికృష్ణుడు, బాలశ్రీరాముడు, ఆంజనే యులు రూపాలువిశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



# ఉగాది పర్వదినాన శ్రీవారి దర్శనం సంతోషం

**తిరుమల,మార్చి 30 ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన శ్రీవేం కటేశ్వరస్వామిని దర్శించుకుంటే ఆనందంగా ఉందని విఐపిలు అన్నారు. శ్రీవారి ఆశీస్సులతో అంతామంచి జరుగుతుందని, ప్రజలు సుఖసం తోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్ధిం చినట్లు ప్రముఖులు తెలిపారు .ఆదివారం ఉద యం ఎంపి వి.రవిచంద్ర, భారతిప్రది ఇరువురు వేర్వేరుగా విచ్చేశారు. ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదా శీర్వచనం చేశారు.

టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# బంగారువాకిలిలో పంచాంగశ్రవణం

## వేడుకగా ఉగాది ఆస్థానం

**తిరుమల,మార్చి 30ప్రభాతవార్తప్రతినిధి:** "విశ్వా వసు"నామ సంవత్సర తెలుగు ఉగాదిపండుగ ఆస్థానం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆల యంలోని బంగారువాకిలిలో శాస్త్రోక్తంగా జరి గింది. శ్రీవేంకటేశ్వరస్వామిని తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతంతో మేల్కొలిపారు. అనంతరం ఆలయ శుద్ది చేసి, 6గంటలకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారికి ,విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరిపిం చారు. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమానప్రాకారం,ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశించారు. ఈ వైదిక కార్యక్రమాలు ముగిసిన తరువాత శ్రీవేం కటేశ్వరస్వామి మూలవిరాట్టుకు,ఉత్సవ మూ ర్తులకు ఆగమోక్తంగా నూతన వస్త్రాలను ధరిం పజేశారు. ఆ తరువాత ఆలయంలోపల బంగారువాకిలిలో తిథి,నక్షత్ర,వార,మాస, సంవత్సర రాశి ఫలాల పంచాంగ శ్రవణం జరిగింది. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమపండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. దేశవిదేశాలలో తెలుగుప్రజలు ఉగాది పర్వదినం అంతా శుభాలు కలగాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆకాంక్షించారు. ఆలయ ప్రాకారం అంతటా పచ్చటి తోరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

ఈ వేడుకల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, కిరణ్‌దీక్షితులు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, శెల్వం, విజిలెన్స్ వింగ్ విఎస్ఒ ఎన్టీవిరామ్ కుమార్, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొ న్నారు. ఆదివారం స్వామివారికి జరిగే ఆర్జిత సేవలు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్ర హ్మోత్సవం రద్దయ్యాయి.

# తెలుగు ప్రజలకు విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు: సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ,మార్చి30,ప్రభాతవార్తప్రతినిధి:** వచ్చే వన్నీ మంచి రోజులనే సానుకూల దృక్పథంతో కొత్త ఏడాదికి స్వాగతిస్తాం కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని వెల్లడి తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగాదిశుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుతు న్నానని ఆయన అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. పండుగలు, ఆచార వ్యవహారాలు, సం స్కృతి సంప్రదాయాలు, కళలు జాతిని సజీవం గా నిలుపుతాయని ఆయన అన్నారు. మన ముంగిటకు వచ్చిన ఉగాది తెలుగువారి వారస త్వపు పండుగ అని కొనియాడారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభా కాంక్షలు తెలుపుతున్నానని ఆయన పేర్కొన్నారు.

వార్త

విచారణకు భయపడిపారిపోయే వ్యక్తి తన నేరాన్ని తనకు తానుగా అంగీకరించినట్లే.

-వైరస్

# భూ ప్రళయం

ఈ అఖిల చరాచర జగత్తుకు భూవిలయాలు కొత్తేమీ కాదు. క్రోధి నామ సంవత్సరంలో అలాంటివి ఎన్నో చూసాం. ప్రపంచంలోని ఎన్నో దేశాలు ప్రకృతి ప్రకోపానికి గురయ్యాయి. ఎంతో మంది ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయి. ఇలాంటి విలయాలకు ఏ దేశానికీ చెప్పుకోదగిన మినహాయింపేమీ లేదు. చివరి ఎత్తుగడగా మరో రెండు రోజుల్లో విశ్వవసు నామ సంవత్సరంలో ప్రవేశిస్తామనగా ప్రకృతి తన విశ్వరూపాన్ని చూపించి ప్రపంచవ్యాప్తంగా ఆరేడు దేశాల్లో సంభవించిన భూకంపాలుజనాన్ని అతలాకుతలం చేశాయి. బ్యాంకాక్, మయన్మార్, థాయిలాండ్ దేశాల్లో భూప్రకంపనలు మొదలయ్యాయి. కేవలం 12 నిమిషాల్లో మూడుసార్లు భూమి కంపించింది. రెండుభూకంప కేంద్రాలు కారణంగా భారీఎత్తున విలయం సంభవించింది. భూమి పొరల్లోపల ఫలకాలు స్థానభ్రంశమై ఎన్నో భవనాలు కూలిపోయాయి. భూకంప కేంద్రం భూమ్యుపరితలం నుంచి లెక్కిస్తే భూమి లోపలికి 15 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లునమోదు. ఇలాంటి విలయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపగలిగే శక్తి ఏ మానవమాత్రుడికీ ఉండదు.దాదాపు వెయ్యి మందికి పైగానే మృతుల సంఖ్యచేరింది. సహాయ కార్యక్రమాల అనంతరం ఈ సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉందని అంచనా. భూకంప స్థలిలో ఈసన్నివేశాలు చూసేవారు పరుగులు తీశారు. సహాయ చర్యలకు వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వం భవనాల్లోని వారిని నిర్జన ప్రదేశానికి తరలించింది. ఇప్పటికీ ఆయా భవన శిధిలాల కింద ఎన్ని మృతదేహాలు ఉన్నదీ తెలియని పరిస్థితి ఉంది.దాని ఎఫెక్ట్ భారత, లావోస్ చైనా దేశాలమీద కూడా పడింది. ఆ కారణంగా ఆకాశ హర్మ్యాలు ప్రకంపనలకు ఊగిపోయాయి. మయన్మార్‌లో రెండవ అతిపెద్ద నగరం మాండలేలో బహుళ అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అందులో 43 మంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారు. మొత్తం మీద భూవిలయం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఇళ్లల్లో, భవనాల్లో ఉన్నవారంతా భయంతో ఆర్తనాదాలు చేస్తూ బయటకు పరుగులు తీస్తున్నారు. భూకంప ధాటికి భవనాలు ఊగిపోయాయి. చారిత్రక కట్టడాల సైతం కూలిపోయాయి. మాండలేలో ఇర్రవడ్డీ నదిపై ఐకానిక్ బ్రిడ్జిఒక్కసారిగా కూలిపోయింది. థాయిలాండ్‌లో ఆ దేశ ప్రధాని అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. నిజానికి ఈదేశంలో పర్యాటక రంగంగా పేరెన్నికగన్నది. వారానికి 2 లక్షలమంది విదేశీ టూరిస్టులు వస్తుంటారు. ఆ దేశానికివచ్చే ఆదాయం కేవలం టూరిజం మీదనే. అది ఇప్పట్లో కోలుకోవడం కష్టమే మరి. సంవత్సర కాలంగా చూసిన విధ్వంసాల విలయాలతో మయన్మార్‌కు కోలుకోలేని దెబ్బతగిలింది. గత ఏడాది మే 2024 లో మోచా సైక్లోన్ తో 54 మందిమరణించారు. కోట్లాది రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. 1 లక్షా 8 వేల భవనాలు దెబ్బతిన్నాయి.ఆ వెంటనే జూన్‌నెలలో వరదలు ముంచెత్తి 226 మంది మృతి చెందారు. ఇంత విధ్వంసాన్ని మయన్మార్ గతంలో ఎదుర్కొన్న దాఖలాలులేవు. మయన్మార్‌లో రియాక్టర్ స్కేల్‌పై 7.7,బ్యాంకాక్‌లో 6.8 తీవ్రతతోభూప్రకంపనలు చెలరేగాయి. భారత్‌లో మేఘాలయ,కలకత్తా ,మణిపూర్‌లోను కంపించింది. భూకంపం భయంతో ఇండ్ల నుంచి బయటికి పరుగులు తీసిన జనం జనం ఇంకా షాక్ గురించి కోలుకోలేదు. ఇంకా భయంగానే ప్రజలు రోడ్లమీదనే ఉన్నారు.పలుప్రాంతాల్లో భవనాలు పేక మేడల్లా కూలిపోవడం చానెల్స్‌లో చూసి బయటి ప్రాంతాల జనం ఆందోళన చెందారు. ఇప్పుడు ఆయా దేశాల పునర్నిర్మాణ ప్రక్రియలో యావత్ ప్రపంచదేశాల సహాయ సహకారాలు అవసరం. భారత దేశం ఇప్పటికే సంఘీభావం ప్రకటించింది. ఆపరేషన్ బ్రహ్మ పేరిట రంగంలోకి దిగింది. ఆగ్నేయాసియా దేశాల్లో భూప్రకంపనల ప్రభావం కనపడింది. భూకంప తీవ్రత ఉండే ప్రాంతాల్లో ఆకాశహర్మ్యాల నిర్మాణానికి సాహసించరు. కానీ బ్యాంకాక్‌లో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉంచే ప్రతిపాదనలో భాగంగా చత్‌చాక్‌లో నిర్మాణంలో ఉన్న 30 అంతస్థుల భవనం పెళపెళ ధ్వనులతో అక్కడికక్కడే నిట్టనిలువుగా కూలిపోయింది. ఇండియన్ టెక్టానిక్ ప్లేటో, బర్మా మైక్రోప్లేటో మధ్య ఉన్న ప్రదేశంలో గతంలోఎన్నో భూకంపాలు సంభవించాయి. గత వందేళ్ల కాలంలో మయన్మార్ ప్రాంతంలోరెక్టర్ స్కేల్‌పై 6 కంటే ఎక్కువస్థాయి నమోదైన 14 భూకంపాలు వచ్చాయని బ్రిటిష్ జియాలాజికల్ సర్వే కేంద్రంశాస్త్రవేత్త బ్రియాగ్ బాప్లె వెల్లడించారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఒక పూర్తి రోజు సమయంలో ఆరు భూకంపాలు నమోదయ్యాయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రకటించింది. మయన్మార్,థాయ్‌లాండ్ లకు తక్షణ సాయం అందించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నడుంకట్టింది. ఎంతో వెలుగు వెలిగిన ఆయా దేశాలు ఇప్పుడు ఎవరు ఆపన్నహస్తం అందించినా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాయి. గత యేడాది జులై30న కేరళ రాష్ట్రంలోని వయనాడ్ విలయంలో 42మంది మృతిచెందారు. రూ.1200 కోట్లు నష్టం వాటిల్లింది. అక్కడ పునరావాసం పునర్నిర్మాణంలో ఎన్నో ఆపన్నహస్తాలు ఆదుకున్నాయి. అదేమాదిరి ఆగ్నేయాసియా దేశాలు ఇప్పుడు ఎదురుచూస్తున్నాయి. 2004 నాటి సునామీ అనంతరం తుఫానులెదుర్కోవడానికి భూకంప నష్టాలను తట్టుకోవడానికి నిర్మించుకున్న వ్యవస్థలేమీ అక్కరకు రాలేదు. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోగలిగే పరిశోధనలు ముమ్మరం చేయాల్సిన అవశ్యకత ఉంది.

ప్రజల్ని ప్రేమించలేనివాడు ఎన్నటికీ దేశభక్తుడు కాడు, కాలేడు.



ప్రకాశం పంతులు

కోపం తెలివి తక్కువ తనంతో ప్రారంభమై, పశ్చాత్తాపంతో అంతం అవుతుంది.



పైథాగరస్

## ప్రజావాక్కు



### న్యాయమేనా?

ఈ మధ్య దేశంలోని న్యాయవ్యవస్థ ఎక్కువగా చర్చల్లోకి వస్తోంది. ప్రజాస్వామ్యంలోని మిగతా మూడు స్తంభాల తీరును శాసించగలిగిన మూల స్థంభం న్యాయ పాలిక. ఆ ప్రాముఖ్యతకు తగ్గట్టే,ప్రజల్లో దానిపై గౌరవం, నమ్మకం, అంచనాలు ఉంటాయి. అలా ఉన్నతమైన స్థానం ప్రజల గుండెల్లో ఉన్నంతవరకూ సమాజం ఆరోగ్యంగా ఉండగలదు. కాబట్టి ఆ స్థానం ఏ మాత్రం సడలకుండా చూడడం కూడా ఎంతో అవసరం. ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ, ఔన్నత్యాన్ని పదిలపర్చుకోవడం ఇప్పుడు ఆ వ్యవస్థ పైనున్న పెద్దబాధ్యత. ఈ మధ్యవరసగా జరిగిన రెండు సంఘటనలు అలా ఎదురైన పెద్ద సవాళ్లే. వాటికి అత్యున్నత న్యాయ స్థానం సరిగ్గానే స్పందించినప్పటికీ, మరింత మేధోమథనంతో శాశ్వత పరిష్కారాలు చూడాల్సిన అవసరం ఉంది. వెంటనే సుప్రీం కోర్టు స్పందించి వాటిపై అంతర్గత విచారణ కమిటీ వేయడమే కాకుండా, ఆయన్ని విధులకు దూరం చేసి, వేరే చోటికి బదిలీ చేసింది.ఆహ్వానించ దగ్గ విషయమే.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### చర్యలు తీసుకోవాలి

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం కల్తీ ఆహారం కారణంగా భారత్‌లో యేటా సుమారు పది కోట్ల మంది అనారోగ్యంతోబాధపడుతున్నారు.బాధితుల్లో70వేలమంది ప్రాణాలు కోల్పోతున్నారు.నిత్యం ఆస్పత్రులకు వెళ్తున్న వారిలో 20 శాతం కల్తీ ఆహార బాధితులే ఉంటున్నారనే అంచనా వేయడం జరిగింది.ఈ వాస్తవాలు గుర్తించి పాలకులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

-మా.శ్రీ.రాజు, పాల్వంచ

### ధరలను తగ్గించాలి

నేడు ప్రతి వస్తువుల ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. అన్నింటిపై పన్నుల భారం పెంచుతూనే ఉన్నారు. ఇలా అన్నింటిపై ధరలు పెంచుకుంటూపోతే సామాన్యుడు ఎలా బతకాలో ఎవరూ ఆలోచించడంలేదు. పెరుగుతున్న ధరలను అదుపులో ఉంచడానికి ఏ మార్గాలు లేవా? పాలకులు మేధావులు ఆలోచించాలి. సామాన్యుడు జీవించే పరిస్థితులు కల్పించాలి. ధరలను ఎంత తగ్గిస్తే అంత మంచిది. అందరికి అందుబాటులో ఉండాలి.

- సింగు లక్ష్మీనారాయణ, చింతకుంట, కరీంనగర్

### కేంద్రీయ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోప్రతిజిల్లాలో డైట్‌కళాశాల,కేంద్రీయ, నవోదయవిద్యాసంస్థలు ఉండేలాప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పాత జిల్లా కేంద్రాల్లోని ఉపాధ్యాయ శిక్షణాసంస్థలు డైట్ కాలేజీలు ఉన్నాయి. ప్రతి కొత్త జిల్లా కేంద్రాల్లో డైట్ కాలేజీలు ఉండేలా రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేయాలి. అలాగే కేంద్రీయ విద్యాలయాలు,నవోదయ స్కూల్స్ ఉంటే వెనకబడినప్రాంతాల విద్యార్థులకు ఎంతోప్రయోజనం ఉంటుంది. విద్యార్థులకు శిక్షణతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు కూడా వస్తాయి. అలాగే ఉపాధ్యాయులకు వివిధ అంశాల్లో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయుటకు డైట్ ,నవోదయ,కేంద్రీయ విద్యాలయాలు ఎంతగానో తోడ్పాటునిస్తాయి.

- రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

### పెరుగుతున్న చీటింగ్ కేసులు

గ్రామాలలో కొందరు కొంతమంది వ్యక్తుల నుండి డబ్బులు అప్పుగా తీసుకొని బాండ్ పేపర్ పై కాగితం రాసి ఇచ్చి వడ్డీకి తీసుకున్న డబ్బులు తిరిగిఅడగడంతో ఇంటిదగ్గర ఉండకుండా కొన్ని నెలలకొద్ది కనబడకుండా వెళ్తున్నారు. ఫోన్ చేస్తే ఎత్తడం లేదు.డబ్బులు ఇవ్వడం లేదని స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా కూడా పోలీసులకు ఫోన్ ఎత్తడం లేదు రావడం లేదు. ఒక్కొక్కరిపై 10 ఫిర్యాదులున్నాయి. లక్షల కొద్ది రూపాయలను అప్పుగా తీసుకొని దొంగచాటుగా తిరుగుతున్న వారిని పోలీసులు పట్టుకొని అప్పు ఇచ్చిన వారికి తిరిగి ఇప్పించాలి. ఈ విధంగా చీటింగ్ చేస్తూ తప్పించుకుని తిరుగుతున్న వారు తిరిగి డబ్బులు ఇచ్చే విధంగా కృషి చేయాలి. ఇలాంటి మోసగాళ్లను కఠినంగా శిక్షించాలి.

-రాపాక రవీందర్, జనగాం

### రోడ్లను బాగు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. సంక్షేమ కార్యక్రమాల పేరుతో అప్పులు చేసి తెచ్చినపప్పు కూడుగా డబ్బులు నేరుగా ప్రజల అకౌంట్లోకి వెళ్లిపోవడంవల్ల కెసిఆర్ స్వార్థంకారణంగా కాంగ్రెస్ వారి తెలివి తక్కువఆలోచన కారణంగా విభజించబడినఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిన్న రాష్ట్రంగా మారింది. 13 జిల్లాలు 26 జిల్లాలుగా మారి ఉద్యోగులసంఖ్యను పెంచేసింది. రాజకీయ నాయకుల సంఖ్యను కూడా పెంచేసింది. వారి టిఏ, డిఏలు, జీతాలు అన్ని పెరిగాయి. వారి పోషణ ప్రజలకు చాలాకష్టంగా మారింది.

-వీరగంట భాస్కర్‌రావు, బొబ్బిలి

మనవి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చీమల ముందుకే చీమలు పడితే 'న్యాయ' మా?

**ఏ వ్యవస్థపై ఆరోపణలు వచ్చాయో అదే వ్యవస్థకు చెందిన వారితో విచారణ జరిపించడం, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తిపై ఆరోపణలు వచ్చినప్పుడు హోదాపరంగా ప్రధాన న్యాయమూర్తి కంటే ఎంతో తక్కువ స్థాయి కలిగిన కేబినెట్ సెక్రటరీతో విచారణ జరిపించడం అంటే ఆ విచారణ ఏవిధంగా వుంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజాస్వామ్యంలో సుప్రీం కోర్టు సుప్రీమ్ అని ప్రజలందరూ మనస్ఫూర్తిగా భావించి, గౌరవించాలంటే న్యాయవ్యవస్థలో సంపూర్ణంగా సంస్కరణలు అమలు చేయాల్సి వుంటుంది. చేపట్టవలసిన సంస్కరణలపై అన్ని వేదికలపై విస్తృతంగా, లోతుగా చర్చలు జరగాలి. "ధర్మోరక్షి తి రక్షి త:' అన్నట్టు న్యాయవ్యవస్థను కాపాడితే ఆ వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని గుర్తుంచుకోవాలి.**



అన్నవరపు బ్రహ్మయ్య

'న్యాయమూర్తులందరూ సచ్ఛీలురని సర్టిఫికెట్ ఇవ్వలేం. అవినీతి పరులు అన్నిరంగాలలో వున్నారు కాకపోతే ఏ రంగంలో యేయే మేరకు అవినీతి వున్నది అనేదే ప్రశ్న' అని జస్టిస్ బి.ఎన్. అగర్వాల్,జస్టిస్ వి.ఎస్. సర్పూర్కర్లతో కూడినసుప్రీం కోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇవి. 'న్యాయమూర్తులు అతీతులు గారు.వీరు కూడా అవినీతి మయమైన నేటి సమాజం నుంచి వచ్చిన వారే ఎక్కడో స్వర్గం నుంచి వచ్చినవారు కాదు' అనిసుప్రీం కోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ అగర్వాల్ మరో సందర్భంలో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం దేశవ్యాప్తంగా మారోమోగిపోతోంది. గత అనుభవాలను పరిగణలోకి తీసుకుంటే న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు రావడం ఇదే ప్రథమం కాదు.ఇదే చివరిదని కూడా చెప్పలేం.జస్టిస్ వర్మ తొలుత అసలు డబ్బు ఏదీదొరకలేదని ఆ తర్వాత డబ్బుగది తనకు సంబంధించినది కాదని చెబుతున్న అంశాలను బట్టి ఆయన ఎంత నిజాయితీపరుడో అర్థం అవుతోంది. విచారణ కొనసాగుతున్నందున వాస్తవాలు బహిర్గతం కాకతప్పదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభ, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు కీలకమైనవి. ఈ మూడు వ్యవస్థలు దేనికదే స్వతంత్రంగా వ్యవహరించినా అనువర్తనంలో మాత్రం 'సుప్రీం కోర్టే సుప్రీమ్' అని అంటారు. ఎందుకంటే చట్టసభలో చట్టాలు చేసినా ఆ చట్టాలు రాజ్యాంగానికి లోబడి ప్రజాహితంగా వున్నాయా? లేదా అని సమీక్షించే అధికారం న్యాయవ్యవస్థకు వుంది. అదే విధంగా చట్టాలను అమలు చేయడంలో కార్యనిర్వాహక వ్యవస్థ చట్టబద్ధంగా వ్యవహరిస్తుందా? లేదా? అని కూడా సమీక్షిస్తుంది. 'చీమల మందుకే చీమలు పట్టినట్టుగా' న్యాయాన్ని పరిరక్షించాల్సిన న్యాయమూర్తులే అవినీతిపరులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మనదేశ న్యాయవ్యవస్థలో కింది స్థాయిలో వుండే మెజిస్ట్రేట్ కోర్టు మొదలుకొని సుప్రీం కోర్టువరకు అనేక రకాల న్యాయస్థానాలు వున్నాయి.వీటిలో సుప్రీం కోర్టు అత్యున్నతమైనది. అటువంటి ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తులుగా పనిచేసినవారిపై కూడా అవినీతి ఆరోపణలు వచ్చాయి. శ్రీమతి ఇందిరా గాంధీ 1984 ఢిల్లీ అల్లర్లలో పాల్గొన్నట్టు ఆరోపణలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ నేతలకు క్లీన్‌చిట్ ఇచ్చిన జస్టిస్ రంగనాథ్‌మిశ్రా, కొబ్బరినూనె దిగుమతి చేసుకోవడంలో నిబంధనలు పాటించని ఒక కంపెనీకి ఎక్సైజ్‌శాఖ విధించిన అయిదు కోట్ల రూపాయల జరిమానాను తగ్గించిన కేసులో జస్టిస్ కమల్ నారాయణ్ సింగ్, 1997లో భోపాల్ గ్యాస్ బాధితులకు సంబంధించిన నష్టపరిహారం విషయంలో జస్టిస్ ఎ.ఎం. అహ్మది, 1998లో కోర్టువెలుపల జరిగిన ఒప్పందాన్ని పరిగణలోకి తీసుకొని కేసును నీరుగార్చిన విషయంలో జస్టిస్ ఎం.ఎం. పుంచి, జమ్ముకాశ్మీరులో ఒక హోటల్‌కు సంబంధించిన కేసు విషయంలో జస్టిస్ ఎ.ఎస్. ఆనంద్, సీలింగ్ భూముల కేసుల విషయంలో జస్టిస్ వై.కె. సబర్వాలు తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. తీవ్ర అవినీతి ఆరోపణలకు గురైన కర్ణాటక హైకోర్టుకు చెందిన ప్రధాన న్యాయమూర్తిని తొలగించడానికి రాజ్యసభలో ఇంపిచ్మెంట్ తీర్మానం ప్రవేశపెట్టడంతో ఆ న్యాయమూర్తి రాజీనామా చేసి తొలగింపు నుంచి తప్పించుకొన్నారు. ఇటువంటి ఉదాహరణలు చాలానే వున్నాయి. హైకోర్టు లేదా సుప్రీం కోర్టులలో కేసు దాఖలు చేయడం నుంచే అవినీతి ప్రారంభమవుతుందనే ఆరోపణలున్నాయి. హైకోర్టు, సుప్రీం కోర్టులలో కేసులు దాఖలు చేయడానికి



ముందుగా కోర్టు అనుమతి తీసుకోవాలి.కోర్టు అనుమతించిన దావాలకు మాత్రమే కేసు నెంబరును కేటాయిస్తారు. కింది కోర్టులో ఓడిపోయినప్పుడు హైకోర్టు లేదా సుప్రీం కోర్టులో అప్పీల్‌కు వెళ్లడం సహజం. అయితే చాలా సందర్భాలలో న్యాయవాదులను కలిసినప్పుడు అప్పీలును వెంటనే దాఖలు చేయడానికి బదులుగా ఫలానా రోజు ఫలానా జడ్జి బెంచ్‌పైకివస్తారు. ఆ జడ్జి అయితే కొంత ఖర్చు అయినా మనకు తేలికగా కేసును స్వీకరించి నెంబరు ఇస్తారని చెబుతారు.అంటే అప్పీలును ఆమోదించడానికి కేసు పూర్వాపరాల సంగతి ఎలావున్నప్పటికీ, డబ్బు ఖర్చుచేస్తే కేసును అనుమతించి, నెంబరు కేటాయిస్తారు. ఆ తర్వాత కేసుల స్వభావాన్ని బట్టి మధ్యంతర ఉత్తర్వులకి, బెయిల్ మంజూరు, చివరిలో తీర్పు అనుకూలంగా రావడానికి ప్రత్యేకంగా ఖర్చుచేయాల్సి వుంటుంది. 'ప్రస్తుతం ప్రజలు కొంత మంది న్యాయమూర్తులు నిజాయితీపరులని, మరికొంత మంది అవినీతి పరులని కేటగిరీ చేయగలుగుతున్నారు' అని జస్టిస్ అరిజిత్ పసయత్,జస్టిస్ వి.ఎస్. సిరిపుర్కర్, జస్టిస్ జి.ఎస్. సింఘ్వీలతో కూడిన సుప్రీమ్ కోర్టు ధర్మాసనంఒక సందర్భంలో వ్యాఖ్యానించింది. కొన్ని కేసులలో తీర్పులు, బెయిల్ మంజూరు కావడం వంటి అంశాలను గమనించినప్పుడు సీనియర్ న్యాయవాదులు న్యాయమూర్తులతో ఒప్పందం కుదుర్చుకొని అవసరమైనస్థాయిలో కౌంటర్ దాఖలుచేయడం లేదని కూడా బెంచ్ వ్యాఖ్యానించింది. గాలి జనార్ధన రెడ్డి బెయిల్ మంజూరులో కూడా ఇంచుమించు ఇదే జరిగినట్టు కనిపిస్తోంది. గాలి జనార్ధన రెడ్డి కేసులో బెయిల్ మంజూరు చేయడానికి 10కోట్ల రూపాయల మేరకు ఒప్పందం జరగడం, దానిపై దేశవ్యాప్తంగా చర్చజరగడం పాఠకులకు గుర్తుండే వుంటుంది. కొన్నికేసుల విషయంలో ముద్దాయి తరపు, ప్రభుత్వం తరపు న్యాయవాదుల మధ్య జరిగే తెరవెనుక లాలూచి పడటంవల్ల కూడా తీర్పులు మారిపోతుంటాయి. ముద్దాయి బెయిల్‌కోసం పిటిషన్ దాఖలు చేసినప్పుడు ప్రభుత్వం తరపు న్యాయవాది కౌంటరు దాఖలు చేయడంలో చూసిచూడకుండా వుండాలి. ఒకవేళ కౌంటరు దాఖలు చేసినా బెయిల్ నిరాకరించడానికి అవసరమైన అంశాలు అందులో ప్రస్తావించకుండా వుండాలి. దాంతో ముద్దాయికి సులభంగా బెయిల్ మంజూరు అవుతుంది. ముద్దాయి తరపు న్యాయవాది, ప్రభుత్వ తరపు న్యాయవాది మధ్య అవగాహనతో ఇది సాధ్యమవుతుంది. ఇదే తరహాలో ముద్దాయి తరపు న్యాయవాది, ప్రభుత్వం తరపు న్యాయవాది మిలాఖత్ కావడం ద్వారా అసలు కేసునే నీరుగార్చవచ్చు. ముద్దాయి తరపు, ప్రభుత్వ తరపు న్యాయవాదుల మధ్య జరిగే తెరవెనుక ఒప్పందాల్లో కేసు ప్రాధాన్యతను బట్టి లక్షలు,కోట్లరూపాయలు కూడా చేతులు మారతాయి.ప్రజాస్వామ్యంలోని ఇతర వ్యవస్థలతో పోల్చుకొన్నప్పుడు న్యాయవ్యవస్థ 'కోర్టు ధిక్కారం' అనే ఇనుప పరదాల మాటున ఉంటోంది.ఈ పరదకారణంగా ఇతర వ్యవస్థలలోని లోటుపాట్లు సమీక్షించినంత సులభంగా న్యాయవ్యవస్థపై సమీక్ష చేసే అవకాశం లేకుండా వుంది. ఇప్పటి వరకు న్యాయవ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు మొక్కుబడిగానే వుంటున్నాయి. ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన 'జ్యుడిషియల్ ఎంక్వయిరీ (అమెండ్మెంట్) బిల్ 2008' ద్వారా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో 'నేషనల్ జ్యుడిషియల్ కౌన్సిల్' ఏర్పాటుచేశారు. ఈ కౌన్సిల్ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై వచ్చే అవినీతి ఆరోపణలపై విచారణ చేస్తుంది. ఒక న్యాయమూర్తిపై ఆరోపణలు వచ్చినప్పుడు అదే న్యాయవ్యవస్థకు చెందిన జడ్జీలతో కూడిన ప్యానల్ కమిటీ విచారిస్తుంది.ఇక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా రిటైర్డ్ ప్రధాన న్యామూర్తిపైనే ఆరోపణలు వచ్చే పక్షంలో రాష్ట్రపతి ఉత్తర్వులు మేరకు క్యాబినెట్ సెక్రటరీ లేదా పార్లమెంటు విచారణ చేస్తుంది. ఏ వ్యవస్థపై ఆరోపణలు వచ్చాయో అదే వ్యవస్థకు చెందినవారితో విచారణ జరిపించడం, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తిపై ఆరోపణలు వచ్చినప్పుడు హోదాపరంగా ప్రధాన న్యాయమూర్తి కంటే ఎంతో తక్కువస్థాయి కలిగిన కేబినెట్ సెక్రటరీతో విచారణ జరిపించడం అంటే ఆ విచారణ ఏవిధంగా వుంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజాస్వామ్యంలో సుప్రీం కోర్టు సుప్రీమ్ అని ప్రజలందరూ మనస్ఫూర్తిగా భావించి, గౌరవించాలంటే న్యాయవ్యవస్థలో సంపూర్ణంగా సంస్కరణలుఅమలు చేయాల్సివుంటుంది. చేపట్టవలసిన సంస్కరణలపై అన్ని వేదికలపై విస్తృతంగా, లోతుగా చర్చలు జరగాలి. "ధర్మోరక్షి తి రక్షి త:' అన్నట్టు న్యాయవ్యవస్థను కాపాడితే ఆ వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని గుర్తుంచుకోవాలి. ●

# పేదరిక నిర్మూలనే ప్రభుత్వ సంకల్పం



శిరందాసు నాగార్జున రావు

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మదిలో మెదిలిన మరో కొత్తఆలోచన జీరో పావర్టీ పీ4విధానం. ఇది మరో విప్లవాత్మక ఆలోచన. ఈ నెల 30వ తేదీ 'విశ్వావసు' తెలుగు సంవత్సరాది నాడు ప్రారంభించే ఈ విధానాన్ని సీఎం గేమ్‌ఛేంజర్‌గా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర 2047లో భాగంగా, వచ్చే ఐదేళ్లలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేస్తోంది. సామాజిక ఆర్థికాభివృద్ధిలో సరికొత్త మార్పులకు ఈ పీ4(ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, ప్రజల భాగస్వామ్యం) నాంది పలుకుతుంది. ఇది సమ్మిళిత వృద్ధి ద్వారా సమాజంలోని బలహీన వర్గాలను పైకి లేపడానికి నిరంతరంగా పనిచేసే ఓ ప్రక్రియ. సమాజంలోని పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఇది పనిచేస్తుంది. ఈ విధాన ప్రధాన లక్ష్యం సమాజంలో ఉన్నతస్థితిలో ఉన్న 10శాతం మంది, అట్టడుగున ఉన్న 20శాతం మంది పేదలను దత్తత తీసుకుని, వారికి అండగా నిలిచి, వారిని పేదరికం నుండి పైకి తీసుకురావడం. వెనుకబడిన కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు 'ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యంతో దీనిని రూపొందించారు. స్వర్ణ ఆంధ్రప్రదేశ్ 2047 'పది సూత్రాల'లో ఒకటైన 'సున్నా పేదరికం' లక్ష్యాన్ని సాధించేందుకు, సమాజంలో ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు, అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు (హెచ్ఎన్ఐలు), ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు భాగస్వాములు



కావడానికి ఈ విధానం దోహదపడుతుంది. ఈ పథకంలో లబ్ధిదారులను 'బంగారు కుటుంబాలు' అని, సహాయం చేసే ఆర్థికంగా బలమైన వారిని 'మార్గదర్శి' అనిపిలుస్తారు. ఈ పేర్లను ప్రజల సూచనల మేరకే ఖరారు చేశారు. ఆర్థికంగా అండగా నిలిచే 'మార్గదర్శి'లు తమకు తోచినవిధంగా నిధులతోపాటు, సమయం ఉన్నవారు ఆర్థిక విషయాల్లో సలహాలు, కెరీర్ గైడెన్స్, ఉద్యోగ అవకాశాలు, విద్యా ఖర్చులకు సహాయం లేదా వ్యాపారాలకు పెట్టుబడి వంటి సహాయం కూడా అందిస్తారు. ఈ విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సాధికారత సాధిస్తుందని కూటమి ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఈవిధానం అమలులో ప్రభుత్వం ఏ రకమైన ఆర్థిక సాయం చేయదు. బంగారు కుటుంబాలకు, మార్గదర్శులకు మధ్య సమన్వయకర్తగా పనిచేస్తుంది. ప్రభుత్వంలోని వివిధ శాఖలు సర్వేల ద్వారా పేద కుటుంబాలను గుర్తిస్తాయి. అర్హులైన కుటుంబాలు ఈ పథకంలో భాగమవుతాయి. ఈ విధానం సమర్థవంతంగా అమలు చేసేందుకు, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రియల్ టైమ్ డేటాని సేకరిస్తారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసే డిజిటల్ వేదికనుంచి మార్గదర్శులు తాముసహాయం అందించేకుటుంబాలను ఎంచుకుంటారు. పీ4లో భాగంగా పేద కుటుంబాలకు విద్య,వైద్యం, ఇళ్లస్థలాలు, ఇళ్లనిర్మాణం,మరుగుదొడ్లు, తాగునీటి కనెక్షన్లు,గ్యాస్ కనెక్షన్లు, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు సౌరవిద్యుత్ ఏర్పాటుకు ప్రోత్సాహకాలు, హైస్పీడ్ ఇంటర్నెట్‌వంటి సౌకర్యాలను కల్పిస్తారు.ఈ విధానం ద్వారా మొదటి దశలో 20లక్షల కుటుంబాలకు లబ్ధి చేరుకూరుతుందన్న అభిప్రాయంతో ప్రభుత్వంఉంది. 2029 నాటికి పేదరికం నిర్మూలించాలన్నదే ప్రభుత్వ సంకల్పం. ●

# గిట్టుబాటు ధరలేక రైతుల అవస్థలు

డా. యం. సురేష్ బాబు

ఒక పక్క మార్కెట్‌లో బంగారం ధర దగదగ లాడుతోంది. మరోవైపు టమోటా, మిర్చీ, ఉల్లి, మునగ, పత్తి, ఇతర పంటల ధరలు నేలచూపు చూస్తున్నాయి. ముఖ్యంగా పండ్ల మార్కెట్‌లో సపోటా, చీనీ,జామ మార్కెటు లేదు. టమాట రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఆరుగాలం కష్టపడి పండించిన టమాటకు ధర రాక దిగాలు పడే పరిస్థితి నెలకొంది. ఆంధ్రాలో పలు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో ఈసారి టమాట పంట ఎక్కువ దిగుబడి ఉంది. అయితే ప్రస్తుతం టమాట రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్న చందంగా తయారైంది.మార్కెట్టుకు తీసుకువచ్చిన టమాటా ధర కిలో రెండు రూపాయలు పడిపోవడంతో అక్కడక్కడ రైతులు రోడ్డుపై పారబోసి, పశువులకు మేతగా వేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. రవాణా ఖర్చు విపరీతంగా పెరగడంతో సుదూర ప్రాంతాలల్లో మార్కెట్‌కు సరుకు తరలించలేకపోతున్నారు. గత ఐదు సంవత్సరాల నుండి ధరల స్థిరీకరణ అనేది లేదు. అనంతపురం చీనీ మార్కెట్ యార్డ్‌లో కమిషన్ వ్యవస్థను రద్దు చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. అమ్మకాలను వేలం ద్వారా నిర్వహించాలని పలుమార్లు రైతుసంఘాల విజ్ఞప్తిని పట్టించుకోవడంలేదు.ప్రస్తుత కమిషన్ పదిశాతం నుంచి నాలుగుశాతానికి తగ్గించినప్పుడే రైతు బాగుపడతాడు.మార్కెట్లలో ఈనం వ్యవస్థ (కమీషన్లు) కారణంగా నారింజ రైతులు నష్టపోతున్నా ప్రభుత్వంచోద్యం చూస్తుంది. ఈ వ్యవస్థను రద్దుచేసి, పులివెందుల మార్కెట్ యార్డ్‌లో అనుసరిస్తున్న నమూనా ప్రకారం వేలం ద్వారా అమ్మకాలు నిర్వహించాలి. ప్రస్తుతం చీనీ మార్కెట్లో డబుల్ సూట్ అని ఇరవై శాతం, తరుగు అని కొంత, అన్లోడింగ్ అని కొంత, మార్కెట్లో సెక్యూరిటీకి కొంత, వేబ్రిడ్జి కొంత, వట్టికాయలకు కొంత తీసివేస్తే చివరికి రైతుకు మిగిలేది కొంతే. ఇంకా దుర్మార్గంగా రైతు అవసరాన్ని బట్టి తోటల దగ్గరే ముప్పైశాతం తగ్గించి స్పాట్‌లో డబ్బు ఇచ్చికొంటున్నారు. మార్కెట్లకు తరలించిన రైతులు నిర్ణీత సమయానికి రాలేక, వేలంపాటలు పాడలేకపోతున్నారు. మార్కెట్ యార్డులు దుర్భరంగా ఉండటం, కనీస సౌకర్యాలు లేక తిండి తిప్పలు దేవుడెరుగు. రైతుకు మాత్రం గిట్టుబాటు ధర లేక ధర పడిపోయిందని రైతులు గగ్గోలు పెడుతుంటే, మార్కెట్లో మాత్రం కొనేపరిస్థితి లేదు. ఎన్నో కష్టాలు పడి టమాట సాగు చేస్తే మార్కెట్లో వ్యాపారులు మాయాజాలం ప్రదర్శించడం సరికాదని వాపోతున్నారు. రైతు నిర్ణయించాల్సిన ధరను వ్యాపారులు నిర్ణయం తీసుకోవడం ఏమిటి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం అని బూటకపు మాటలు మాట్లాడుతున్న ప్రభుత్వాలు రైతుల సంక్షేమం గురించి పట్టించుకోకుండా సంబరాలు జరుపుకుంటున్నారు.ఈ సంవ



త్సరం టమోటాతో పాటు మామిడిపండ్లకు కూడా డిమాండ్ తగ్గిపోయింది. పండ్లతోటల్లో మామిడి పంట చాలా ప్రముఖమైనది. ప్రపంచం మొత్తంలో సగం వరకు మామిడి ఉత్పత్తి మన భారతదేశంలో జరుగుతోంది. మామిడి పంటను చాలా మంది రైతులు ముఖ్యమైన ఉద్యాన వాణిజ్య వంటగా సాగుచేస్తున్నారు. మామిడిని మన ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రధానంగా కృష్ణా,ఖమ్మం, విజయనగరం, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి,శ్రీకాకుళం,కరీంనగర్, విశాఖపట్నం, చిత్తూరు,కడప, అదిలాబాదు, నల్గొండ జిల్లాల్లో సాగుచేస్తున్నారు.మామిడిని పండించడానికి అన్నిరకాల నేలలు అనుకూలంగా ఉంటాయి.ఈ సంవత్సరం కాపు సంతృప్తికరంగా ఉన్నా మార్కెట్లో ధర లేకపోవడంతో, అకాల వర్షాలతో పంట దెబ్బతీసింది. రైతుకు పెట్టుబడి రాక చెట్లు తీసివేసే ప్రమాదం ఉంది. గత దశాబ్ద కాలంగా కోల్డ్‌స్టోరేజ్ యూనిట్స్, ధాన్యం నిలువ చేసుకోవడానికి వేర్‌హౌస్‌లు లేక రైతులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. అసమర్థ రవాణా వ్యవస్థ కారణంగా పెద్ద మొత్తంలో కూరగాయలు పొలాలలో కుళ్లిపోతున్నాయి. సరఫరా గొలుసు అనేది ఒక ప్రదేశం నుండి మరొకప్రదేశానికి వస్తువులను రవాణా చేయడం, దాని సంక్లిష్టతలు సాధారణ రవాణాకు మించినవి. రైతు ఆత్మహత్యల సమస్యనిజానికి ఒక విషాదకరమైన సంక్లిష్టమైన సమస్య. ఇది సరఫరా గొలుసుసవాళ్లకు మాత్రమే పరిమితం కాకుండా బహుళ కారణాలచే ప్రభావితమవుతుంది. అస్థిరమైన మార్కెట్‌ధరలు,అధిక ఇన్‌పుట్ ఖర్చులు, రుణం బీమాకు సరిపడా ప్రాప్యత, నీటికొరత, పంట వైఫల్యాలు పరిమిత మార్కెట్ అవకాశాలు వంటి అనేక సవాళ్లను రైతులు ఎదుర్కొంటున్నారు. ఈసవాళ్లు,ఇతరసామాజిక, ఆర్థిక వ్యక్తిగత అంశాలతో కలిపి రైతు ఆత్మహత్యల బాధాకరమైన పరిస్థితికి దోహదపడతాయి.సరఫరా గొలుసు రైతుల జీవనోపాధిపై ప్రభావం చూపుతుండగా,రైతు ఆత్మహత్యలు విస్తృత వ్యవస్థాగత సమస్యలు వ్యక్తిగత పరిస్థితుల కలయిక నుండి ఉత్పన్నమవుతున్నాయి. వీటిని గుర్తించడం చాలాముఖ్యం. రైతు ఆత్మహత్యల సమస్యను పరిష్కరించడానికి వ్యవసాయ సంస్కరణలు, సామాజిక మద్దతు వ్యవస్థలు, మానసిక ఆరోగ్య అవగాహన,ఆర్థిక సహాయం స్థిరమైన వ్యవసాయ పద్ధతులతో సహా సమగ్రమైన బహుళ డైమెన్షనల్ విధానాలు అవసరం. రైతు శ్రేయస్సుకోరే ప్రభుత్వాలు తక్షణమే కోల్డ్ స్టోరేజి యూనిట్లు,మార్కెట్‌సౌకర్యం, వేర్‌హౌస్ నిర్మాణంచేపట్టాలి. రైతులు ధాన్యం నిలువ చేసుకోవడానికి గోదాములు గిడ్డంగులు ఏర్పాటు చేయాలి. రవాణా ఛార్జీలు, ఇతర నష్టాలను కలుపుకుని గతేడాది ఈ సీజన్‌లో కిలోపై ఐదురూపాయలు వ్యయం పెరిగింది. ఈ ఏడాది మాత్రం రవాణాకు రూ.వేలు వెచ్చించి చెబుతూ ధంలు ఏకమొత్తంలో పెంచేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దళారులు ఆడిందే ఆట పాడిందే పాటగామారింది. ధరల పెరుగుదలవల్ల నిత్యావసర కూరగాయలుఅందుబాటులో లేకుండాపోయాయి. ఆహార సరఫరా అందుతుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ●

# వేసవి సెలవులు వృథా చేయొద్దు

## నీటి సంరక్షణను మరింత అలవాటుగా మార్చుకోవాలి

## మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మార్చి 30:** వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని, పరీక్షల సమయంలో వాటిగురించి చర్చించానని, త్వరలో వేసవి సెలవులు కూడా వస్తున్నాయని పిల్లలు వాటికోసం వేచి ఉన్నారని, కొత్త అభిరుచులు మెరుగుపరుచుకునేందుకు తగిన సమయం ఇదేనని వేసవి సెలవులకోసం రూపొందించిన మైక్యాలెండర్ చిన్నారులకు ఎంతగానో ఉపకరిస్తుందని ప్రధానిమోడీ అన్నారు. ఆదివారం 120వ ఎపిసోడ్ మన్‌కీబాత్‌లో ప్రధానిమోడీ పలు అంశాలను స్పృశించారు. అంబేద్కర్‌జయంతిరోజు జరిగే పాదయాత్రలో పాల్గొనడం ద్వారా మీరంతా రాజ్యాంగ విలువల గురించిన సమాచారాన్ని అందరికీ తెలియజేయగలుగుతారని అన్నారు. నీటిని పొదుపు ప్రచారం వేసవిలోనే ముమ్మరంగాజరుగుతుందని, మనకు లభించే సహజవనరులను భావితరానికి అందించడం మనబాధ్యత అన్నారు. ఎడెనిమిదేళ్లలో కొత్తగా నిర్మించిన ట్యాంకులు, చెరువులు ఇతర నీటి నిల్వల నిర్మాణాల ద్వారా నీటిని సంరక్షించారని ఈవిషయంలో అందరూ ఇప్పటి నుంచే ఒక ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. మీ ఇంటిముందు ఒక కుండలో చల్లటినీటిని అందరికీ అందుబాటులోఉంచండి అని మోడీ పిలుపునిచ్చారు. ఖేలో ఇండియ ఆపారాగేమ్స్‌లో ఆటగాళ్లు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారని, ఈసారి ఎక్కువమంది పాల్గొన్నారన్న మోడీ వారందరినీ అభినందించారు. దివ్యాంగ క్రీడాకారులు 18 జాతీయ రికార్డులను కూడా సృష్టించారన్నారు. ఢిల్లీలోజరిగిన ఫిట్ ఇండియా కార్నివాల్‌లో సుమారు 25 వేల మందికిపైగా పాల్గొన్నారని, ఫిట్‌నెస్‌పై అందరికీ అవగాహన కల్పించడం అని అన్నారు. దుస్తుల వ్యర్థాలు సవాల్‌గా మారుతున్నాయని పాతదుస్తులను పారవేసినపుడు వాటిలో ఒకశాతం మాత్రమే రీసైకిల్ అవుతుందన్నారు. ప్రపంచంలో అత్యధిక వస్త్ర వ్యర్థాలు ఉత్పత్తి అయ్యే మూడోదేశం భారత్ అని ఈసవాలు ఎదుర్కొనేందుకు పలు కసరత్తులు జరుగుతున్నాయన్నారు. వివిధ స్టార్టప్‌లు పాతబట్టలు, బూట్లు చెప్పులను రీసైక్లింగ్‌చేసి వినియోగంలోకి తెస్తున్నాయని ప్రధాని ప్రశంసించారు. యోగా దినోత్సవానికి ఇక కొద్దిరోజులుమాత్రమే ఉందని, యోగాను జీవితంలో భాగంగాచేసుకోవాలని ప్రపంచ మానవాళికి భారత్ ఇచ్చిన బహుమతి యోగా అన్నారు. ఇది భవిష్యత్ తరానికి ఉపయోగపడుతుందని, యోగా సాయంతో ప్రపంచాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిద్దామన్నారు. నేడు పెద్దసంఖ్యలో యువ యోగాను అభ్యసిస్తున్నారన్నారు. ఆయుర్వేదం కూడా ఎక్కువమంది వాడుతుండటం పట్ల మోడీ హర్షం ప్రకటించారు.

# ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

## రూ. 33,700 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోడీ

**రాయ్‌పూర్, మార్చి 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఛత్తీస్‌గఢ్‌లో రూ. 33,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. విద్యుత్, చమురు-సహజ వాయువు, రైల్వేలు, రహదారులు వంటి కీలక రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు అందులో ఉన్నాయి. బిలాస్‌పూర్‌లో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు దక్కేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో 3 లక్షల మంది పేద ప్రజలకు కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగు పడనున్నా యని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. నవరాత్రి తొలిరోజునే బిలాసపూర్‌లో వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. 'నవరాత్రుల తొలిరోజు ఇక్కడ ఉండటం నా అదృ ష్టంగా భావిస్తున్నాను. మాతామాయి సొంత గడ్డ ఇది. కౌసల్యాదేవి పుట్టినిల్లు కూడా ఇదే. శక్తిమాతను ఆరాధించే ఈ తొమ్మిది రోజులు ఛత్తీస్‌గడ్ ప్రజలకు చాలా ప్రత్యేకం. ఈ శుభతరుణంలో ఇక్కడకు రావడం ఆనందంగా ఉంది' అని మోడీ అన్నారు. కొద్ది నిమిషాల క్రితమే రూ. 33,700 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు మొదలయ్యాయని, వీటిలో పేదలకు ఇళ్లు, స్కూళ్లు, రోడ్లు, రైల్వేలు, విద్యుత్, గ్యాస్‌పైప్‌లైన్స వంటి ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారు. ఇవన్నీ రాష్ట్ర ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఉద్దేశించినవని, ఈ గణనీయమైన అభివృద్ధిలో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నానని అన్నారు.

**ఛత్తీస్‌గఢ్ సిల్వర్ జూబ్లీ ఇయర్:** ఛత్తీస్‌గఢ్ ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తవుతున్న 'సిల్వర్ జూబ్లీ ఇయర్' ఇదని మోడీ అన్నారు. ఈ యేడాదే అటల్ బిహారీ వాజ్‌పేయి శతాబ్ది సంవత్సరం కూడా అని గుర్తు చేసుకున్నారు. 2000లో వాజ్‌పేయి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది.



# పట్టాలు తప్పిన కామాఖ్య ఎక్స్‌ప్రెస్

## 11 బోగీల్లోని ప్రయాణీకులకు గాయాలు

**భువనేశ్వర్, మార్చి 30:** కామాఖ్య ఎక్స్‌ప్రెస్‌రైలు పట్టాలు తప్పి తృటిలోపెనుప్రమాదంనుంచి తప్పించుకుంది. 11 బోగీలు పట్టాలు పక్కకు ఒరిగాయి. ఈ ప్రమాదంలో కొందరుప్రయాణీకులు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఒడిశాలోని కటక్ జిల్లాలో ఈప్రమాదం జరిగింది. ఆదివారం ఉదయం 11.54 గంటల సమయంలో కర్ణాటక రాజధాని బెంగళూరునుంచి అస్సాం రాజధాని గౌహతిలోని కామఖ్య స్టేషన్‌కు వెళుతున్న కామాఖ్య ఎక్స్‌ప్రెస్ నిర్గుండి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది. 11 కోచ్‌లురైలు పట్టాలు తప్పి ఒరిగిపోయాయి. కాగా ఈ విషయం తెలిసినవెంటనే రైల్వే అధికారులు పోలీసులు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలుచేపట్టారు. ఈ ప్రమాదంలో సుమారు పదిమందిప్రయాణీకులు గాయపడినట్లు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన ఏడుగురుప్రయాణీకులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు సంఘటనా స్థలానికి సహాయక రైలును పంపించామని ఈస్ట్‌కోస్ట్ సిపిఆర్ఒ అశోక్‌కుమార్ మిశ్రా తెలిపారు. బాధితప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వీలైనంత త్వరగా రైల్వేలైన్ పునరుద్ధరించడం తమ ప్రాధాన్యత అన్నారు. ధౌలి ఎక్స్‌ప్రెస్, నీలాచల్ ఎక్స్‌ప్రెస్, పురూలియా ఎక్స్‌ప్రెస్‌లను దారిమళ్లించామన్నారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోందని హెల్ప్‌లైన్లను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు సిపిఆర్వో తెలిపారు.

# చీఫ్ జస్టిస్ అనుమతి ఉంటేనే వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ, మార్చి 30:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతి లేకుండా జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయలేమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. జడ్జి అధికారిక నివాసంలో నోట్లకట్టలు వెలుగుచూసిన వైనంపై యశ్వంత్‌వర్మను సుప్రీం కొల్లిజియం ఆయన స్వస్థలం ఢిల్లీ హైకోర్టుకు బదలిచేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఈ సంఘటనపై ముగ్గురితో కూడిన ప్రత్యేకకమిటీని ఏర్పాటుచేసారు. ముందు ఆకమిటీ నివేదిక రావాలని, ఆ తర్వాత సుప్రీం చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా అనుమతి ఇస్తేనే వర్మపై ఎఫ్ఐఆర్‌నమోదుకు వీలవుతుందని హోంమంత్రిప్రకటించారు. ప్రస్తుత సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ చట్టాల బిల్లును ప్రవేశపెడతామని అన్నారు. ముస్లిం మైనార్టీల నిరసనలు, ఇస్లామిక్ సంస్థల వ్యతిరేకతను పట్టించుకోనవసరం లేదని, జెపిసి నివేదికతోనే పార్లమెంటుకు ఈబిల్లు వస్తుందన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం ఈ వక్ఫ్‌బిల్లును 2013లో ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించిందని, ఓటుబ్యాంకు బుజ్జగింపు రాజకీయాలకోసం అలాచేసిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో చేసింది కాదన్నారు. జస్టిస్ వర్మకు సంబంధించి సుప్రీం సిజె అనుమతితోనే ఎఫ్ఐఆర్‌నమోదుచేస్తారన్నారు. అంతకుముందు సిజె సంజీవ్‌ఖన్నా మాట్లాడుతూ ఢిల్లీపోలీసులు, ఫైర్‌బ్రిగేడ్ అధికారులు ప్రత్యేకమిటీ ఏ డాక్యుమెంట్లు కోరినా అందిస్తున్నారని అన్నారు. వారు విచారణకమిటీకి ఎంతో సహకరిస్తున్నారన్నారు. ఈ వ్యవహారంపై కమిటీ తన నిర్ణయాన్ని అందిస్తుందని, అంతేకాకుండా పబ్లిక్ డొమైన్‌లో కూడా పెడతామన్నారు. కమిటీ నివేదిక వచ్చేంతవరకూ వేచి ఉండాల్సిందేనని అన్నారు. అయితే జస్టిస్‌వర్మ బదలీపై హోం మంత్రి వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు.



# డిజిటైజేషన్‌కాదు సంస్థాగత దోపిడీ

## ఎటిఎం ఛార్జిల బాదుడుపై ఎంకె స్టాలిన్

**చెన్నై, మార్చి 30:** ఎటిఎం నెలవారి పరిమితులు దాటిన విత్‌డ్రాయల్స్‌కు ఛార్జిలు విధించుకోవచ్చుని రిజర్వుబ్యాంకు జాతీయ బ్యాంకులకు అనుమతులివ్వడంచూస్తుంటే సంస్థాగత దోపిడీగా కనిపిస్తోందని తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్ అన్నారు. ఇది ఎంతమాత్రం డిజిటైజేషన్ కాదని, సంస్థాగత దోపిడీ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు తెరుచుకోవాలని కోరిందని, ఆ తర్వాత పెద్దనోట్ల రద్దు వచ్చిందని, ఇపుడు డిజిటల్ ఇండియా వచ్చిందని గుర్తుచేసారు. తన సోషల్‌మీడియా పోస్టులో డిజిటల్ లావాదేవీలపై ఛార్జిలు వచ్చాయని, తక్కువ నిల్వలకు ఛారజ్జిలు విధిస్తున్నారని, ఇపుడు ఆర్‌బిఐ నేరుగా బ్యాంకులు నెలవారి లిమిట్ దాటితే ఒక్కో విత్‌డ్రాకు రూ.23 చొప్పున ఛార్జిలు విధించుకోవచ్చని అనుమతిస్తోందని విమర్శించారు. పేదలను సమ్మిళిత అభివృద్ధిలోచేర్చడం అంటే ఇదేనా అని మండిపడ్డారు. ఎంఎన్‌రేగా, కెఎంయుటి స్కీంలు ఇపుడు ఈఛార్జిల పెంపునకు లోనవుతున్నాయన్నారు.

అలాగే తమిళనాడుప్రభుత్వం మహిళలక నెలవారీ ఇచ్చే సాయం రూ.1000పైనా ఈ ఛార్జిల మోత ఉంటుందని అన్నారు. ఇది ఎంతమాత్రం డిజిటైజేషన్‌కానేకాదని, సంస్థాగత దోపిడీ అని స్టాలిన్ అన్నారు. నిరుపేదల ముఖాల్లో చిరునవ్వులంటే ఇదేనా అని ప్రశ్నించారు.

# సంక్షోభంలోకి దేశ బ్యాంకింగ్ రంగం

## విపక్ష నేత రాహుల్ గాంధీ ఆందోళన



**న్యూఢిల్లీ,మార్చి 30:** కేంద్రంలోని బిజెపి సర్కారు అనుసరిస్తున్న ఆశ్రిత పక్షపాతం, నియంత్రణ వనయవస్థల దుర్వినియోగం వంటి విధానాలు బ్యాంకింగ్ వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఫలితంగాజూనియర్ ఉద్యోగులు పని ఒత్తిడిని ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తంచేసారు. తన బిలియనీర్ మిత్రకోసం కేంద్ర సర్కారు రూ.16లక్షలకోట్ల రుణాలనురద్దుచేయడం వంటి ఆర్థిక అసమర్థ నిర్ణయాలతో నిజాయితీగా పనిచేసే వేలమంది వృత్తినిపుణులు ఇబ్బందులు డినట్లుగా తెలిపారు. ఐసిఐసిఐబ్యాంకుకు చెందిన మాజీ ఉద్యోగుల ప్రతినిధిబృందం తనను కలిసిన విడియోను రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేసారు. ఆర్థిక విధానాల దుర్వినియోగంతో ఇబ్బందులుపడుతున్న ఇటువంటి శ్రామిక తరగతి నిపుణులకోసం కాంగ్రెస్‌పార్టీ పోరాడుతోందని, పని ప్రదేశంలో వేధింపులు దోపిడీని అంతం చేస్తామని రాసుకొచ్చారు. ప్రైవేటు రంగ బ్యాంకుల్లో ఇటువంటి అన్యాయాలు ఎదుర్కొంటున్న మిగిలిన ఉద్యోగులు కూడా తనను సంప్రదించాలని రాహుల్ కోరారు.

# మా జాబితాలో నెక్ట్స్ నువ్వే..

## సమాజ్‌వాదినేతలకు బిష్ణోయ్ గ్యాంగ్ బెదరింపులు




**న్యూఢిల్లీ, మార్చి 30:** లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తనకు బెదిరింపులు వస్తున్నట్లు సమాజ్‌వాది పార్టీ జాతీయ ప్రతినిధి తారిఖ్‌ఖాన్ అన్నారు. గడచిన రెండునెలలుగా బిష్ణోయ్ గ్యాంగ్‌కుచెందిన వ్యక్తి తనకు ఫోన్‌కాల్స్‌చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నా తాను పట్టించుకోలేదన్నారు. తాజాగా మరోసారి కాల్‌చేసి తాము చంపబోయే వ్యక్తుల జాబితాలో తర్వాత నువ్వే ఉన్నావంటూ బెదిరించారని రెండు రోజులు ఆగితే తాము ఏంచేస్తామో తెలుస్తుందంటున్నారని తెలిపారు. ఈ సమాచారం ఎస్పీకి తమ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌కు తెలియజేసానన్నారు. ఎస్‌ఫి రమానంద్‌ప్రసాద్ మాట్లాడుతూ కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిజంగానే బిష్ణోయ్ గ్యాంగ్ వ్యక్తులు ఈకాల్‌చేసారా లేక సైబర్ నేరగాళ్లపనా అనే కోణంలో విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఎస్పీనేతకు రక్షణ కల్పిస్తామని హామీఇచ్చారు. ఇప్పటికేపలుసార్లు బిష్ణోయ్‌గ్యాంగ్‌ణుంచి సల్మాన్‌ఖాన్‌కు బెదిరింపులు ఎదురయ్యాయి. గత ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్టుమెంట్‌వద్ద గానయంగ్‌కు చెందిన వ్యక్తులు కాల్పులుజరిపారు. సల్మాన్‌స్నేహితుడు ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీని వీరు దారుణంగా హత్యయచేయడంతో గతంలో వీరిపేరు తెరపైకి వచ్చింది. ఈ గ్యాంగ్‌నాయకుడయిన లారెన్స్ బిష్ణోయ్‌రపస్తుతం జైలులో ఉన్నాడు. బ్యారక్ ల్లోకి అక్రమంగా వచ్చే సెల్‌ఫోన్ల ద్వారా అనుచరులతో నిరంతరం టచ్‌లో ఉంటూ హత్యలకు ప్రణాళికలు వేస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. సిద్ధూమూసేవాలా, బాబా సిద్ధిఖీలపై దాడులు ఈవిధంగానే చేసాడని పోలీసులు చెపుతున్నారు.

# శ్రీరామనవమిన రామేశ్వరంలో పంబన్ వంతెన ప్రారంభం

## దేశంలోనే మొదటి వర్టికల్‌లిఫ్ట్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

**చెన్నై, మార్చి 30:** శ్రీరామనవమి పర్వదినం రోజు అంటే ఏప్రిల్ ఆరవ తేదీ ప్రధాని నరేంద్రమోడీ తమిళనాడులోని రామేశ్వరంలో కొత్తగా నిర్మించిన పంబన్ వంతెనను ప్రారంభించ నున్నారు. అంతేకాకుండా రామనాథస్వామి దేవాలయంలో ప్రార్థనలు కూడా నిర్వహిస్తారు. 2.5 కిలోమీటర్ల పొడవైన పంబన్ వంతెన రామేశ్వరం నుంచి తమిళనాడుప్రధాన భూభాగానికి చేరువ చేసే విధంగా నిర్మించారు. కేవలం ఐదునిమిషాల్లోనే ఇపుడు గమ్యస్థానానికి ఈ వంతెనమీదుగా చేరతాయి. ఇప్పటివరకూ బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెనపై 25 నుంచి 30 నిమిషాలు తమిళనాడుకు చేరుకునే సమయం పడుతోంది. కొత్తగా రూ.535 కోట్లతో నిర్మించిన పంబన్‌బ్రిడ్జి వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జిగా నిర్మించారు. 1914లో నిర్మించిన పాత వంతెన కాలపరిమితి తీరిపోయింది. దీనికితోడు కొంతమేర దెబ్బతినడంతో 2022లోనే ఈ వం తెనపై రాకపోకలు నిలిపివేసారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గత నవంబరులో భారత్‌లోని మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జి అని ఫోటోలు ప్రకటించారు. పాత వం తెన పరంగా సుమారు 105 ఏళ్లపాటు రామేశ్వరాన్ని మెయిన్‌ల్యాండ్‌ను కలుపుతూవచ్చింది. కొత్త పంబన్ బ్రిడ్జితో ఇపుడు కేవలం ఐదు నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరతారు. ఈ బ్రిడ్జిపై గంటకు 75 కిలో మీటర్ల వేగంతో వెళ్ల వచ్చని రైల్వే సేఫ్టీ నిర్ధారించింది. అయి తే వర్టికల్ లిఫ్ట్ పోర్ష న్‌వద్ద మాత్రం స్పీడ్ తగ్గుతుంది. వంతెన డిజైన్ గంటకు 80 కిలో మీటర్ల వేగంగా నిర్మించారు. అయితే అయితే వంతెన మలుపులతో ఉండటంతో వేగం గంటకు 50 కిలో మీటర్లకు మాత్ర మే అనుమతించారు. నౌకలు వచ్చేసమయంలో ఈ వంతెన రెండుగా చీలిపోతుంది. ఒకే ఒక్కరి పర్యవేక్షణలో ఈ లిఫ్ట్‌ను నిర్వహించి నౌక వెళ్లిన తర్వాత మళ్లీ వంతెన యథాతథంగా వస్తుందని రైల్వేశాఖ వెల్లడించారు.





# పుతిన్ లగ్జరీకారులో భారీ పేలుడు

## హత్యాయత్నంగా అనుమానాలు

**మాస్కో, మార్చి 30:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చెందిన అధికారిక కార్లలో అత్యంత లగ్జరీ కారు అయిన లిమోజిన్‌లో భారీ పేలుడు సంభవించింది. మాస్కో నడిబొడ్డునన జరిగిన ఈ ఘటన రష్యా అధ్యక్షుడి భద్రతపై పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. పుతిన్‌పై హత్యాయత్నం జరిగిందన్న అనుమానాలు పెరిగాయి. ఈ ఘటనతో ప్రపంచ నేతలంతా ఉలిక్కిపడ్డారు. పుతిన్‌కు చెందిన అత్యంత ఖరీదైన కారు లిమోజిన్, లుబియాంకాలోని ఎఫ్‌ఎస్‌బీ ప్రధాన కార్యాలయం సమీపంలో కాలిపోతూ కనిపించింది. కారు ఇంజిన్‌నుంచి మంటలుప్రారంభం అయి వాహనంలోకి వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు అక్కడికి సమీపంలోని రెస్టారెంట్‌లోని సిబ్బంది కారుకు అంటుకున్న మంటలను ఆర్పేందుకు ముందుకువచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన విడియోఫుటేజిలో వాహనంనుంచి దట్టమైన నల్లటి పొగరావడం కారు వెనుకభాగం దెబ్బతినడాన్ని చూడవచ్చు. ఈ పేలుడుకు గల కారణం ఇంకా తెలియరాలేదని ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని రష్యన్‌మీడియా పేర్కొంది. ఈ కారునను ప్రెసిడెన్షియల్‌ఎస్టేట్ డిపార్టుమెంట్ పర్యవేక్షిస్తుంటుందని తెలిపింది. పేలుడుపై దర్యాప్తుచేస్తున్నట్లు ప్రకటన విడుదలచేసారు. ఇదిలా ఉంటే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ ఆరోగ్యం క్షీణిస్తోందని ఆయన త్వరలో చనిపోతారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఇటీవలేప్రకటించారు. ఇపుడు పుతిన్ కారు తగలబడిన ఘటన నేపత్యంలో రష్యా అధ్యక్షుడి మరణాన్ని జెలెన్‌స్కీ ముందే ఊహించారంటూ కథనాలు వెలువడుతున్నాయి.



# 12 నిమిషాల వ్యవధిలోనే మైన్మార్ భూప్రళయం

## 334 అణుబాంబులతో సమానమైన శక్తి విడుదల

**బ్యాంకాక్, మార్చి 30:** మైన్మార్‌తోపాటు థాయిలాండ్‌లో 12 నిమిషాల వ్యవధిలోనే సంభవించిన రెండు భారీభూకంపాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ భూకంపం 334 అణుబాంబులతో సమానమైన శక్తిని విడుదలచేసి వినాశనం సృష్టించిందని స్థానిక భూవిజ్ఞాన శాస్త్రవేత్త జెస్ ఫీనిక్స్ అన్నారు. ఈప్రాంతంలో మరిన్ని ప్రకంపనలు వచ్చే ప్రమాదం ఎంతో ఉందని హెచ్చరించారు. భారతటెక్టానిక్ ఫలకాలు యురేషియన్ ప్లేట్స్‌ను వరుసగా ఢీకొంటుండటం వల్ల నెలల తరబడి ఆఫ్టర్‌షాక్స్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. దేశంలో కొనసాగుతున్న అంతర్యుద్ధం కారణంగా మైన్మార్ విపత్తు మరింత తీవ్రం అవుతుందని హెచ్చరించారు. కమ్యూనికేషన్‌లో అంతరాయం వల్ల అక్కడ పూర్తిస్థాయిపరిస్థితులు బాహ్యాప్రపంచం గుర్తించేందుకు అవకాశం లేదన్నారు. భూఉపరితలానికి పదికిలోమీటర్ల లోతలోనే ప్రకంపనల కేంద్రాలున్నాయని యుఎస్ జియాలజికల్‌సర్వే వెల్లడించింది. విపత్తుకారణంగా మృతులు 10వేలు దాటే ప్రమాదం ఉందని అమెరికా ముందే హెచ్చ రించింది. ఇప్పటివరకూ 1647 మందికిపైగా మృతిచెందారు. కష్టసమయంలో మైన్మార్‌ను ఆదుకునేందుకు భారత్ ఇప్పటికే ముందుకు వచ్చింది. 40 టన్నుల సహాయ సామగ్రిని పంపించింది. తాత్కాలిక నివాసాలకోసం టెంట్లు, స్లీపింగ్ బ్యాగ్స్, వాటర్ ప్యూరిఫయర్లు, సోలార్‌ల్యాంప్ జనరేటర్లు, అత్యవసర వైద్యపరికరాలను మైన్మార్‌కు పంపించారు. అంతేకాకుండా విపత్తులో ఉన్న దేశానికి సాయం చేసేందుకు 80 మంది ఎన్డీఆర్‌ఎఫ్‌సిబ్బందిని పంపించింది. అమెరికా ఇండోనేసియా, చైనా ఇతర దేశాలుకూడా అవసరమైన సాయం అందిస్తున్నట్లు ప్రకటించాయి.

# మయన్మార్‌లో ఇంకా భూప్రకంపనలు

## భయంతో పరుగులు తీసిన ప్రజలు

**నాయ్‌పైథా(మైన్మార్), మార్చి 30:** మైన్మార్‌లోమళ్లీ భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేలుపై దీని తీనరవత 5.1గా నమోదయింది. ఇళ్లనుంచి ప్రజలు భయంతోబయటికి పరుగులుతీసారు. ఆదివారం మైన్మార్‌లోని రెండో అతిపెద్ద నగరం అయిన మాండలే సమీపంలో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించిందని యుఎస్ జియాలజికల్‌సర్వే ప్రకటించింది. సహాయకబృందాలు ప్రభావితప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను బయటకు తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే శుక్రవారం సభవించిన భారీ భూకంపం వల్ల రోడ్లు వంతెనలుకమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడంతో సహాయక చర్యలక ఆటంకం కలుగుతున్నట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. తొలుత మైన్మార్‌లో 7.7తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. 1647 మంది మృతిచెందగా 3400 మందికిపైగా గల్లంతయ్యారు. శిథిలాలను తొలగించేకొదీనద మృతుల సంఖ్య పెరుగుతోంది. శనివారం ఉదయం 11.53 గంటలసమయంతో 4.3తీవ్రతతోను, మధ్యాహ్నం మళ్లీ 2.30 గంటలకు 3.8 తీవ్రతతోను 20 నిమిషాల వ్యవధిలో 4.7తీవ్రతతో వరుసగా భూప్రకంపనలు వచ్చాయి. మరోసారి ఆదివారం భూకంపం రావడంతోప్రజలు భయాందోళనలకు గురయ్యారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న ఆకాశహర్మం కుప్పకూలిన ఘటనలో అక్కడ పనిచేస్తున్న వారిలో 78 మంది కార్మికుల జాడ తెలియరాలేదు. భూకంపంవల్ల నగరంలో చని పోయిన మరో 10 మందిని గుర్తించారు. భారీ స్థాయిలో ఉన్నశిథిలాలు తొలగించేందుకు మరింత శక్తివంతమైన యంత్రాలు వినియోగిస్తున్నారు.


## స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపం..

# చెన్నైలో అత్యవసరంగా ల్యాండింగ్



**చెన్నై, మార్చి 30:** స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో చెన్నైలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఆ విమానాన్ని పరిశీలించగా వీల్‌టైర్ పాడైనట్లు గుర్తించారు. ఆదివారం తెల్లవారుజామున జైపూర్ నుంచి చెన్నైకు బయలుదేరిన స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపాన్ని పైలట్లు గుర్తించారు. దీంతో చెన్నై విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. కాగా, ఆదివారం తెల్లవారుజామున 5.46 గంటలకు చెన్నై విమానాశ్రయంలో ఆ విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. తర్వాత ఆ విమానాన్ని సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా విమానం టైర్ పగిలి పాడైనట్లు గుర్తించారు. ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు స్పైస్‌జెట్ సంస్థ పేర్కొంది. మరోవైపు ఐఎటిఎ ఆపరేషనల్ సేఫ్టీ ఆడిట్ సర్టిఫికేషన్‌ను స్పైస్‌జెట్ ఇటీవల విజయవంతంగా పునరుద్ధరించింది. 2027 మార్చి వరకు ఇది చెల్లుబాటులో ఉంటుందని ప్రకటించింది. ఇది వెల్లడించిన రెండు రోజుల తర్వాత తాజాగా ఈ సంఘటన జరిగింది.

## జీబ్లీ వినియోగం తగ్గించండి: ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్



**వాషింగ్టన్, మార్చి 30:** ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ఎక్స్.. ఇలా ఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఓపెన్ చేసినా ఫీడ్ మొత్తం జీబ్లీ ఫొటోలతో నిండిపోతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 'జీబ్లీ స్టయిల్' ఇమేజ్ జనరేటర్ ట్రెండ్ అవుతోంది. యూజర్లను ఆకట్టుకునేందుకు ఓపెన్ ఎఐ సంస్థ ఇటీవల చాట్‌జిపిటిలో జీబ్లీ స్టూడియోను ప్రవేశపెట్టింది. దాంతో యూజర్లు తమ ఫొటోలను యానిమేషన్ తరహా చిత్రాలుగా మార్చుకుంటున్నారు. అయితే కొత్త ఒక వింత పాత ఒక రోత అన్నట్లుగా ఈ కొత్త సదుపాయాన్ని యూజరు విపరీతంగా వినియోగిస్తున్నారు. దీనిపై ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ స్పందించారు. జీబ్లీ వినియోగం ఎక్కువగా ఉందని, ఈ విషయంలో యూజర్లు కాస్త కూల్‌గా ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. 'మా సిబ్బందికి నిద్ర కూడా అవసరం కదా.. దయచేసి జీబ్లీ వినియోగం కాస్తతగ్గించండి.' అని కోరారు. ఓపెన్ ఎఐ సంస్థ ఇటీవల చాట్‌జిపిటిలో జీబ్లీ స్టయిల్ జనరేటర్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఆప్షన్‌ను విపరీతంగా వినియోగిస్తుండటం వల్ల తమ జిపియు వ్యవస్థపై అధికభారం పడుతోందని, అందుకే దీనికి లిమిట్ పెడుతున్నామని ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ ఇటీవల పేర్కొన్నారు. ఇప్పటికే ఉచిత యూజర్లకు ఫొటోల జనరేషన్‌లో రోజుకు మూడు అనే పరిమితి విధించారు. మరోవైపు గ్రోక్‌లో కూడా ఈ ఫొటో జనరేషన్ ఆప్షన్‌ను యూజర్లు విరివిగా ఉపయోగిస్తున్నారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామిఅమ్మవార్ల పూజల్లో పాల్గొన్న ఇఓ తదితరులు

# శివయ్య సన్నిధిలో ఉగాది సంబరాలు

**శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో తెలుగుసంవత్సరాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పూల సొబగులు, విద్యుత్ దీపాలంకరణలతో ఆలయం దేదీప్యమానంగా మారింది. బెంగుళూరుకు చెందిన ప్రత్యేక పూల డెకరేషన్ కళాకారులచే ఆలయంలో ఏర్పాట్లు చేశారు. గత కొన్నేళ్ళుగా దేవాదాయశాఖ ఆంగ్ల సంవత్సరాదికి స్వస్తి చెప్పారు. ఆలయాల్లో తెలుగుసంవత్సరాదిని ఘనంగా నిర్వహించాలని సంప్రదాయ కళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఇఓ డి.బాపిరెడ్డి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో, ప్రత్యేక శ్రద్ధ వహించారు. తెలుగుసంవత్సరాది సందర్భంగా నాలుగుమాడావీధులతో పాటు అనుబంధ ఆలయాల్ని చక్కగా ముస్తాబు చేశారు. నాలుగు మాడావీధుల్లో తెలుగుతనం ఉట్టిపడే విధంగా నిత్యకళ్యాణం పచ్చతోరణంలా తీర్చి దిద్దారు. వీధుల్లో మామిడి తోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేసారు. తెలుగుతనాన్ని ఉట్టిపడే విధంగా తీర్చి దిద్దారు. ఆలయంలోని బిక్షాల గాలిగోపురం, శివయ్యగోపురం,స్థపద మండపం, దక్షిణ గోపురం, కంచుగడప వద్ద ప్రత్యేక ఏర్పాట్లు ముస్తాబులు చేపట్టారు.ఊరంతా మామిడితోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేసి తెలుగుసంవత్సరాది సంబరాలకు సంబంధించి చాటి చెప్పారు. ఇక గోపురాలపై విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా మారింది.

ఆలయంలో పూజలు,అభిషేకాలు:

యుగాది సందర్భంగా ఆలయంలో వేకువ జామునుంచే సందడి చోటు చేసుకుంది. స్వామి వారి గర్భాలయం ఎదురుగా బంగారు ధ్వజస్థంభం ఆలయం వద్ద ప్రత్యేకంగా కలశం ఏర్పాటు చేసి పూజలు జరిపించారు.ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినాధన్ సూచన మేరకు అలంకార గురుకుల్ రాజేష్, వరదా గురుకుల్ పర్యవేక్షణలో వేదపండితులు అర్చకులు పూజా కార్యక్రమాల్ని చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో స్వామి అమ్మవార్లను సింహాసనం వాహనంలో ప్రతిష్టించి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. కన్నుల పండువగా సాగిన అభిషేకాలకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఆదివారం కావటంతో స్థానిక భక్తులే కాకుండా తమిళనాడు, కర్నాటకల నుంచి వచ్చిన భక్తులు కూడా అభిషేక సేవల్లో పాల్గొన్నారు. తెలుగుసంవత్సరాది సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేసిన అధికారులు వచ్చిన ప్రతిభక్తునికి సుదర్శనం ఏర్పాటుచేసారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద యుగాదిపచ్చడి పంపిణిని ఏర్పాటు చేసారు. ఇక సాయంత్రం స్వామి సన్నిధి వద్ద 'పంచాంగ శ్రవణం'కార్యక్రమాలను మారుతీ ప్రసాద్ శర్మ పఠించి వినిపించారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన తెలుగుదేశం మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓలు, లోకేష్‌రెడ్డి,ప్రసాద్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్ పెక్టర్లు సుదర్శనం, వెంకటముని, హరి యాదవ్, పిఆర్ఓ రవిలు పర్యవేక్షించారు.



పంచాంగం పఠనం చేస్తున్న సత్యనారాయణ శర్మ

# వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి

## పంచాగపఠనంలో సత్యనారాయణశర్మ

**శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త:** 'విశ్వావసు నామ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉంటారని, పంచాంగం చెబుతుందని ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని దర్శనం, పూజలతో సకల దోష పరిహారం సాధ్యమౌతుందని ఆస్థాన వేదపండితులు,సిద్దాంతి బెంగుళూరుకుచెందిన సత్యనారాయణశర్మ అన్నారు.ఆదివారం రాత్రి ఇక్కడి స్వామి సన్నిధి ఎదురుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం మొదటి సారి రూపొందించిన పంచాంగం పఠనాన్ని సత్యనారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రహ సంచారాన్ని గురించి వివరిస్తూ సమాజంలో వాతా వరణం అనుకూలంగా ఉంటుందన్నారు. ఆదివారం విశ్వావసునామ సంవత్సర పంచాంగాన్ని పఠించారు. స్వామి వారి గర్భగుడి ఎదురుగా ఉన్న బంగారుధ్వజస్థంభం ఎదుట భవిష్యత్తును గురించి వివరించారు. ఈ ఏడాది వర్షాలు గణనీయంగా ఉంటాయని వివరించారు. జనంలో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని వివరించారు. ఈ పంచాగం శ్రవణంలో ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఎఇఓ లోకేష్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి విశేషసంఖ్యలో భక్తు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పంచాంగంలో పేర్కొన్నట్లు రాష్ట్ర దేశ రాజకీయాలకు సంబంధించిన అంశాల్ని ప్రస్తావించారు.

# బిసి సంక్షేమ సంఘం ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షుడిగా మూర్తి

**విజయవాడ, మార్చి 30, ప్రభాతవార్త :** ఏపి బిసి సంక్షేమ సంఘం ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంవివిఎస్ఎన్ మూర్తిని నియమిస్తూ ఆదివారం మొగల్రాజపురం కుమ్మరి శాలివాహన సంఘ కార్యాలయంలో బిసి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, బిసి సంఘ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ కుమ్మరి క్రాంతి కుమార్‌లు నియామక పత్రాన్ని అందచేశారు. ఆ క్రమంలో కేసన శంకరరావు మాట్లాడుతూ మొగల్రాజపురానికి చెందిన ఎంవివిఎస్ఎన్ మూర్తి జిల్లా అటవీ శాఖాధికారిగా రిటైర్ అయిన తరువాత కుమ్మరి శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఎంబిసి) ఆల్ ఇండియా ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారని, 2005 నుండి 2008 వరకు ఏపి అటవీ శాఖ ఉద్యోగ సంఘానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. అటు ప్రభుత్వం ఇటు ఉద్యోగులు ఎంబిసిల సమస్యల పరిష్కారంలో కీలక భాగస్వామిగా ఉద్యమాలు పోరాటాలు చేసి సమస్యల పరిష్కారాలకు కృషి చేశారన్నారు. జ్యోతిష శాస్త్రంలో డాక్టర్ పట్టా పొందిన మూర్తి బిసి సంక్షేమ సంఘం అభివృద్ధికి, బిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో



నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

పాటు బిసి ఉద్యోగ విభాగ నిర్మాణ విస్తృతి కోసం బిసి సమాజ సాధికారతకు ఇకపై తన వంతు కృషి చేస్తారని ఆకాంక్షించారు. అనంతరం మూర్తి మాట్లాడుతూ శాలివాహన సంఘంతో పాటు, ఎంబిసి ఫెడరేషన్‌లోను ఉద్యోగిగా అటవీ శాఖలోను నా పని విధానంతో ఎన్నో మార్పులు తీసుకొచ్చి అన్నింట అభివృద్ధి చూపించానన్నారు. ఆ అనుభవంతో ఆహరహం కృషి చేస్తానని మూర్తి వాగ్దానం చేశారు.

# మాజీ మంత్రి కాకాణికి పోలీసుల తాకీదు

**నెల్లూరు క్రైమ్, మార్చి 30, ప్రభాతవార్త :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పొదలకూరు పోలీసులు ఆదివారం పోలీస్ విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు అందజేశారు. పొదలకూరు మండలంలోని రుస్తుం మైన్స్‌లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన మైనింగ్ కుంభకోణానికి సంబంధించి తమ విచారణకు సోమవారం ఉదయం నెల్లూరు రూరల్ డిఎస్పి కార్యాలయంలో హాజరు కావాలంటూ కాకానికి పొదలకూరు సిఐ శివరామకృష్ణారెడ్డి పేరిట ఈ నోటీసులను పొదలకూరు పోలీసులు నెల్లూరు నగరంలోని కాకాణి నివాసంలో అందజేశారు. ఈ నోటీసులు అందజేసే సమయంలో కాకాని నివాసం వద్ద పోలీసులు మోహరించారు. గత రెండు రోజులుగా మాజీ మంత్రిని అరెస్టు చేస్తారనే ఊహాగానాలు నగరంలో వ్యాపిస్తున్న తరుణంలో ఈ నోటీసుల అంశం చర్చనీయాంశమైంది.

# ఇందిరమ్మ ఇంటి పథకానికి కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఇళ్లు లేకుండా జీవనం సాగిస్తున్న పేదవాళ్లు ఏ ఒక్కరు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతిపేదవానికి ఇందిరమ్మ ఇంటి పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తోంది. అంతేకాకుండా ఇందిరమ్మ ఇంటి పథకంలో ఎటువంటి అవకతవకలు జరగకుండా తగుజాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికి ఈ పథకాన్ని జనవరి 26, రిపబ్లిక్‌డే ఉత్సవాలను పురస్కరించుకుని ప్రారంభించింది. అంతేకాకుండా అదేరోజున ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేసుకుని వారికి మంజూరు పత్రాలను అందించింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా పలు ఇళ్ల నిర్మాణాలను ఇప్పటికే బొగ్గు పోసి ప్రారంభించారు. మరికొద్దిరోజుల్లో బేస్‌మెంట్ స్థాయిని పూర్తి చేసుకోబోతున్నాయి. ఇందులో భాగంగా కొద్దిరోజులు క్రితం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన కొత్త మార్గదర్శకాలను విడుదలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హత కలిగిన వారి నుంచి ప్రజాపాలన, గ్రామ సభల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది.

జిల్లాల వారీగా అర్హులను జాబితాను సిద్ధంచేసి మొదటి విడుతలో సోంత జాగా ఉన్న వారికి ప్రాధాన్యత ఇచ్చింది. ఇందులో భాగంగా మొదటి విడుతలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు అయ్యాయి. ఇందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 72,045 మంది లబ్దిదారులకు ఇండ్లను మంజరు చేశారు. ప్రస్తుతం అర్హుల లిస్టును ప్రకటించిన గ్రామాలను మినహాయించి మిగిలిన అన్ని గ్రామాల్లో అర్హుల ఎంపికపై అధికారులు దృష్టి సారించారు మొదటి విడుతలో ఇండ్లు కుట్టకోవాలనుకునే పేదలకు ప్రాధాన్యం ఇచ్చారు. పలు ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికయిన లబ్దిదారులు ఇండ్ల నిర్మాణ ప్రక్రియను ప్రారంభించారు.

అయితే ఇందిరమ్మ ఇళ్ళపథకంలో భాగంగా ఇల్లు నిర్మించుకున్న లబ్దిదారులకు రూ.5 లక్షల ఆర్దిక సాయం అందించనుంది. ఇంటి నిర్మాణానికి ప్రారంభంలో ( ఫౌండేషన్) రూ.1 లక్ష, బేస్‌మెంట్ లెవల్లో రూ.1.25 లక్షలు, ఇతర నిర్మాణాలు పూర్తవుతుంటే రూ.1లక్ష ఇస్తామని లబ్దిదారుల ఖాతాలోనే నేరుగా నిధులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటిచింది. అయితే తాజగా ఇందిరమ్మ పథకాకిని సంబంధించి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. వాటి ప్రకారమే నిర్మాణాలు జరగాలని సూచించారు.

ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్మాణాలు జరగాలని సూచించారు. లేదంటే బిల్లులు నిలిపివేస్తామని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 26న మంజూరు చేసిన ఇళ్ళ నిర్మాణాలు ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతున్నాయి.. అయితే రాష్ట్రవ్యాప్తంగా 10000 ఇళ్ళ నిర్మాణాలు బేస్‌మెంట్ లెవల్‌కు రాగానే మొదటి దశలో బిల్లులు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా బిల్లుల చెల్లింపులకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవని సరిపడా నిధులు సిద్దంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలూ పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు వారు చెబుతున్నారు.

**కొత్త మార్గదర్శకాలు ఇవే..**

ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసిన తర్వాత బేస్‌మెంట్ పనులు ప్రారంభించే ముందు స్థలం ఫోటో తీయాలి.

ఆ ఫోటోను ఇందిరమ్మ యాప్‌లో మొబైల్ ఫోన్ ద్వారా జియోకో ఆర్డినేట్స్ లో నమోదు చేయాలి.

ఇంటి నిర్మాణ వైశాల్యం 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఉండాలి.

రెండు గదులు, ఒక వంట గది, బాత్‌రూమ్ ఉండేలా ఇంటి నిర్మాణం చేపట్టాలి.

ప్రతి దశలోనూ ఫోటోలు తీసి మొబైల్ ద్వారా ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

వాటి ఆధారంగానే లబ్దిదారులకు చెల్లింపులు ఉంటాయి.

పాత ఇంటిని ఆనుకొని గాని, ఇప్పటికే ఉన్న ఇంటికి అదనపు గదులుగా కానీ, కొంత వరకు కూల్చివేసిన వాటికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిర్మాణం చేయకూడదు.

గతంలో నిర్మాణం ప్రారంభించి కొంత మేరకు నిర్మించిన ఇళ్లకు ఎట్టి పరిస్థితుల్లో ఇందిరమ్మ పథకం మంజూరు చేయవద్దు.

ఇళ్లను కలిపి కట్టుకోవడానికి అనుమతి లేదు.

ఒక కుటుంబంలోని ఒక సభ్యుడికి ఒక ఇల్లు మాత్రమే ఇవ్వాలి.

# 25 ఏజెన్సీలు.. 700 మంది సిబ్బంది



ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో నిరంతరంగా సహాయక చర్యలు

ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 30, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు నిరంతరంగా నిర్విరామంగా కొనసాగుతున్నాయి. కేంద్ర రాష్ట్రాలకు చెందిన వివిధ విభాగాలతో పాటు ప్రైవేటు సంస్థలన్నీ కలిపి 25 ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటునట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం 700 మంది సిబ్బంది ఈ ఆపరేషన్ లో నిమగ్నమైనట్లు చెప్పారు. సొరంగంలో కూలిన రాళ్లు, టీబీఎం విడిభాగాలను వెల్డింగ్ చేసి బయటకు తీస్తూ.. ఎప్పటికప్పుడు అక్కడ పేరుకున్న మట్టి, రాళ్ల దిబ్బలు, పూడిక, ఊట నీటిని బయటకు తొలిగిస్తున్నారు.

**పండుగవేళ కొనసాగిన సహాయక చర్యలు..**

ఆదివారం ఎస్ఎల్‌బిసి, టన్నెల్ ఆఫీసులో సహాయక బృందాల ఉన్నత అధికారులతో ఎస్ ఎల్ బి సి, టన్నెల్ ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయక బృందాలకు తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగ రోజు సహితం కుటుంబాలకు దూరంగా ఉంటూ సహాయక చర్యలలో పాల్గొంటున్న సహాయక సిబ్బందినీ ప్రత్యేకంగా అభినందించారు. టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని రక్షించడానికి ప్రభుత్వము, జిల్లా యంత్రాంగం ఏ ఒక్క అవకాశాన్ని వదిలిపెట్టకుండా వివిధ రకాల నిష్ణాతులైన సిబ్బందిని, సాంకేతికతను ఉపయోగించు కుంటున్నట్లు, మొదటి రోజు నుంచే టన్నెల్ లోపల రెస్క్యూ ఆపరేషన్ చేయగల ఆర్మీ సిబ్బంది, ఎన్.డి ఆర్ ఎఫ్, ఎస్ డి.ఆర్.ఎఫ్, సింగరేణి, హైడ్రా, రైల్వే, జి.ఎస్. ఐ., ఎన్ జి.ఆర్.ఐ., ర్యాట్ హోల్ మైనర్స్, ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్లు, కేరళ నుంచి ప్రత్యేక శిక్షణ పొందిన క్యాడవర్ డాగ్స్, రోబోటిక్ సహా అన్ని రకాల నిష్ణాతులను, సాంకేతికతను ఉపయో గించుకుంటూ టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని, ప్రతి రోజూ నిరంతరాయంగా కొనసాగుతున్న సహాయక చర్యలపై సమీక్షలు నిర్వహిస్తూ,పలు సూచనలు,సలహాలు అందజేస్తూ సహాయక పనులను వేగవంతం చేస్తున్నామని వివరించారు. నిర్విరామంగా డీ వాటరింగ్ ప్రక్రియలను చేపడుతూ, సహాయక పనులకు ఆటంకంగా వున్న సిల్ట్‌ను తొలగిస్తూ లోకో ట్రైన్ ద్వారా టన్నెల్ బయటికి తరలిస్తున్నారు.

# పేలవంగా రోహిత్‌శర్మ ఫాం

## కొత్వాల్ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు

## గౌరవంగా రిటైరయితే మంచిదని సలహా

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** ఐపిఎల్‌లో భాగంగా శనివారం ముం బయి ఇండియన్స్ గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ముంబ యి ఇండియన్స్ ఆటగాడు రోహిత్‌శర్మ కేవలం ఎనిమిది పరుగులు మాత్రమే చేసి అవుట్ అవడంపై సిటీకొత్వాల్, అండర్ 19 మాజీ భారత క్రికెటర్ సివి ఆనంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రోహిత్‌శర్మ ఎప్పుడో కానీ పరుగులు చేస్తే ఎలా, అప్పుడప్పుడు మాత్రమే పరుగులు చేస్తుంటే గౌరవం దక్కు తుందా.. ఆయన ప్రశ్నించారు. రోహిత్‌శర్మ తన స్థాయికి దగ్గ ప్రదర్శన చేయలేకపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశపరుస్తుందని, ఇలాంటి పరిస్థితుల్లో కెరీర్‌ను కొనసాగించేబదులు, గౌరవంగా రిటైర్ అవడంమేలని ఆనంద్ తెలిపారు. ఛాంపియన్ ట్రోఫి ఫైనల్‌వంటి అరుదైన సందర్భాల్లోనే రోహిత్ పరుగులు చేస్తే సరిపోతుందా? ఇతర మ్యాచ్‌ల సంగతి ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. అనుకోకుండా తాను ముంబయి ఇండియన్స్ గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను చూడడం జరిగిందని, ఈ సమయంలో రోహిత్‌శర్మ అవుట్ అవడం చూశానని, అతను అవుటైన విధానం తనకు జాలి కలిగించిందని,దీనికి సంబంధించిన విడియోను ఆనంద్ షేర్‌చేశారు. కొత్వాల్ ఆనంద్ షేర్‌చేసిన విడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులకు సవాల్‌గా రిమోట్ బాంబులు



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ వద్ద రహదారిపై నక్సల్స్ అమర్చిన రిమోట్ బాంబును పేల్చివేసిన పోలీసులు.

## మహబూబాబాద్‌లో కలకలం రేపుతున్న వరుస పేలుళ్లు

## భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉండాలి: నిఘా వర్గాల హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** నక్సల్స్ ఖిల్లా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై పైచేయి సాధించి దూసుకు పోతున్న భద్రతా బలగాలకు ఇప్పుడు కొత్త సవాల్ ఎదురవుతోంది. ఇప్పటి వరకు వున్న మందు పాతరలకు భిన్నంగా అర కిలోమీటర్ నుంచి కిలోమీటర్ దూరం నుంచి రిమోట్‌లతో పేల్చగల కొత్త తరహా మందు పాత ర (ఆర్‌సిఐఈడీ)లను నక్సల్స్ తయారు చేసి వాటిని భారీ సంఖ్యలో రహదారులపై అమర్చినట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఆర్‌సిఐఈడి బాంబుల వల్ల ఇ ప్పటి వరకు 15 మంది పోలీసులతో పాటు మరో నలుగురు పౌరులు మరణించగా పది మంది వరకు గాయపడ్డారు. ఛత్తీస్‌ఘడ్‌లో అబూజ్‌మడ్‌ను కూల్చి వేసేందుకు వరుసగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని ముందుకు వెళ తున్న భద్రతా బలగాలను నివారించ చేందుకు నక్సలైట్లు అమర్చిన ఆర్‌సి ఐఈడీలను గుర్తించిన నిఘా వర్గాలు దీనిపై అప్రమ త్తంగా వుండాలని పోలీ సులను ఆదేశించాయి. ఛత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణలోని మహబూబాబాద్‌లోని పలుచోట్ల ఆర్‌సిఐఈడి బాం బులు పేలడం కలకలం రేపుతున్నాయి. నక్సల్స్ అమర్చిన ఆర్‌సిఐఈడిలలో కొన్నింటిని భద్రతా బలగాలు గుర్తించి నిర్వీర్యంచేయడంతో పాటు వాటిని పేల్చి వేస్తున్నారు.

వచ్చే ఏడాది (2026) మార్చి నాటికి దేశంలో నక్సలైట్ల ఏరివేత పూర్తిగా జరగాలని, మావోయిస్టు రహిత భారత్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించడం తెలి సిందే. ఇందులో ఆపరేషన్ కగార్ చేబట్టడం విదితమే. ఇందులో భాగంగా వేల సంఖ్యలో పారా మిలటరీ బలగాలను నక్సల్స్ స్థావరాలున్న చోట మొహరించడం, వ రుసగా కూం బీంగ్ జరుగుతోంది. ఈ క్రమంలో వరుసగా జరుగుతున్న ఎదురు కాల్పుల్లో నక్సల్స్ తరపున భారీగా ప్రాణ నష్టం వాటిల్లుతోంది. గడచిన 100 రోజుల్లో 140 మంది నక్సలైట్లు పోలీసు ఎన్‌కౌంటర్లో మరణించారు. అయితే మావోయిస్టులపై పోరులో దూసుకుపోతున్న భద్రతా బలగాలకు ఇప్పుడు నక్సలైట్లు కొత్తగా రూపొందించిన ఆర్ సిఐఈడీలు సవాల్ విసురుతున్నాయి. సాధారణ మందు పాతరలకు భిన్నంగా అర కిలోమీటర్ నుంచి కిలోమీటర్ దూరం నుంచి కూడా రిమోట్‌లతో పేల్చగల ఆర్‌సిఐఈడీలను నక్సల్స్ వందల సంఖ్యలో భద్రతా బలగాలు రాకపోకలు సాగించే రహదారులు, ఇతర మార్గాలలో అమర్చడం పోలీసులను కలవర పరుస్తో ంది. రెండు నెలల క్రితం పది మంది పోలీసులను బలిగొన్నది ఆర్‌సిఐఈడీ కావడం గమనార్హం. దీని తరువాత ఆర్‌సిఐఈడీలపై భద్రతా బలగాలు ఆరా తీస్తున్న క్రమంలో వరుసగా పోలీసులతో పాటు సామాన్యులు వీటికి బలవడం లేదా గాయపడడం జరుగుతోంది. తాజాగా శనివారం నాడు బీజాపూర్‌లో ఇదే బాంబు కారణంగా ఇ ద్దరు చిన్నారులు చనిపోగా వారి తల్లి తీవ్రంగా గాయపడింది. ఆర్‌సిఐఈడీల విషయంలో అప్రమత్తంగా వుండాలని, నిఘా వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది ఛత్తీస్‌ఘ డ్‌లో 50 మందు పాతరలు పేలిన ఘటనలు జరిగాయి. ఇందులో కొన్ని పోలీసులను బలి తీసుకోగా మరికొన్నింటిని పోలీసులు గుర్తించి పేల్చి వేశారు. మరో 28 మ ందు పాతరలను పోలీసులు గుర్తించి వాటిని నిర్వీర్యం చేశారు. గత ఏడాది విషయం ఇలావుంటే ఈ ఏడాది మూడు నెలల్లోనే వంద వరకు మందు పాతరలను పోలీ సులు గుర్తించగా ఇందులో నాలుగు పేలుళ్ల భద్రతా బలగాలను బలితీసుకున్నాయి. మిగతా వాటిలో కొన్నింటిని నిర్వీర్యం చేయగా ప్ర మాదకరంగా వున్న వాటిని పే ల్చివేశారు. ఛత్తీస్‌ఘడ్‌లో ఇంతటి స్థాయిలో రిమోట్ మందు పాతరలు వెలుగు చూడడం ఇదే తొలిసారి. గతంలో మందు పాతరలను నక్సలైట్లు పోలీసుల క్యాంపుల కు మూడు నుంచి ఏడు కిలోమీటర్ల దూరం వరకు పేల్చేవారు. ఇప్పుడిది రెండు నుంచి మూడు కిలోమీటర్ల వరకు చేరిందని పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. పోలీసు బేస్ క్యాంపులు ఎక్కువవుతుండడంతో నక్సలైట్లు ఎదురు దాడికోసం ఆర్‌సిఐఈడీలను భారీగా వాడుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించా యి. పది రోజుల క్రితం ఛత్తీస్‌ఘ డ్ లోని బీజాపూర్‌లో గల సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంపు వద్ద ఐదు కిలోల ఆర్‌సిఐఈడీని నక్సల్స్ అమర్చగా దీనిని పోలీసు జాగిలాలు గుర్తించడంతో పెద్ద ముప్పు తప్పి ంది.

కాగా ఆర్‌సిఐఈడీ బాంబులను ఈ ఏడాది జనవరి నెలలో పోలీసులు గుర్తించారు. ఒకచోట మందు పాతర లభించగా దానికి సంబంధించిన యాంటెన్నా అర కి లోమీటర్ దూరంలో చెట్ల వద్ద వుండడం పోలీసులను షాక్‌కు గురిచేసింది. ఇటువంటివి మరిన్నింటిని ఛత్తీస్‌ఘడ్‌తో పాటు తెలంగాణ లోని మహబూబాబాద్ జిల్లాలో ఈ తరహా బాంబుల కారణంగా పలువురు పౌరులు మరణించగా మరికొందరు గాయపడ్డారు. ఇదే జిల్లాలోని కర్రెగుట్టలో ఈ తరహా మందు పాతరలు అనేకం వున్నా యని భద్రతా బలగాలు గుర్తించాయి.

# ఇక రాజకీయ నేతల విచారణ

## కొత్త మలుపు తిరగనున్న ఫోన్‌ట్యాపింగ్ కేసు

## శ్రవణ్‌రావు తర్వాత నేతలకు నోటీలు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మలిదఫాగా రాజకీయ నేతలను పోలీసులు విచారించే అవకాశాలు కనిపి స్తున్నాయి. ఈ కేసులో ఏడాది తరువాత శనవారం నాడు పోలీసుల విచారణకు హాజరైన మీడియా అధినేత శ్రవణ్ రావు నుంచి రాబట్టిన సమాచారం ఆధారంగా ఈ గోల్‌మాల్‌లో పాలుపంచుకున్న నేతలను విచారంచేందుకు పోలీసులు నిర్ణయించినట్లు సమాచారం. శ్రవణ్ రావును ఏప్రిల్ రెండవ తేదీన మరోసారి విచారించనుండడం తో ఇది పూర్తయిన తరువాత ఫోన్ ట్యాపింగ్‌కు కారకులైన రాజకీయ నేతలు, ఇందులో ప్రమేయం వున్న నాయకులను వరుసగా విచారించే అవకాశాలున్నాయి. దీని తరువాత ఫోన్ ట్యాపింగ్ కొత్త మలుపు తిరిగే వీలుంది.

రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపి, పోలీసు శాఖను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎనిమిది నెలల తరువాత మళ్లీ కదలిక వచ్చింది. గత ఏడాది మార్చి నెలలో వెలుగు చూసిన ఈ కేసులో నాటి సిటీ సెక్యూరిటీ వింగ్ అదనపు డిసిపి తిరుపతన్న, భూపాలపల్లి అదనపు ఎస్పి భుజంగరావు, ఎస్ఐబి డిఎస్పి ప్రణీత్ రా వు, సిటీ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావులను సిట్ అధికారులు అరెస్టు చేసి జైలుకు తరలించగా వీరంతా పది నెలల తరువాత బెయిలుపై విడుదలవడం తె లిసిందే. కాగా ఈ కేసు వెలుగు చూడడానికి ముందే అమెరికాకు పారిపోయిన ఆరవ ముద్దాయి శ్రవణ్ రావు సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వుల తరువాత శనివారం నాడు పోలీసుల విచారణకు హాజరవడం విదితమే. ఆయనను ఆరు గంటలకు పైగా పోలీసులు విచారించి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కీలక సమాచారం రాబట్టారు. అయితే ఆయన నుంచి మరింత సమాచారం కోసం ఏప్రిల్ రెండవ తేదీన మరోసారి విచారణకు రావలని ఆదేశించారు. ఆయనను రెండవసారి కూడా విచారించిన తరు వాత ఈ కేసులో వెలుగుచూసే సమాచారం ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రాజకీయ నేతలను విచారించేందుకు పోలీసులు రెడీ అవుతున్నారు. వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ వెలుగుచూసిన మొదట్లోనే రాజకీయ నేతల పేర్లు వెలుగు చూడడం తెలిసిందే. ఈ కేసులో అరెస్టయిన నలుగురు నాటి మంత్రులతో పాటు కొందరు నేతల ఒత్తిడి మేరకు, వారి ప్రయోజనాల కోసమే ఇదంతా చేసినట్లు వాంగ్మూలం ఇవ్వడం విదితమే. దీంతో పాటు ఈ గోల్‌మాల్‌లో నాటి ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు, మీడియా అధినేత శ్రవణ్ రావుల పాత్ర వుందని వారు చెప్పడం మరింత సంచలనం రేపింది. దీంతో ఆ సమయంలోనే ఆరోపణలు వచ్చిన నాయకులను విచారించేం దుకు పోలీసులు సిద్ధమయ్యారు. అయితే న్యాయ నిపుణుల సూచనల మేరకు ఈ కేసులో కీలక నిందితులుగా వున్న మొదటి ముద్దాయి ప్రభాకర్ రావు, ఆరవ ముద్దా యి శ్రవణ్ రావులను అరెస్టు చేసి విచారణ చేశాక వెలుగుచూసే సమాచారం ఆధారంగా నేతలను విచారించాలని పోలీసులు నిర్ణయించారు. ఇద్దరు కీలక నిందితుల్లో శ్రవణ్‌రావును అరెస్టు చేయకుండా సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో ఆయనను కేవలం విచారణకే పరిమితం చేసి కీలక సమాచారం రాబట్టారు. ఆయన ను ఇంకోసారి విచారించిన తరువాత మరింత సమాచారం రాబట్టాలని పోలీసులు భావిస్తున్నారు. దీనిని బట్టి ఫోన్ ట్యాపింగ్‌లో నేతల పాత్ర ఏ మేరకు వుంది...? వీ రితో నాటి ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావుకు వున్న లింకులేమిటి...? ఇతర పోలీసులకు వున్న సంబంధం ఏమిటీ...? అనే వివరాలు వెల్లడయ్యే వీలుందని పోలీసులు భావిస్తున్నారు. దీని తరువాత నేతలను విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. ఇక ఈ కేసులో అమెరికాలోనే వున్న ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ హైకోర్టులో విచారణలో వుంది. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు సర్కారు రెండు వారాల గడువు కోరడం తెలిసిందే. ఒకవేళ ప్రభాకర్ రావుకు కూడా ముందస్తు బెయిల్ లభిస్తే ఆయన కూడా అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చి పోలీసుల విచారణకు హాజరయ్యే వీలుంది.

# గాంధీభవన్ పేదల దేవాలయం

## ఉగాది వేడుకల్లో పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్



**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీభవన్ పేదల దేవాలయం లాంటిదని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం విశ్వవసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు మహేష్‌కుమార్ అధ్యక్షతన జరుగగా ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, విప్ అద్లూరి లక్ష్మణ్ ఎంపి అనిల్‌యాదవ్, మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆశిర్వాదంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఇతర మంత్రులు ప్రజాసంక్షేమం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్నారని అన్నారు. కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుందని అన్నారు. అభివృద్ది సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం ముందుకు సాగుతుందని ఆయన వివరించారు. పారిశ్రామిక అభివృద్ది జరుగుతోందని పెట్టుబడులు పెట్టేందుకు విదేశీయులు ముందుకు వస్తున్నారు. మనం పండిస్తున్న సన్నబియ్యం ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేస్తున్నాం అని అన్నారు. మనం పండిస్తున్న సన్నబియ్యం ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేస్తున్నాం అని అన్నారు. విద్యావరంగా చాలా ఆలోచనలు చేస్తున్నాం అని అన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నాం అని వివరించారు. దేశంలో కాంగ్రెస్ మల్లికార్జున ఖర్గే, యువ నాయకులు రాహుల్‌గాంధీ సోనియాగాంధీ నేతృత్వంలో ఎంతో పటిష్టంగా ఉందని ఆయన అన్నారు. రాబోయే మరోపదేళ్లు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ఆత్మవిశ్వాసం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కోసం పనిచేస్తుందని అన్నారు.

## తెలుగు ప్రజలకు శ్రీవిశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు

### బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు అంటూ బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా తెలుగులో ఎక్స్ వేదిగా ట్వీట్ చేశారు. ఈ నూతన సంవత్సరం మీకు మీ కుటుంబ సభ్యులకు ఆరోగ్య, ఐశ్వర్యాలను మరియు ఆనందాన్ని తెచ్చిపెట్టాలని ఆకాంక్షిస్తున్నాని, మీరందరూ సంతోషం, విజయాలతో కూడిన సంవత్సరాన్ని గడపాలని కోరుకుంటున్నట్లుపేర్కొన్నారు. ఈసందర్భంగా ఉగాదిశుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** ఈద్ ఉల్ ఫితర్ రంజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ కోరారు. రంజాన్ పండుగ సందర్భంగా వారు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో రంజాన్ గొప్పదం వివరిసూనత ముస్లిం పవిత్ర గ్రంథం ఖురాన్ అవిర్భావ మాసం అని పేర్కొన్నారు.రంజాన్‌లు ముస్లింలు అత్యంత సంప్రదాయ బద్ధంగా ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నానని ఆయన అన్నారు.



# ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందిస్తాం

### గ్రామస్తులతో డిప్యూటీ సిఎం భట్టి ఆత్మీయ పలకరింపులు

**మధిర(ఎర్రుపాలెం) మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం మధిర శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలోని ఎరుపాలెం మండలం మాచవరం, గుంటుపల్లి గోపవరం, ఎర్రుపాలెం గ్రామాలలో ఆయన ఉగాది వేడుకలను గ్రామస్తులతో కలిసి పంచుకున్నారు. కాచవరం గ్రామానికి చేరుకున్న ఆయనకు పార్టీ శ్రేణులు ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలికారు.గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు కేష నరసమ్మను ఆమె ఇంటికి వెళ్లి పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ప్రజలతో సమావేశమైన ఆయన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల హామీల లో భాగంగా గృహజ్యోతి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్రమంలో. 200 యూనిట్ల లోపు విద్యుత్తు వాడుతున్న గృహ వినియోగదారులకు జీరో బిల్ వస్తున్నదన్నారు. వీరికి సంబంధించిన డబ్బులను ప్రతినెల ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నదన్నారు.

మహాలక్ష్మి ్మ పథకం కింద వంటగ్యాసు సిలిండర్ ప్రభుత్వం 500 రూపాయలకే ఇస్తుందని, సబ్సిడీ డబ్బులు మీ బ్యాంకు ఖాతాలో పడుతున్నయా అని మహిళలను ఆరా తీశారు. పొదుపు సంఘం లో ఉన్న మహిళలకు ఇందిరమ్మ డైరీ పథకంలో సబ్సిడీపై గేదెలను ఇస్తామని భట్టి తెలిపారు. కాచవరం గ్రామంలో రేషన్ షాపు లేనందున లక్ష్మాపురం గ్రామానికి వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని గ్రామంలోనే రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కొంతమంది మహిళలు తమకు ఇల్లు లేవని ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి అయ్యిందని గ్రామంలో ఇంటి స్థలం ఉండి ఇల్లు లేనటువంటి వారికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని వెల్లడించారు.



వివరాలను వెల్లడిస్తున్న తూప్రాన్ డిఎస్పీ వెంకట్‌రెడ్డి

## వృద్ధురాలి కంట్లో కారంకొట్టి నగల చోరీ.. నిందితుల అరెస్టు

**చిన్నశంకరంపేట,మార్చి 29,ప్రభాతవార్త:** వృద్ధురాలి కంట్లో కారంకొట్టి బంగారు నగలను ఎత్తుకెళ్లిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తూప్రాన్ డిఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం చిన్న శంకరంపేటలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా శివంపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన వృద్ధులు ఒగ్గు కమలమ్మ, ఆమె భర్త లస్మయ్య ఈ నెల 11న చిన్నశంకరంపేట మండల పరిధి సంగాయపల్లిలో తమ మనవరాలు ఇంటివద్ద నిర్వహిస్తున్న మల్లన్న దేవాలయ పండగకు గవ్వలపల్లి వద్ద బస్సుదిగి సంగయ్యపల్లికి నడుచుకుంటూ వెళ్తున్నారు. వారు వెళ్లే మార్గంలో ఎస్.కొండాపూర్ గ్రామానికి చెందిన యువకులు మాడబోయిన బాబు, గురుచరణ్ వారిని గమనించి ద్విచక్ర వాహనంపై వారి వద్దకు వెళ్లి మేము కూడా గుడి వద్దకు వెళ్తున్నామని ఆ వృద్ధులను నమ్మించి ఒగ్గు కమలమ్మను ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని తీసుకెళ్లారు. కొద్దిదూరం వెళ్లాక గుడి సమీపంలోని ప్లాట్‌ఫామ్ వద్ద పథకం ప్రకారం ముందే తెచ్చుకున్న కారంపొడిని కమలమ్మ కళ్లలో చల్లారు. అరిస్తే చంపేస్తామని బెదరించి వృద్ధురాలీ మెడలో ఉన్న బంగారు గుండ్లు, చెవి కమ్మలు, ముక్కుపుడకను తీసుకొని అక్కడి నుండి పరారయ్యారు. ఒగ్గు కమలమ్మ కేకలు విని స్థానికులు అక్కడికి చేరుకొని జరిగిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని చిన్నశంకరంపేట ఎస్సై నారాయణగౌడ్ దర్యాప్తు చేపట్టారు.

# దొడ్డు బియ్యం నిల్వలపై ఉత్కంఠ

## ఇ పాస్ యంత్రాల్లో జీరో నిల్వలుగా నమోదు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** ఉగాది రోజున హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకం లాంఛనంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడంతో ఏప్రిల్ 1 తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ ప్రారంభం కాబోతుండటంతో ఇన్నాళ్లు చౌకదరల దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డుబియ్యం నిల్వలపై ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం చౌకధరల దుకాణాల్లో ఉన్న దొడ్డు బియ్యం నిల్వలను ఈపాస్ యంత్రాలతో జీరోగా మార్పుచేసింది. తెలంగాణలో ఎం ఎల్ఎస్ పాయింట్లు వద్ద ఆరేడు నెలల సరిపడ సన్న బియ్యం స్టాక్ వచ్చి చేరింది. కరీంనగర్ జిల్లాలోనే 33వేల మె.ట బియ్యం ఎల్ఎస్‌పాయింట్లు వద్ద నిల్వఉంది. ఏడు నెలల వరకు సన్నబియ్యం సరఫ రాకు ఢోకాలేదని అక్కడి అధికారులు ధీమాతో ఉన్నారు. తెలంగాణ వ్యాప్తంగా చౌకదరల దుకాణాల్లో సన్నబియ్యం వండకు వందశాతం సరఫరాచేసి నిల్వచేసుకున్నారు. నెలవారీ కోటాతోపాటుగా చౌకధరల దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం ఎంత మేరకు నిల్వ ఉన్నాయో అంతమేరకు సన్నబియ్యం కూడా అదనంగా రేషన్ డీలర్లకు ఇచ్చారు. ప్రస్తుతానికి దొడ్డుబియ్యంపై విధానపరమైన నిర్ణయం తీసుకోలేదు. ఆసిఫాబాద్ జిల్లాలోనే 2,640.96 క్వింటాళ్ల దొడ్డు బియ్యం రేషన్‌షాపుల్లో ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 748 చౌకధరల దుకాణాలు గత ఆర రోజుల క్రితం నుండే సన్నబియ్యం సరఫరా చేస్తున్నా దొడ్డ బియ్యం మాత్రం ఇంకా వాపస్ తీసుకొపోలేదు. ఖమ్మం జిల్లాలో 26,932 లబ్ధిదారులు పెరగడంతో ఏప్రిల్ నెలలో 7375.868 మె.ట బియ్యం సరఫరాచేశారు. మార్చినెలలో 6222.687 మె.ట బియ్యం కేటాయించారు. ఏప్రిల్ నెల కోటపెరగడం అదే విధంగా దొడ్డు బియ్యం చౌకధరల దుకాణాల్లో ఉండటంతో రేషన్ దుకాణాలు బియ్యం నిల్వలతో కిక్కిరిసి పోయింది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 2050 చౌకధరల దుకాణాల్లో 45,656 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో 566 రేషన్ దుకాణాలలో 4926మె.ట దొడ్డు బియ్యం ఉన్నట్లు లెక్కించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 71647 మె.ట దొడ్డుబియ్యం రేషన్ షాపుల్లో ఉన్నట్లు పౌరసరఫరా అధికారుల అంచనా వేశారు. స్టేజ్-1, స్టేజ్-2 గిడ్డంగుల్లో కూడా దొడ్డుబియ్యం నిల్వలు లెక్కిస్తున్నారు. మార్చి నెలలో సరుకుల పంపిణీ ఆలస్యంగా 24వరకు సాగ దీశారు. కొత్తరేషన్‌కార్డులతోపాటు కోటా కూడా మంజూరు చేయడంతో వారంతా లబ్ధిపొందాలన్న ఉద్దేశంతో గతనెల పంపిణీ గడువు పెంచారు.

# నా రాజకీయ కథను నేనే రాసుకొని నటిస్తున్నా

## విద్యార్థి దశనుంచే నాపై ఎన్నో కుట్రలు

### పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** నా రాజకీయ జీవిత కథను నేనే రాసు కున్నానని ఎవరో రాసిన కథల్లో హీరోలు నటిస్తారని కానీ నా కథలో నేనే 'ఏ వార్ ఆఫ్ లవ్' పేరుతో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నాని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయ ప్రకాశ్‌రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి అన్నారు. శ్రీ విశ్వామస నామ కొత్త సవత్సరాది ఉగాది పండుగ రోజున ఆదివారం బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో మూవీ కార్యాలయాన్ని జగ్గారెడ్డి ప్రారంభించారు. విలకర్లతో జగ్గారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచి తనపై ఎన్నో కుట్రలు జరిగాయని తెలిపారు. కానీ తన నిజ జీవితంలో ఇవన్నీ తాను చేశానని గుర్తు చేసుకున్నారు.తన జీవితంలో జరిగిన అంశాలనే ఈ సిని మాలో పోలీసులను కొట్టినట్లు, వాళ్లతో ఫైట్ చేసినట్లు చూపిస్తున్నామన్నారు. ఈ సినిమాలో తన జీవితంలో కొన్ని సంఘటనలు వేరే వాళ్లతో చేస్తూనే తాను కూడా రోల్ ప్లే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సినిమా కార్యాలయమే ఇకపై తన అడ్డా అని స్పష్టం చేశారు. రాజకీయాల్లో తాను పోషించిన పాత్ర సక్సెస్ పుల్ ప్రయాణం సినిమాలోనూ అదే విధంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఇందులో తన ఒరిజినల్ క్యారెక్టర్ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పోలీసులను కొట్టినట్లు హీరోలు నటిస్తారు కానీ తనవి ఒరిజినల్‌గా ఉన్నాయని వెల్లడించారు. విద్యార్థి నేతగా, కౌన్సిలర్‌గా, మున్సిపల్ ఛైర్మన్‌గా తాను ఎదురుకొన్న కష్టాలు, బాధలు ఇవన్నీ చూపించనున్నారని తెలిపారు. తన రాజకీయ జీవిత కథను తానే రాసుకున్నానన్నారు. స్టోరీ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ అన్ని తానే రాసుకున్నానని చెప్పారు.అయితే ఓ ఫంక్షన్‌లో ఈ సినిమా డైరెక్టర్ రామానుజం తనను కలిశాడని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. తాను కొన్ని సంవత్సరాల క్రితం ఒక కథను రాసు కున్నానని.. అందులో మీ పాత్ర ఉండాల నుకుంటున్నానని పేర్కొన్నాడని తెలిపారు. డైరెక్టర్ రామానుజం చెప్పిన పాత్ర తన నిజ జీవితానికి దగ్గరగా ఉండటంతో ఈ సినిమాలో నటించేందుకు ఒప్పుకున్నానన్నారు. ఈ సందర్భంగా ఆయన చూపించిన తన పోస్టర్ తనను అట్రాక్ట్ చేసిందని.. అప్పుడే ఈ సినిమా చేయాలని నిర్ణయం తీసుకున్నానని ఆయన వివరించారు. ఈ చిత్రానికి మూలకారకుడు డైరెక్టర్ రామానుజమని జగ్గారెడ్డి అన్నారు. సినిమా టీజర్ విడుదల చేశారు.

# బిసిలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి

## బిసి ఉద్యమానికి తమ సంపూర్ణ మద్ధతు

### బిసి నాయకులకు హామీ ఇచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కులగణన జరపాలని.. బిసిలకు 42శాతం రిజర్వేషన్లను అమలు జరపాలని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లో చట్టరూపంలో తేవడానికి సహకరించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ ఆదివారం సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి వెస్లీని ఎంబి భవన్‌లో కలిసి మద్దతు కోరారు. ఏప్రిల్ 2న ఢిల్లీలో జరగనున్న మహాధర్నాకు సిపిఐ(ఎం) మద్దతు తెలియజేస్తుందని.. తక్షణమే కేంద్రప్రభుత్వం ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకొని, అమలు చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్త కులగణనను వ్యతిరేకిస్తుందని.. కానీ కులగణనకు, రిజర్వేషన్లకు అనుకూలంగా రాష్ట్రంలో బిజెపి నాయకులు మాట్లాడుతున్నారని అన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండిసంజయ్ ఇలాంటి ద్వంద్వ వైఖరితో మాట్లాడుతుండటాన్ని బలహీన వర్గాల ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉన్నదని.. అగ్రవర్ణ ఆధిపత్యంతో, మనువాద ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించే పార్టీగా బిజెపి ఉందన్నారు. మతోన్మాద రాజకీయాలను, కులరాజకీయాలను ప్రేరేపిస్తూ వాటినే పెంచి పోషిస్తుందని జాన్‌వెస్లీ మండిపడ్డారు. సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటంలో కులగణన అనేది అత్యంత అవసరమని.. ఇలాంటి అంశాలపై ఉద్యమిస్తున్న సంఘాలు, పార్టీలకు తమ పార్టీ పూర్తిగా మద్దతు తెలియజేస్తుందని జాన్‌వెస్లీ బిసి సంక్షేమ సంఘం నాయకులకి స్పష్టం చేశారు.

# రేవంత్ జనరంజక పాలన విమర్శించడం తగదు

## ప్రవీణ్‌కుమార్‌పై నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి విసుర్లు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనరంజక పాలనను మాజీ ఐపిఎస్ ఆఫీసర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించడం తగదని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపి మల్లురవి అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిది రాక్షస పాలన, రాబందుల పరిపాలన అంటుండని ఆవేన చెందారు. రేవంత్ జైల్లో ఉండాల్సిన వ్యక్తి అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యానించడం ఆయన రాజకీయ అజ్ఞానం తెలుపుతోందని అన్నారు. ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నందుకు సిగ్గుపడాలని ఎద్దేవా చేశారు. బిఎస్పిలో ఉన్నప్పుడు కేసీఆర్ రాక్షసుడు ,కేసీఆర్ పాలన రాక్షస పాలన అని అన్నడు అని గతంలో ప్రవీణ్ చేసిన వ్యాఖ్యలను గుర్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం కోసం గొప్ప విప్లవాన్ని తీసుకొస్తుండు అని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి క్యాస్ట్ సెన్సెస్ చేసి 85శాతం ఎసి,బిసి, మైనార్టీస్‌లు, 15శాతం ఫార్వర్డ్ ఉన్నారని లెక్కలు చూపించారని పేర్కొన్నారు. ప్రజలందరికీ సమానమైన హక్కులు ఉండాలని,సమానమైన స్వేచ్ఛ ఉండాలని ఇందిరా గాంధీ ఆలోచించారో ఆ రకంగా రేవంత్‌రెడ్డి ఆలోచించడం గొప్పదనమని ఆయన అన్నారు.

# కలియుగంలో ఆధ్యాత్మిక మార్గంతో రక్షణ

## పుష్పగిరి విద్యాశంకరభారతీ మహాస్వామి



టిటిడి దేవస్థానం ఆస్థాన వేదపండితులు భట్టర్ సుందర ప్రహ్లాదాచార్యులను వంశీ వేద ఉగాది పురస్కారం అందిస్తున్న పుష్పగిరి విద్యాశంకర భారతీ మహాస్వామి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మార్చి 30, ప్రభాతవార్త:** కలియుగంలో ధనం పని చేయదు, విద్యా పాండిత్యాలకు విలువ వుండదు, కుయుక్తులు కొంతకాలం పని చేసినా ఎక్కువ కాలం నిలబడలేవు కేవలం ఆధ్యాత్మిక మార్గం మాత్రమే రక్షణ ఇస్తుందని పుష్పగిరి విద్యా శంకర భారతీ మహాస్వామి సందేశం ఇచ్చారు. ఆదివారంరాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంశీ సంస్థల నిర్వహణలో విశ్వావసు నామ ఉగాది సందర్భంగా జరిగిన సభలో పుష్పగిరి విద్యా శంకర భారతీ స్వామి తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన దేవస్థానం ఆస్థాన వేద పండితులు భట్టర్ సుందర ప్రహ్లాదాచార్యులను వంశీ వేద ఉగాది పురస్కారం తో సత్కరించి మాట్లాడారు. విశ్వా వసు సంవత్సరం అందరికీ శ్రేయస్సు ఇస్తుందన్నారు. ఆధ్యాత్మిక చింతన వున్నవారికి భయాలు వుండవని, అట్టివారు ముందు ఏమీ జరుగుతుందనే చింత వుండదు కాబట్టి వారికి పంచాంగం జ్యోతిషం గురించి ఆలోచన అక్కర లేదన్నారు. ఆశా పాశములు, వల్లె, పాపము, మనిషి నీ పట్టు కొంటాయన్నారు. విశ్వావసు సంవత్సరం చూస్తాము అనుకున్న వారు చూడకుండా వెళ్లి పోయారు. అనీ చూడ లేమేమో అనుకున్నవారు వున్నారని అదే మాయ అన్నారు. వంశీ రామరాజు ఆత్మీయ వంశీయంగా ధర్మ వంశీయం గా భావి తరాలకు ఉత్తమ సంప్రదాయం అందిస్తున్నారని కొనియాడారు. వేదిక పై రాజ్య శ్రీ రచించిన లలితా సహస్ర నామ వ్యాఖ్యానం,డాక్టర్ మీనాక్షి రచించిన సాయీ త్వ మేవ శరణం మమ గ్రంథాన్ని స్వామి ఆవిష్కరించారు. వేదిక పై దర్శకుడు రేలంగి నరసింహారావు, తిరుమల గ్రూ ప్స్ చంద్ర శేఖర్ విదేశీ ఆంధ్రులు బి వ్యాస కృష్ణ రాధ తదితరులు పాల్గొనగా వంశీరామరాజు కార్య క్రమం నిర్వహించారు. తొలుత రామరాజు తరం గిణి శాస్త్రీయ గానగోష్ఠి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ పఠనం, చివరగా భాస్కర రావు,సురేష్ శర్మ శ్రవణ్ కుమార్ శర్మ పాండురంగ జ్యోతి నాలుగు వేద పఠనం చేశారు.

# బిసి గురుకుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ దరఖాస్తు గడువు ఏప్రిల్ 6కు పెంపు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి గడువును పొడిగించారు. దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 6 వరకు పొడిగించినట్లు ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 6 నుంచి 9వ తరగతి వరకు మొత్తం 6832 బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 20(ఆదివారం)న నిర్వహించనున్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుంది. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపును చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసి గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 6, 7, 8, 9వ తరగతుల సీట్లను భర్తీ చేయడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 6లోగా బిసి గురుకుల అధికారిక వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే బిసి గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ప్రకటనలో తెలిపారు.



# హిందువుల ప్రతి పండుగలో సందేశంతోపాటు అంతర్గతంగా సైన్స్

## త్వరలో రాష్ట్ర, జాతీయ కమిటీలు ఏర్పాటు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

### పార్టీ కార్యాలయంలో హోమం, పంచాంగ శ్రవణం

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** హిందువుల ప్రతి పండుగలో సందేశంతో పాటు సైన్స్ కూడా ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం జరిగిన పంచాంగ శ్రవణంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కులాలకు అతీతంగా సామూహికంగా ప్రజలందరూ కలిసి ఉండాలనే పండుగలు మనకు సూచిస్తాయన్నారు. రాష్ట్రం, దేశం మరింత సస్యశ్యామలంగా ఉండాలన్నారు. మోడీ నాయకత్వంలో భారత్ మరింత పురోగమించడంతో పాటు ప్రపంచంలో మన దేశ ఖ్యాతి మరింత పెరగాలన్నారు. ఈ కొత్త సంవత్సరంలో బిజెపి బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, దీనికి ఓ ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో బూత్, మండల, జిల్లా కమిటీలను పూర్తి చేసుకున్నాం అన్నారు. రాష్ట్ర కమిటీ, జాతీయ కమిటీలు త్వరలోనే ఏర్పాటు అవుతాయన్నారు. కొత్త సంవత్సరంలో అందరు బాగుండాలని, మనతోపాటు మన కుటుంబ సభ్యులు మన బంధువులు కూడా బాగుండాలని, ఆ వెంకటేశ్వరుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పుష్కరకాలంగా సన్నబియ్యం పంపిణీ పట్టించుకోని బిజెపి

## ఆహార భద్రత చట్టం తెచ్చింది కాంగ్రెస్

### కేంద్రమంత్రి బండి సంజయ్‌పై సీతక్క ఫైర్

**ప్రభాతవార్త, నడిగూడెం, (సూర్యాపేట):** కేంద్రంలో బిజెపి పుష్కరకాలంగా పరిపాలన కొనసాగిస్తూ సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆలోచన చేయకపోగా అమలు చేస్తున్న కాంగ్రెస్పై విమర్శలు చేయటం ఎంత మేరకు సమంజసమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారము సూర్యా పేటలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఇంటికి వచ్చిన సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటే బిజెపికి మింగుడు పడటం లేదన్నారు. పథకాల అమలుతో పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే తట్టుకోలేక అనవసరపు విమర్శలు చేస్తున్నారన్నారు.

సన్న బియ్యం పంపిణీకి సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై సీతక్క ఫైర్ అయ్యారు. ఆహార భద్రత చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ఆహార భద్రత చట్టాన్ని పేద ప్రజల సంక్షేమ దృశ్య ప్రవేశపెట్టగా నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వము చర్యలు తీసుకుందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను కూడా తగ్గించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామాల్లో వేసవిలో కూలీలకు పనులు కల్పించేందుకు గాను 2005 లో కాంగ్రెస్ ప్రభుత్వము ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టిన విషయాన్ని సీతక్క గుర్తు చేశారు. ప్రస్తుతం ఉపాధి పథకాన్ని కూడా నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వము అడుగులు వేయడము సరైంది కాదన్నారు.

## విభజన చట్టం హామీలు అమలు చేయండి

### పిసిసి అధికార ప్రతినిధి గౌరిసతీష్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** బండి సంజయ్ కేంద్రమంత్రిగా కమీషన్ల గురించి మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉంది టిపిసిసి అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో ఆదివారం మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ అవివేకంగా మాట్లాడుతుండు అని ఆగ్రహం వ్యయక్తం చేశారు. కేంద్ర మంత్రి హోదాలో ఉండిపింక్ కలర్ అధికారంలోకి రాకుండా తెలంగాణ నుండి పారదోలినం అంటుండు అని ఎద్దేవా చేశారు. పింక్ కలర్ అధికారంలోకి రాకుండా పారదోలితే పార్లమెంట్ ఎన్నికల్లో దోస్తానా ఎందుకు చేశారు అని నిలదీశారుజ. ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడే అవకాశం ఉందని చెప్పిన పండితుల పట్ల ,పంచాంగం సంజయ్ మాట్లాడడం విడ్డూరంగా ఉంది అని అన్నారు. దమ్మంటే విభజన చట్టంలో రాష్ట్రానికి రావలసిన అన్నిటిని తీసుకురావాలి అని సవాల్ విసిరారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు నిధులు తీసుకురాకుండా నీటి బుడగల్లాగా మాట్లాడితే తెలంగాణ ప్రజలు ఊరుకోరు అని ఆయన అన్నారు. బండి సంజయ్ మాట్లాడేటప్పుడు ఆధారాలతో మాట్లాడాలి లేదంటే ప్రజలు మిమ్మల్ని క్షమించరు అని హెచ్చరించారు.

# చిరంజీవి, అనిల్ రావిపూడి చిత్రం ఘనంగా ప్రారంభం



మెగాస్టార్ చిరంజీవి మరోసారి ఎంటర్టైన్మెంట్‌ని రీడిఫైన్ చేయడానికి స్టేజ్ సెట్ అయ్యింది. ఇండియన్ సినిమాలో లెజండరీ లెగసీకి పేరుగాంచిన చిరంజీవి, యాక్షన్‌ప్యాక్డ్ ఎంటర్టైనర్ల నుంచి ఎమోషనల్ డ్రామాల వరకు దాదాపు ప్రతి జానర్‌లో అద్భుతమైన విజయాలు సాధించారు. దశాబ్దాల కెరీర్‌లో ఎన్నో హిట్స్, లెక్కలేనన్ని అవార్డులు, తరాలను దాటిన అభిమానులని సొంతం చేసుకున్నారు. ఇప్పుడు, మెగాస్టార్ అంచనాలను మరింత పెంచే ఎక్సయిటింగ్ ప్రాజెక్టుల కోసం సిద్ధమవుతున్నారు. సోషియోఫాంటసీ విశ్వంభర విడుదలకు రెడీ అవుతుండగా, మెగాస్టార్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడితో కలిసి ఒక ఎక్సయిటింగ్ న్యూ ఎంటర్టైనర్ కోసం చేతులు కలిపారు. 8 చిత్రాలకు 8 బ్లాక్ బస్టర్లతో అద్భుతమైన విజయ పరంపరను కొనసాగించిన అనిల్ రావిపూడి లేటెస్ట్ రిలీజ్ సంక్రాంతికి వస్తున్నాం భారీ విజయాన్ని సాధించడమే కాకుండా, రికార్డులను బద్దలు కొట్టి, 300 కోట్ల గ్రాస్‌ను దాటింది.

మోస్ట్ ఎవైటెడ్ 157ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మితా కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. అర్చన సమర్పిస్తున్నారు.మెగా 157 ప్రాజెక్ట్‌ను ఈరోజు ఉగాది పండుగ సందర్భంగా అధికారికంగా పూజా కార్యక్రమంతో లాంచ్ చేశారు. ఇది చిత్రానికి గొప్ప ప్రారంభాన్ని సూచిస్తుంది. ఈ వేడుకకు విక్టరీ వెంకటేష్ క్లాప్ ఇచ్చారు, అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. లెజెండరీ దర్శకుడు కె. రాఘవేంద్రరావు ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించారు. స్టార్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగ వంశీ, యువి క్రియేషన్స్ విక్రమ్, దర్శకుడు వశిష్ట, శ్రీకాంత్ ఓదెల, బాబీ, శివ నిర్వాణ, వంశీ పైడిపల్లి, మైత్రి నవీన్ రవి, శిరీష్, అశ్విని దత్, రామ్ ఆచంట, శరత్ మరార్, విజయేంద్ర ప్రసాద్, కెఎస్ రామారావు, కెఎల్ నారాయణ, సురేష్ బాబు, వెంకట సతీష్ కిలారు, జెమిని కిరణ్, చుక్కపల్లి అవినాష్, జెమిని కిరణ్, నిమకాయల ప్రసాద్ వంటి చిత్ర పరిశ్రమకు చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

హిలేరియస్ కామెడీ, ఫ్యామిలీ బేస్డ్ బ్లాక్ బస్టర్‌లను రూపొందించే అనిల్ రావిపూడి, హ్యూమర్ అండ్ హై ఎనర్జీతో కూడిన యాక్షన్ కంప్లీట్ ఎంటర్ టైనర్‌ని అందించడానికి సిద్ధమైయ్యారు.

చిరంజీవిని ఫ్రెష్ అండ్ డైనమిక్ అవతార్‌లో ప్రెజెంట్ చేసే అద్భుతమైన స్క్రీన్‌ప్లేని స్వయంగా రాశారు అనిల్ రావిపూడి. నవ్వులు, భావోద్వేగాలను బ్లెండ్ చేసి మెమరబుల్ ఎంటర్ టైనర్ ని అందించబోతున్నారు. ఇందులో శంకర్ వరప్రసాద్ అనేది మెగాస్టార్ చిరంజీవి పాత్ర పేరు.

ఈ ప్రాజెక్ట్ కోసం సంక్రాంతికి వస్తున్నాం విజయం వెనుక ఉన్న ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. ఎస్ కృష్ణ, జి ఆది నారాయణ రైటర్స్. ఎస్ కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది.

తారాగణం: మెగాస్టార్ చిరంజీవి. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, నిర్మాతలు : సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, బ్యానర్లు: షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్, సమర్పణ : అర్చన, సంగీతం : భీమ్స్ సిసిరోలియో, డీవోపీ : సమీర్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్ ఎఎస్ ప్రకాష్, ఎడిటర్ : తమ్మిరాజు, రైటర్స్: ఎస్ కృష్ణ, జి. ఆది నారాయణ: ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ కృష్ణ,సూపర్‌వైజర్ : నరేంద్ర లోగిసా, లైన్ ప్రొడ్యూసర్ : నవీన్ గారపాటి, ఎడిషనల్ డైలాగ్స్: అజ్జు మహంకాళి, తిరుమల నాగ్, చీఫ్ కో డైరెక్టర్: సత్యం బెల్లంకొండ, పీఆర్వో: వంశీ శేఖర్, మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా.

## ఉగాది పర్వదినాన లాంఛనంగా ప్రారంభమైన జగ్గారెడ్డి సినిమా ఆఫీస్..

మాస్ లీడర్, జననేత జగ్గారెడ్డి సినిమా ఆఫీస్ లాంఛనంగా ప్రారంభించారు ఆయన కుమార్తె జయలక్ష్మీ రెడ్డి , భరత్ సాయి రెడ్డి. ఉగాది పర్వది నాన ప్రారంభమైన ఈ సినిమా ఆఫీస్‌లో జరిగిన పూజలో పాల్గొన్నారు జగ్గారెడ్డి. విద్యార్థి నాయకుడిగా ప్రయాణం మొదలు పెట్టి అంచెలంచెలుగా రాష్ట్రనాయకుడిగా ఎదిగిన జగ్గారెడ్డి రాజకీయాల్లో అందరికీ ఆదర్శం. ఆయన సినిమా రంగంలో అడుగుపెడుతన్న కథలో టైటిల్ రోల్ పోషిస్తున్నాడు. జగ్గారెడ్డి పేరుతో నిర్మాణం కానున్న ఈ మూవీ ప్రీపొడక్షన్ పనులు శరవేగంగా నడుస్తున్నాయి. త్వరలో ప్రారంభంకానున్న జగ్గారెడ్డి సినిమా ఆఫీస్ ఉగాది



పర్వదినాన ఆరంభిం చారు. ఈ సందర్భంగా మూవీ గ్లింప్స్ ని రిలీజ్ చేసింది టీం. మోస్ట్ పవర్ ప్యాకడ్ మాస్ లీడర్‌గా గ్లింప్స్ లో కని పించారు జగ్గారెడ్డి. ఈ సందర్భంగా మాస్ లీడర్ జగ్గారెడ్డి మాట్లాడుతూ దర్శకుడు రామానుజం చూపించిన జగ్గారెడ్డి వార్ ఆఫ్ లవ్ పోస్టర్‌కి మొదట ఆకర్షితుడునయ్యాను. ఆతర్వాత ఆయన చెప్పిన కథ నాకు నచ్చింది . అందులో నా పాత్ర నాదే. ఎవరో రాసిన మాటలు పాత్రలుగా నేను ఉండను. అంతా ఒరిజినల్, మీకు తెలిసిన జెగ్గారెడ్డిని తెరమీద చూస్తారు. విద్యార్థి నాయకుడిగా మొదలైన నా ప్రయాణం రాష్ట్ర నాయకుడి వరకూ వచ్చిందంటే అందులో చాలా మలుపులున్నాయి. కుట్రలు, కుతంత్రాలు, హాత్యా ప్రయత్నాలు దాటుకోని ఇంతవరకూ చేరిన నాప్రయాణం ఈ కథలో కనపడుతుంది. సినిమా ఇండస్ట్రీలో కూడా నాప్రయాణం మొదలైంది. దీనికి అడ్డాగా ఈ ఆఫీస్ ఉంటుంది. ఇది జగ్గారెడ్డి అడ్డా అనుకోండి.. అన్నారు.. దర్శకుడు వడ్డి రామానుజం మాట్లాడుతూ సంగారెడ్డికి వెళ్లి జగ్గారెడ్డి గారి గురించి తెలుసుకున్నాను. ఇందులో జగ్గారెడ్డి గారి పాత్రతో పాటు మంచి ప్రేమకథకూడా ఉంటుంది. జగ్గారెడ్డి గారు ఎంత మాస్ లీడరో అందరికీ తెలుసు. ఆయన జీవితంలోని ముఖ్య సంఘటనలు ఈ సినిమాలోకనిపిస్తాయి. త్వరలోనే ఈ సినిమా ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు నడుస్తున్నాయి. అన్నారు. నిర్మాత జయలక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ మా నాన్నగారు జగ్గారెడ్డి జీవితంలో కొన్ని సంఘట నలు విన్నాను. వాటిని తెరమీద చూడబోతున్నాం అనే ఆలోచనే



నేహా శర్మ

## విజయ్ సేతుపతి, పూరి, చార్మి మోస్ట్ ప్రెస్టీజియస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ మునుపెన్నడూ చూడని అద్భుతమైన అనుభూతిని అందించబోతోంది. యూనిక్ స్టోరీ, గ్రిప్పింగ్ కథనంతో పూరి జగన్నాధ్ తనదైన శైలిలో తెరకెక్కించనున్న ఈ చిత్రం, విజయ్ సేతుపతి చరిస్మాటిక్ ప్రజెన్స్ సరికొత్త అనుభూతిని అందించనుంది. పూరి జగన్నాధ్, చార్మికౌర్ పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో ఈ అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రాన్ని ఘనంగా నిర్మించనున్నారు. ఈరోజు, తెలుగువారి ప్రత్యేకమైన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అఫీషియల్ ఎనౌన్స్ మెంట్ చేశారు. ఈ సినిమా కోసం పూరి జగన్నాధ్ పవర్ ఫుల్ కథని రాశారు. ఇందులో విజయ్ సేతుపతి నెవర్ బిఫోర్ క్యారెక్టర్ కనిపించబోతున్నారు. విజయ్ సేతుపతి అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మెన్స్, డిఫరెంట్ అవతార్‌లో చూడబోతున్నారు ఆడియన్స్. ఈ మూవీ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి, పూరి జగన్నాధ్, చార్మికౌర్ త్రయం ఆనందం, ఉత్సాహం సినిమా పట్ల వారి ఎక్సయిట్మెంట్‌ని ప్రజెంట్ చేస్తోంది.ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభమవుతుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.


## మంగపతికి మెగా ప్రశంసలు



హీరో నాని నిర్మాణంలో వచ్చిన కోర్టు సినిమా తెలుగు సినిమా ప్రియులకు ఒక విభిన్నమైన అనుభవాన్ని అందించింది. జగదీష్ అనే కొత్త కుర్రాడి దర్శకత్వంలో రూపొందించిన ఈ సినిమాలో ప్రియదర్శి, రోషన్, శ్రీదేవి కీలక పాత్రలలో కనిపించారు. అలాగే సీనియర్ నటుడు శివాజీ మరో కీలక పాత్రలో మెరిశారు. ఈ చిత్రంలో శివాజీ పోషించిన మంగపతి పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరిచి, ఆకట్టుకుంది. నెగిటివ్ షేడ్స్ ఉన్న ఈ పాత్రలో శివాజీ కేవలం నటించలేదు ఆ పాత్రలో జీవించారు. తన కుటుంబానికి చెందిన ఒక అమ్మాయి జోలికి వచ్చాడని చందు అనే కుర్రాడిని ఇబ్బంది పెట్టే ఈ పాత్రలో ఆయన చూపించిన తీవ్రత, ఫెరోషియస్ నటన అందరి మనసులనూ ఆకర్షించింది. ఈ పాత్ర ద్వారా శివాజీ తన నటనా ప్రతిభకు మరోసారి తార్కాణం చాటారు. నిజానికి మంగపతి పాత్ర ఒక సాధారణ విలన్ పాత్ర కాదు అది ఒక సంక్లిష్టమైన, మల్టీఫేస్డ్ ఎమోషన్స్‌తో కూడిన పాత్ర. శివాజీ ఈ పాత్రకు ప్రాణం పోశారు. ఆయన చూపుల్లోని కోపం, మాటల్లోని ఆధిపత్యం, చేష్టల్లోని దౌర్జన్యం ఇవన్నీ కలిసి మంగపతిని తెరపై ఒక శక్తివంతమైన పాత్రగా నిలబెట్టాయి. చందుని ఇబ్బంది పెట్టే సన్నివేశాల్లో ఆయన చూపించిన నటన ప్రేక్షకులను ఒక్కసారిగా ఆ పాత్రను ద్వేషించేలా, అదే సమయంలో ఆ నటనను మెచ్చుకునేలా చేసింది. అది శివాజీ నటనా సామర్థ్యానికి నిదర్శనం.

చిరంజీవి అభినందనల వర్షం. కోర్టు సినిమా తాజాగా చూసిన మెగాస్టార్ చిరంజీవి, శివాజీ నటనకు పూర్తిగా ఫిదా అయ్యారు. వెంటనే ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకున్న మెగాస్టార్ చిరంజీవి మంగపతి పాత్రలో శివాజీ చూపించిన లోతైన నటనను మెచ్చుకుంటూ, అభినందనల వర్షం కురిపించారు. నీవు ఈ పాత్రలో నటించలేదు, జీవించావు. ఇలాంటి పాత్రలు మరిన్ని చేయాలి, అంటూ చిరంజీవి శివాజీని పొగడ్తలతో ముంచెత్తారు. ఈ ఇద్దరూ కలిసి గతంలో ఇంద్ర సినిమాలో నటించిన సంగతి అందరికీ తెలిసిందే.

## ఏప్రిల్ 18న 'శివ శంభో' విడుదల



అనంత ఆర్ట్స్ పతాకంపై బొజ్జ రాజగోపాల్, సుగుణ దోరవేటి నిర్మించిన సంగీత సాహిత్య విలువలు కలిగిన భక్తి ప్రధానమైన చిత్రం "శివ శంభో" ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ ప్రకటించారు. నర్సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం భారతీయ కళలైన సంగీతం సాహిత్యం నృత్యం ప్రధానాంశాలుగా కలిగిన సందేశాత్మక చిత్రమని ఇటువంటి చిత్రాలను ఉత్తమ అభిరుచి గల ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వాళ్లందరికీ విశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం తెలంగాణ ప్రజలకు అన్నిరకాల శుభాలను ఇవ్వాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను అన్నారు. చిత్ర నిర్మాతల్లో ఒకరు, రచయిత, సంగీత దర్శకులు దోరవేటి మాట్లాడుతూ ఉత్తమాభిరుచి గల ప్రేక్షకులు తప్పకుండా తమ చిత్రాన్ని ఆదరిస్తారన్న విశ్వాసం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బొజ్జ రాజగోపాల్, నటులు రమేశ్, బేబీ రిషిత, మేనేజర్ చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ :అనంత ఆర్ట్స్. నిర్మాతలు : బొజ్జ రాజ గోపాల్,దోరవేటి సుగుణ, శ్రీశైలం రెడ్డి, డైరెక్టర్ :నర్సింగ్ రావు, డి ఓ పి: కారె సతీశ్‌కుమార్, హీరో హీరోయిన్ :కృష్ణ ఇస్లావత్, కేశవర్ధిని బేబీ రిషిత,పాటలు మాటలు , సంగీతం: దోరవేటి, ముఖ్యపాత్రలో : తనికెళ్ళ భరణి, సుమన్, టార్జాన్, విజయ్ రంగరాజన్, చిల్లర వేణు, రామస్వామి, రజాక్, మల్లేశ్, రవిరెడ్డి, రమేష్ యాదవ్, శ్రీకర్, విగ్నేష్.

## వేసవిలో రానున్న 'ఒక బృందావనమ్మ్

కంటెంట్ బాగుంటే చిన్న సినిమా, పెద్ద సినిమా నూతన తారలు, క్రేజ్ ఉన్న తారలు అనే తారతమ్యాలు ఉండవు. ఈ మధ్య కాలంలో కేవలం కంటెంట్‌తోనే సూపర్‌హిట్‌గా నిలిచిన చిత్రాలు చాలా ఉన్నాయి. తాజాగా ఆ కోవలోకి చేరే చిత్రమే ఒక బృందావనమ్మ్ నూతన నటీనటులు బాలు, షిన్నోవాలతో పాటు శుభలేఖ సుధాకర్, అన్నపూర్ణమ్మ, శివాజీ రాజా, రూప లక్ష్మి, సాన్విత, కళ్యాణి రాజు, మహేంద్ర, డి.డి. శ్రీనివాస్,ఇతర సీనియర్ నటీనటులు ఈ చిత్రంలో నటించారు! బొత్స సత్య దర్శకత్వంలో కిషోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లాద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రమిది. వినోదంతో పాటు మంచి అర్థవంతమైన సందేశాన్నికూడా ఈ చిత్రంలో జోడించాం. నిర్మాణానంతర పనులు జరుపుకుంటోన్న మా చిత్రం ఆడియోను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే ప్రమోషన్స్‌ను కూడా మొదలుపెట్టి మీ ముందుకు ట్రైలర్‌ను తీసుకవస్తాం. తప్పకుండా కొత్తదనం కోరుకునే ఆడియన్స్‌కు మా చిత్రం తప్పకుండా నచ్చుతుంది అన్నారు. సినిమాటోగ్రాఫర్ రాజ్ కె నల్లి, ఎడిటర్లు తమ్మిరాజు, సంతోష్ కామిరెడ్డి ప్రతి ఫ్రేమ్‌ను మెరుగుపరిచారు, సంగీత దర్శకులు సన్నీ, సాకేత్ ఆహ్లాదకరమైన సౌండ్‌ట్రాక్‌ను అందించారు. చంద్రబోస్, రామజోగై శాస్త్రి, శ్యామ్ కాసర్ల, శ్రీనివాస మౌళి, కళ్యాణ్ చక్రవర్తి రాసిన సాహిత్యంతో, ఈ పాటలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయి.



## యువరాణి లుక్‌లో ఆకట్టుకుంటున్న వైష్ణవి చైతన్య

వరుసగా అగ్ర నిర్మాణ సంస్థల్లో సినిమాలు చేస్తూ బిజీ బిజీగా గడుపుతున్న తెలుగమ్మాయి వైష్ణవి చైతన్య. తెలుగు సినీ పరిశ్రమలో తెలుగు అమ్మాయిలకి అవకాశాలు రావడమే పెద్ద విడ్డూరంగా భావిస్తుంటారు ప్రేక్షకులు. వాస్తవానికి అది నిజం కూడా. అందం, అభినయం ఉన్నప్పటికీ ఎందుకో చాలామంది తెలుగమ్మాయిలు హీరోయిన్లుగా రాణించలేకపోయారు. అయితే కొంతమంది తెలుగు అమ్మాయిలు కష్టపడి పనిచేసి అవకాశాలు పొందడమే కాకుండా తక్కువ సమయంలో స్టార్స్‌గా కూడా ఎదిగారు. అలాంటి అతి తక్కువ మంది హీరోయిన్లలో వైష్ణవి చైతన్య కూడా ఒకరు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. కెరీర్ ప్రారంభంలో లవ్ ఇన్ 143 అవర్స్ ది సాఫ్ట్‌వేర్ డెవలపర్ అరెరె మానస మిస్సమ్మ వంటి షార్ట్ ఫిల్మ్స్‌తో నటిగా గుర్తింపు తెచ్చుకున్న వైష్ణవి... అటు తర్వాత 'అల వైకుంఠపురములో' 'వరుడు కావలెను' వంటి క్రేజీ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసే అవకాశం దక్కించుకున్నారు. ఆ సినిమాల్లో చేసినవి చిన్న పాత్రలే అయినప్పటికీ వాటితో కూడా యూత్‌ను మెప్పించారు. అందువల్ల 'బేబీ' సినిమాలో వైష్ణవికి మెయిన్ హీరోయిన్ ఛాన్స్ వరించింది.

బేబీలో ఇద్దరు హీరోలు ఉన్నప్పటికీ సినిమా కథ మొత్తం హీరోయిన్ వైష్ణవి పాత్ర చుట్టూనే తిరుగుతుంది. ఆమె నటన సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచింది. ఆ సినిమా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంలో వైష్ణవి పాత్ర ఎంతో ఉంది. 'బేబీ' తో యూత్ లోనే కాదు. ఫ్యామిలీ ఆడియన్స్‌లో కూడా బోలెడంత క్రేజ్ సంపాదించుకున్నారు వైష్ణవి. ఇప్పుడు ఆమె నటిస్తున్న 'జాక్' సినిమాపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ఇందులో ఆమె ద్విపాత్రాభినయంతో అలరించనున్నారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్ పై అగ్ర నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది. దీంతో పాటు 90 ఏ మిడిల్ క్లాస్ బయోపిక్ వెబ్ సిరీస్‌కి సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమాలో కూడా ఆనంద దేవరకొండ సరసన హీరోయిన్‌గా నటించనున్నారు వైష్ణవి. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ నాగవంశీ ఈ సినిమాని నిర్మించబోతున్నారు. ఇలా 2 పెద్ద బ్యానర్లలో మెయిన్ హీరోయిన్‌గా చేస్తూ బిజీగా గడుపుతున్నారు.ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో వైష్ణవి చైతన్యకి బీభత్సమైన ఫాలోయింగ్ ఉంది అనేది అందరికీ తెలిసిన విషయమే. ఆమె ఏ ఫొటో షేర్ చేసినా ఇంటర్నెట్ షేక్ అవుతూ ఉంటుంది. అలా అని అందరి హీరోయిన్లలా స్కిన్ షోని నమ్ముకుని ఫొటో షూట్లు చేయరు వైష్ణవి. ట్రెడిషనల్ వేర్లోనే ఎక్కువగా కనిపిస్తూ అందానికి సరికొత్త డెఫినిషన్ చెబుతుంటారు. ఈమెకి ఫ్యామిలీ ఆడియన్స్‌లో క్రేజ్ ఏర్పడడానికి కారణంకూడా ఇదే అనిచెప్పొచ్చు. ఇప్పుడు కూడా ఆమె ఓ స్పెషల్ ఫొటో షూట్లో పాల్గొంది. ఇందులో ఆమె యువరాణిలా మెరిసిపోతూనే.... పవర్‌ఫుల్‌గా కూడా కనిపిస్తున్నారు. భవిష్యత్తులో ఈమె లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లోకూడా నటించి మెప్పించే అవకాశాలు ఉన్నాయని ఈ ఫొటోలతో స్పష్టం చేసినట్లైంది.



# రంజాన్ రుచులు

## హాలీమ్



రంజాన్ మాసంలో రోజా ఉన్నవారంతా ఉపవాస దీక్ష ముగించాక, బలవర్ధక ఆహారం తీసుకుంటారు. ఇలా తీసుకునే ఆహారంలో హాలీమ్ ఒకటి. అనేక పోషకాలతో నిండిన హాలీమ్‌ను రోజా ఉన్నవారే గాక, ఇతరులు కూడా ఇష్టంగా తింటారు. మసాలా ఘాటు, డ్రై ఫ్రూట్స్‌తో ఘుమఘుమలాడే హాలీమ్‌ను ఇంట్లో ఎలా వండుకోవచ్చో చూద్దాం.

కావలసినవి: మటన్ ఖీమా ముప్పావు కేజీ, పచ్చిమిర్చి ఎనిమిది, అల్లంవెల్లుల్లి పేస్టు టేబుల్ స్పూను, పసుపు అర టేబుల్ స్పూను, దాల్చిన చెక్క రెండు ముక్క, లవంగాలు నాలుగు, యాలకులుమూడు, సోంపు టేబుల్ స్పూను,

**కావలసినవి :** మటన్ ఖీమా-ముప్పావు కేజీ, పచ్చిమిర్చి-ఎనిమిది, అల్లం వెల్లుల్లి పేస్టు-టేబుల్ స్పూను, పసుపు-అర టేబుల్ స్పూను, దాల్చిన చెక్క-రెండు అంగుళాల ముక్క, లవంగాలు-నాలుగు, యాలకులు-మూడు, సోంపు-టేబుల్ స్పూను.

✦ మిరియాలు టేబుల్ స్పూన్, ఉప్పు రుచికి సరిపడా, గోధుమ రవ్వ అరకప్పు, మినపప్పు టేబుల్ స్పూను, కందిపప్పు టేబుల్ స్పూన్, పచ్చిశనగ పప్పు టేబుల్ స్పూన్, పెసరపప్పు టేబుల్ స్పూను, బియ్యం టేబుల్ స్పూను. ఆయిల్ మూడు టేబుల్ స్పూన్లు,

✦ఉల్లిపాయలు నాలుగు(సన్నగా తరుక్కోవాలి), అల్లంవెల్లుల్లి పేస్టు టేబుల్ స్పూను, కొత్తిమీర తరుగుపావుకప్పు, పుదీనా తరుగు పావు కప్పు, పచ్చిమిర్చి చీలికలురెండు, మిరియాలపొడి అర టేబుల్ స్పూను, పసుపు పావు టీస్పూను, పెరుగు ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, నెయ్యి ఆరు టేబుల్ స్పూన్లు. గార్నిష్ సరిపడా.

**తయారీ:** కుకర్ గిన్నెలో మటన్ ఖీమాను శుభ్రంగా కడిగి వేయాలి.4. దీనిలో పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి పేస్టు, లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, సోంపు, మిరియాలు, పసుపు, రుచికి సరిపడా ఉప్పు, గ్లాసు నీళ్లు పోసి కలిపి, సన్నని మంటమీద ఐదారు విజిల్స్ రానివ్వాలి.

✦ మరో కుకర్ గిన్నెలోకి నానబెట్టుకున్న గోధుమ రవ్వ, పప్పులు, బియ్యం వేసి శుభ్రంగా కడిగి మూడు గ్లాసులు నీళ్లుపోసి నాలుగు విజిల్స్ వచ్చేంత వరకు ఉడికించాలి. ఉడికిన మటన్ ఖీమాను మిక్సీ జార్లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఉడికిన పప్పులను కూడా మెత్తగా రుబ్బుకోవాలి.

✦ సన్నగా తరిగిన ఉల్లిపాయ తరుగును గోల్డెన్ బ్రౌన్ కలర్లోకి వచ్చేంత వరకు వేయించాలి.

✦. ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయేంత వరకు వేయించి, తరువాత కొత్తిమీర, పుదీనా తరుగు, పచ్చిమిర్చి వేయాలి.

✦ ఇవనీనన వేగాక మిరియాలపొడి, పసుపు, పెరుగు ఖీమా పేస్టు, పప్పుల పేస్టు, రుచికి సరిపడా ఉప్పువేసికలపాలి. మూతపెట్టి పదిహేను నిమిషాలు ఉడికించి, నెయ్యి, డ్రైఫ్రూట్స్ వేసి సర్వ్ చేసుకోవాలి.

# అల్లాహ్ వరాల జల్లులకు సుదినం



రంజాన్ మాసం. ప్రపంచ దేశాల్లో భక్తి శ్రద్ధలతో కఠోర నియమనిబంధనలతో 30రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించి చివరి రోజు తాము చేసిన ప్రార్థనలకు అల్లాహ్ వరాలిచ్చే పవిత్ర రోజు. నెల రోజుల పాటు దివ్యఖుర్ ఆన్‌ను పఠించి తాము తెలిసి తెలియక చేసిన తప్పులను క్షమించమని కన్నీరు మున్నీరుగా వేడుకునే దివ్య దినం రంజాన్. నెల రోజుల పాటు అల్లాహ్ ధ్యాన ముద్రలో ఉంటూ పండగ రోజు మోకాళ్లపై చేతులు జోడించి వేడుకునే సుదినం.తెలుగురాష్ట్రాల్లో కుల మతాలకు అతీతంగా ఈద్‌గాహ్‌ల వద్ద శుభాకాంక్షలు తెలుపుకునే సత్ సంప్రదాయం ఉంది.నెల రోజుల దీక్షలకు అల్లాహ్ నుంచి వరాలు పొందే సుదినం.

నెల రోజులు పాటు కఠోర నియమనిష్టలతో ఉపవాసదీక్షలు పాటించిన వారికి నేడు రంజాన్ ఈదుల్ ఫితర్ ప్రార్థనల సందర్భంగా వారి భక్తి ప్రపత్తులకు భగవంతుడు వరాలిచ్చే సుదినం. ఏడాదిలో వచ్చే ఈ సుదినం కోసం ఎంతో నిరీక్షించిన వారికి వరాలిచ్చే సుదినం ప్రార్థన కోసం ఈద్గాహ్‌లు ముస్తాబు చేస్తున్నారు. నిన్న రాత్రి మసీదుల్లో ముస్లిం సోదరులు లైలతుల్ జాయిజా ఆచరించారు. రాత్రంతా అల్లాహ్ ధ్యానంలో గడిపారు. ఈ రోజు ఉదయం ఈదుల్ ఫితర్ ప్రార్థనలు జరుపుటకు సిద్ధమౌతున్నారు. కొత్త బట్టలు లేదా శుభ్రం చేసిన బట్టల్ని ధరించి కళ్ళకు సుర్మాను అలంకరించి, చక్కగా సుగంధ ద్రవ్యాల్ని పూసుకొని, ఒక దారి వెంట వెళుతూ మరో దారి వెంట ఇంటికి చేరటానికి ముస్లిం సోదరులు సిద్ధమౌతున్నారు. నెల రోజుల పాటు నియమ నిబంధనలతో నిష్ఠతో ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లిలు ఈదుల్ ఫితర్ ప్రార్థనలు జరుపుకోనున్నారు.



**ఈదుల్ ఫితర్ నమాజులకు సిద్ధం:** భారతదేశంలోని మూల మూలల్లో నేడు ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో రంజాన్ సందర్భంగా ఈదుల ఫితర్ నమాజ్‌ను ఆచరించనున్నారు. ఇందుకు ముస్లిం సోదరులు సమాయత్తమౌతున్నారు. రంజాన్ సందర్భంగా బక్రీద్ మాసంలో హాజ్‌యాత్రకు వెళ్లలేని వారు మక్కా,మదీనాకు 'ఉమ్రా' చేయటం ఆనవాయితీ. ఈ నేపధ్యంలో పలువురు ఇక్కడ నుంచి మక్కా,మదీనాకు పయనమయ్యారు. భారత దేశ నలుమూలల నుంచే కాక ప్రపంచదేశాల నుంచి విశేష సంఖ్యలో ఉమ్రా చేయటానికి ఇటీవల కాలంలో కదలి వస్తున్నారు. షాబాన్ మాసం ముగిసిన తరువాత 'నెలవంక దర్శనంతో' రంజాన్ నెల రాత్రి వేళల్లో తరావీహ్ నమాజుల్లో దివ్యఖుర్‌ఆన్‌ను పఠించటం మొదలు పెడతారు. రంజాన్ మాసం పూర్తి అయిన తరువాత నెలవంకను చూసి తరావీహ్ నమాజుల్ని ఆపివేస్తారు. ఉదయం పండగను జరుపుకుంటారు. 30రోజుల పాటు మోమిన్ ముస్లింలు కఠోర నియమాలతో కూడిన ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. ఐదువేళ్లల్లో తప్పని సరిగా నమాజులు ఆచరిస్తారు. సాయంత్రం మసీదుల్లో ఉపవాసదీక్షలు ముగింపు సందర్భంగా 'ఇఫ్తార్' అనే ద్రవ పిండి పదార్ధాలతో అందజేస్తారు. గతంలో ఇళ్ళ నుంచి ఉభయదారులు తయారు చేసి పంపే వారు. కానీ నేడు మసీదుల్లోనే కొంత మొత్తాన్ని ఖరారు చేసి తయారు చేసి ఉపవాసదీక్షలు పాటించే వారితో పాటు బయటి వ్యక్తులకు కూడా పంపిణీ చేస్తున్నారు.

**లయల్‌తుల్ జాయజా:** రంజాన్ మాసంలోని చివరి పది రోజుల్లో ఐదు రాత్రుల్లో ఓ దివ్యరాత్రి ఉందని దివ్యఖుర్ ఆన్‌లో పేర్కొన్నారు. ఈ రాత్రుల్ని అన్వేషిస్తూ రాత్రి జాగరణ చేయటం ఆనవాయితీ. ఈ రాత్రుల్ని ఒక్కక్క మసీదుల్లో రాత్రి జాగారణ చేసారు. అర్ధరాత్రి దాటిన తరువాత వేకువ జాము 3గంటలకు కన్నీరు మున్నీరుగా రోదిస్తూ అల్లాహ్ వద్ద ప్రార్థనలు చేస్తారు. రాత్రి నెలవంక దర్శనం తరువాత (పొద్దుపొడిస్తే పండగ) ఇషా నమాజు తరువాత 'లయతుల్ జాయజా' అని అంటారు. 30రోజుల పాటు ఆచరించిన నమాజులకు ఉపవాసదీక్షలకు ఫలాన్ని ఇచ్చే రాత్రి అంటారు.ఈ రాత్రంతా మేల్కొని వేకువ జామున ఉదయం ఆచరించే నమాజును ఆచరించారు.

**ఒక వ్యక్తికి ఫిత్రా రూ.100లు:** రంజాన్ సందర్భంగా ఆచరించే ముఖ్యమైన సూత్రాల్లో 'ఫిత్రా' ఒకటి. కుటుంబంలో ఐతేకున్న ప్రతి ఒక్కరి పేర కనీసం రూ.100లు ఫిత్రా చెల్లించాల్సి ఉంది. దీనిని పేదలకు దానం చేస్తారు. నేటి ధరలననుసరించి ఈ మొత్తాన్ని ఖరారు చేసినట్లు జామియా మస్‌జిద్ మౌలాన రేహాన్ ప్రకటించారు. అరబ్ దేశాల్లో ఆదివారం ఈదుల్ పితర్ నమాజను ఆచరించారు.

- ఎస్.రహంతుల్లా,

## షీర్ ఖుర్మా

**కావలసినవి:** 4 కప్పులు (960 మి.లీ) పాలు (పూర్తి పాలు/పూర్తి కొవ్వు)1 కప్పు (50 గ్రాములు) సన్నని వెర్మిసెల్లి (ఫైన్ సెవియన్)1/4 కప్పు (50 గ్రాములు) ఆర్గానిక్ షుగర్ (లేదా 3 నుండి 4 టేబుల్ స్పూన్లు కండెన్స్ మిల్క్) (రుచికి అనుగుణంగా సర్దుబాటు చేయండి)8 ఖర్జూరాలు (సన్నగా తరిగినవి)2 టేబుల్ స్పూన్లు చిరోంజీ విత్తనాలు 20 గ్రాములు బాదం 20 గ్రాములు జీడిపప్పు20 (10 గ్రాములు) పిస్తాపప్పులు 3 టేబుల్ స్పూన్లు (45 మి.లీ) నెయ్యి (లేదా అవసరమైనంత)1/2 టీస్పూన్ ఏలకుల పొడి1 టీస్పూన్ (5 మి.లీ) తినదగిన రోజ్ వాటర్ 1/4 నుండి 1/2 కప్పు తియ్యని మాఆ (ఖోయా తియ్యగా ఉపయోగిస్తే, చక్కెర తగ్గించండి)



**తయారీ :** ●. 2 కప్పుల నీటిని మరిగించి, సగం నీటిని మరొక చిన్న గిన్నెలో పోయాలి. ఒక గిన్నెలో బాదం, పిస్తా మరియు జీడిపప్పులను నానబెట్టండి. మరొక గిన్నెలో చిరోంజీ గింజలను నానబెట్టండి.● 30 నిమిషాల తర్వాత, వేడి నీటిని తీసివేసి, రెండు గిన్నెలలో చల్లటి నీటిని పోయాలి.

● ఈలోగా ఖర్జూరాలను చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోండి. ● నీటిని పూర్తిగా తీసివేసి, బాదం మరియు పిస్తాపప్పుల తొక్క తీసి, తొక్క తీసి, గది ఉష్ణోగ్రత వద్ద తాజా నీటిలో కనీసం 1 నుండి 2 గంటలు నానబెట్టండి. చిరోంజి గింజల నుండి నీటిని తీసివేసి శుభ్రమైన గుడ్డకు బదిలీ చేయండి. వాటిని ఆరబెట్టి మెల్లగా రుద్దండి. తొక్క ఊడిపోవడం. తొక్కను మరియు గోధుమ రంగు గింజలు ఉంటే వాటిని తొలగించండి. విత్తనాలను ఒక చిన్న గిన్నెలో ఉంచి పక్కన పెట్టుకోండి. ● గింజలు 1 నుండి 2 గంటల తర్వాత బాగా నానబెట్టిన తర్వాత, వారి మెతగా కోసి పక్కన పెట్టుకోండి. గింజలు వేయించే ముందు పొడిగా ముందు పొడిగా ఉండేలా చూసుకోండి.

● సన్నని వర్మిసెల్లి సాధారణంగా పొడవుగా ఉంటుంది మరియు విరిగిపోదు. మీరు వాటిని కొద్దిగా విరిచి 1 కప్పు (50 గ్రాములు) కొలిచి పక్కన పెట్టుకోవాలి.

షీర్ ఖుర్మా తయారీ:

● మందపాటి అడుగున ఉన్న కుండలో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేడి చేసి, జీడిపప్పు మరియు బాదం పప్పులను వేడి నెయ్యిలో 1 నుండి 2 నిమిషాలు వేయించాలి. తరువాత పిస్తాపప్పులు మరియు చిరోంజి గింజలను వేసి వేయించాలి. వాట స్ఫుటంగా మరియు బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. గింజలు నానబెట్టడానికి 5 నుండి నిమిషాలు తీసుకున్న తర్వాత, ఒక ప్లేట్‌లోకి తీసివేయండి. అదే పాత్రలో ఖర్జూరాలు వేసి, మంచి వాసన వచ్చే వరకు వేయించి, ఒక ప్లేట్‌లోకి తీసుకోండి.1 టేబుల్ స్పూన్ నెయ్యి పోసి సెవియన్ వేసి, తక్కువ నుండి మీడియం మంట మీద బంగారు రంగు వచ్చేవరకు వేయించి, ఒక ప్లేట్‌లోకి తీసి పక్కన పెట్టు కోండి. అదే పాత్రలో, 4 కప్పుల పాలు పోసి, మీడియం నుండి తక్కువ మంట మీద మరిగించాలి. పాలు మరిగేటప్పుడు, 5 నిమిషాలు తరచుగా కలుపుతూ మరిగించాలి. తరువాత వేయించిన చిరోంజి గింజలు ఖర్జూరాలతో అలంకరించండి.

## జెడ్‌ని పెంచేద్దామా !



పచ్చలు పొదిగినట్లుగా మెరిసిపోయే జెడ్‌ని చూసి ముచ్చటపడని వారుండరేమో! ఈ సక్యులెంట్‌ని ఇండోర్ ప్లాంట్‌గా, అర్నమెంటల్ రకంగానే కాదు..గిఫ్టింగ్ కోసమూ ఎంచుకోవచ్చు. దీన్ని పెంచు కోవడమెలాగో తెలిస్తే మరింత బాగుంటుంది కదా

**కాంతి అవసరం :** ఇవి పెరిగే వాతావరణంలో తగినంత వెలుతురు ఉండాలి. కనీసం రోజులో గంటైనా తగిలేలా చూసుకోవాలి. పశ్చిమం, దక్షిణం వైపు ఉండే కిటికీల దగ్గర వీటిని అనువుగా పెంచుకోవచ్చు. గది మరీ చీకటిగా ఉంటే ఎల్ఈడి కాంతులైనా ప్రసరించేలా చూసుకోవాలి.

**. నీళ్లు పోయాల్సిందే :** మట్టిలో తేమ నిల బడితేనే మొక్క ఆరోగ్యంగా ఉంటుంది. అలాగని మరీ బురదబురదగా ఉండ కూడదు సుమా! ఈ నీటిని నింపుకొనే ఆకులు పచ్చగా ఉంటాయి. మొక్క చుట్టూ మట్టి గట్టిపడకుండా ఎప్పటికప్పుడు వదులు చేసుకోవ డమూ ముఖ్యమే. అప్పుడే వేళ్లకూ గాలితగిలి ఆరోగ్యంగా ఎదుగుతుంది.

**పోషకాలు ఇస్తేనే :** ఎంత ఎడారి మొక్క అయినా.. తగినన్ని పోషకాలు అందిస్తేనే చక్కగా ఎదుగుతుంది. దీనికి కనీసం నెలకోసారైనా నీళ్లలో కరిగే ఎన్‌పికె ఎరువుని అందించాలి. చని పోయిన, పాడైన కొమ్మల్ని ఎప్పటికప్పుడు తీసేయాలి. ఇలా చేస్తేనే జెడ్ ఆకులతో నిండుగా కనిపిస్తుంది.

## చిన్న చిన్న జాగ్రత్తలు అవసరం

ఆనందంగా సాగే దాంపత్యం.. ఇదేలా ఏ జంటైనా కోరుకునేది. దీనికోసం పెద్ద పెద్ద త్యాగాలే చేయక్కర్లేదు. చిన్న చిన్న జాగ్రత్తలు చాలు ఆ ప్రయాణం సజావుగా సాగేలా చేస్తుంది అంటారు నిపుణులు. ఎలాగంటే.. ఎన్నిసార్లు చేసినా కాల్ లిఫ్ట్ చేయరు చాలమంది భార్యల నుంచి వచ్చే ఫిర్యాదే ఇది. అవతలి నుంచేమో 'బిజీగా ఉన్నా. ఆ మాత్రం అర్థం కాదా' అన్న సమాధానం వచ్చేస్తుంది. చిన్న సమస్యగానే కనిపిస్తుంది కానీ.. ఆ కొద్ది సమయంలో ఏదైనా చెడు జరిగిందేమోనన్న భయం, తమన నిర్లక్ష్యం చేసునతన్నారన్న బాధ.. ఇలా వాళ్ల మనసులో ఎన్ని




నెగెటివ్ ఆలోచనలు తలెత్తుతాయో తెలుసా? అలాంటప్పుడు మీటింగ్‌లో ఉన్నాను. మళ్లీ చేస్తాను' అని చెప్పి పెట్టేయొచ్చు. లేదా మెసేజ్ చేసినా మంచిదే. నెగెటివ్ ఆలోచన లకు తావుండదు. 'పొసెసివ్ నెస్' అని అందమైన పేరు పెట్టినా.. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు చెక్ చేయడం అనుమానం కిందే లెక్క. సరిగా సమయం కేటాయించట్లేదు, ఫోన్‌లోనే ఉండిపోతున్నా రనిపిస్తే సాయంత్రం ఫలానా సమయం తర్వాత నో ఫోన్, సోషల్ మీడియాకి ఇన్ని గంటలే అన్న నియమాలు పెట్టుకోండి. నిర్లక్ష్య భావన ఉండదు. పొగడ్తలు అందుకోని వారు ఎవరుంటారు చెప్పండి? కానీ మన అనుకున్న వాళ్ల నుంచి వస్తే అదిచ్చే ఆనందమే వేరు. కూర బాగున్నా, ఆయన షర్టులో అందంగా ఉన్నా చెప్పేయండి. ఇది మీ బంధంపై సానుకూల ప్రభావం చూపుతుంది. కావాలంటే ప్రయత్నించి చూడండి. ఏ బంధంలో గొడవలు, చిరుకోపాలు ఉండవు? అయితే అవి ఆ సమస్యకే పరిమితం అవ్వాలి. నువ్వెప్పుడూ అంతే', పోయినసారీ అలానే చేశావు అంటూ పాతవి తవ్వుకుంటూ వెళ్లొద్దు. ఎప్పటికప్పుడు మరిచిపోండి. అలాకాకుండా చిట్టా పోగేసుకుంటూ వెళితే, ప్రేమపోయి.. అయిష్టం, కోపం వంటివి పేరుకుపోతాయి. అలా చిన్నవే కదూ.. కాకపోతే నిర్లక్ష్యం చేస్తుంటాం. వాటిని కాస్త పట్టించుకుంటే.. అందమైన బంధం మీ సొంతం. కావాలంటే ప్రయత్నించి చూడండి.

## నీళ్లని నిర్లక్ష్యం చేయరాదు !

**ఎండలు పెరిగే** కొద్దీ ఒంట్లో నిస్సత్తువ, కళ్లు తిరగడం వంటి సమస్యలు చుట్టుముడతాయి. ఇలాంటప్పుడు చల్లగా ఓ గ్లాసు మంచినీళ్లు తాగితే చాలు.. కుదుటపడొచ్చు. అంతేకాదు, నీటిని తాగడం వల్ల మరెన్నో ప్రయోజనాలూ ఉన్నాయట. ✦ డీ హైడ్రేషన్ వల్ల శరీరంలోని శక్తి స్థాయిలు పడిపోతాయి. అప్పుడే కాదు, మరెప్పుడైనా కళ్లు తిరుగుతున్నా, అలసటగా అనిపించినా.. కడుపు నిండా తినలేదేమో అనుకోవడమే కాదు.. తగినన్ని నీళ్లు తీసుకున్నామో లేదో అని కూడా గమనించుకోండి అంటున్నారు నిపుణులు.

✦ వేళ కాని వేళ ఆకలి వేస్తుందా? వెంటనే ఓ గ్లాసు నీళ్లు తాగండి. కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎందుకంటే ఆకలి, దాహం భావనల్ని మెదడు ఒకేలా గ్రహించడమే ఇందుకు కారణం. లేదంటే బరువు పెరిగిపోయే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గులు లేకుండా ఉండటానికి, వడదెబ్బ తగలకుండానూ, కీళ్లు తేలిగ్గా కదలడానికీ, సున్నితమైన కణజాలం దెబ్బతినకుండానూ నీరెంతగానో సాయపడుతుంది. ✦ ఈ కాలమే కాదు..ఎప్పుడైనా సరే. నీళ్లు సరిగా తాగకపోతే ఆహారం సరిగా జీర్ణ కాదు. బంట్లో వ్యర్థాలు, కొవ్వులు పేరుకుపోయి బరువూ పెరిగిపోతాం. అందుకే డైటిగ్ చేసేవారు సమతులాహారం తీసుకోవడంతో పాటు తగినన్ని నీళ్లూ తీసుకోవాలంటారు నిపుణులు అలానే మూత్ర పిండాల పనితీరు, ఇతర శరీర విధులు సక్రమంగా సాగిపోవాలన్నా కూడా ఇవి ఎంతో అసవరం. ✦ ఉదయం నిద్ర లేచాక ఓ గ్లాసు నీళ్లు తాగితే రోజంతా హుషారుగా ఉండొచ్చుట. ముఖ్యంగా పెద్ద పేగులో పేరుకుపోయిన మలినాలు తొలగిపోతాయి. అధిక రక్తపోటు అదుపులో ఉంటుంది. అంతేకాదు డీ హైడ్రేషన్ వల్ల వచ్చే తలనొప్పితో పాటు మైగ్రెయిన్, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లూ తగ్గుతాయట.



## పరీక్షలవేళ అమ్మలకు పరీక్ష ..

**ఏడాదంతా చదవడం ఒక ఎత్తయితే, పరీక్ష రాయడం ఇంకో ఎత్తు. భయంతో చదివింది మర్చిపోవడం, సమర్ధంగా రాయలేకపోవడం కద్దు. ఈ సమయం పిల్లలకే కాదు అమ్మలకీ గుబులు పెట్టించేదే! అన్నింటినీ అందరినీ దూరం పెట్టేసి ధ్యాసంతా చదివించడం మీదే. ఈ నేపథ్యంలో మానసిక నిపుణులు ఏమంటున్నారంటే ...**

ఇవాళ్టి రోజున బాగా చదివితేనే స్థిరమైన జీవితం అనుకుంటున్నారంతా. దీంతో చదువూ వ్యాపార ధోరణిలోకి మారింది. ఆ పోటీలో నెగ్గుకురావాలనే ఆశతో తల్లిదండ్రులు. నీ కోసం మేమింత కష్టపడుతున్నాం, నువ్వు దానికి తగ్గట్టు చదివి బాగా స్థిరపడాలి అంటారు. తండ్రుల కంటే తల్లులు సున్నితం కనుక బాగా చదవమని ఒత్తిడి చేస్తారు. ప్రోత్సహించడం మంచిదే. కానీ తమ పిల్లల సామర్థ్యం గురించి ఆలోచించడం లేదు. ఎక్కువసేపు చదివితే ఎక్కువ మార్కులొస్తాయని, బొత్తిగా సేదతీరనివ్వడంలేదు. బాగా చదవమని పోరు పెడతారు. అనుక్షణం సలహాలిస్తూ భయపెడతారు. చదువుకున్న అమ్మలూ ఇందుకు మినహాయిపు కాదు. పోటీ తట్టుకవోలంటే చాలా శ్రమించాలనుకుంటారు. స్కూల్లో, ట్యూషన్లో, ఎటు చదివిస్తారు. ఇంట్లోనూ క్షణవ వృథా చేయొద్దంటే అది మామూలు ఒత్తిడి కాదు. మీ పిల్లలకూ మంచి మార్కులే రావచ్చు. కానీ ముందుగానే అంచనా లొద్దు. వాళ్లకు



చదువు ప్రాధాన్యత గురించి చెప్పి ఇక వదిలేయండి. వాళ్లు బాధ్యతగానే ఉంటారు. మార్కులు, ర్యాంకులు అంటూ ప్రమాణాలూ ఉద్వేగాలు సరికాదు. వీటి వల్ల అమ్మల పిల్లకూ కూడా ఆందోళనే. నిజానికి వాళ్లకీ బోలెడు సందేహాలు, అనుమానాలుంటాయి. అంచానాలు భయపెడుతుంటాయి. అమ్మానాన్నల ఆశలు, టీచర్లకిచ్చిన మాట నిలబెట్టుకోవాలి. వీటన్నింటి మధ్య తమను నిరంతరం అమ్మ గమనిస్తూ సలహాలిస్తోంటే ఆందోళన చెందుతారు. అసలే చదవగలమా అనే సందేహం అన్నింటా స్నేహితులు మెరుగ్గా ఉంటే ఆందోళన.. చదివిన ప్రశ్నలు పరీక్షలోన వస్తాయా, భవిష్యత్తు ఏమవుతుందన్న కంగారు. పరీక్ష సరిగ్గా రాయకపోతే అంతా అవమానిస్తారన్న భయం. ఇన్ని దిగుళ్లతో పుస్తకాల ముందు కూర్చున్నా చదవలేరు. రోజులలా గడిచి పరీక్షలు వచ్చేసరికి కంగారు మరీ ఎక్కువౌతుంది. ఆ టెన్షన్‌తో చదివినవీ గుర్తురావు. ఫెయిలైపోతానని బెంబేలుపడతారు.

**పరిష్కారం ఏమిటంటే..** పిల్లల్ని మంచి విద్యాసంస్థలో చేర్పించాం. ఏడాదంతా చదివారు. నెలవారీ పరీక్షలన్నిటిలో ఉత్తీర్ణులయ్యారు. ముందే అనేక ఆందోళనలతో సతమతమౌతున్న పిల్లల్ని మనం ఇంకా ఒత్తిడి పెట్టకూడదు. ఇంత పోటీ ఉన్నందున మన పిల్లలకు ర్యాంకు వచ్చినా, రాకపోయినా అర్థం చేసుకుని అంగీకరించాలి. జీవితంలో స్థిరపడటమే ముఖ్యం కానీ ఈ లక్ష్యాలు కాదు అనుకోవాలి. వాళ్ల ఒత్తిడి తగ్గించాలేగానీ పెంచకూడదు. అందుకోసం ఆశావహంగా ఉండాలి. నువ్వు కష్టపడి చదివావు కదా! చక్కగానే రాస్తావు. ఫలతం గురించి ఆలోచించక నిశ్చింతగా ఉండు అంటూ అనునయించాలి. కొందరు పిల్లలు పరీక్షల కంగారులో అర్థంకాలేదు.మర్చిపోతున్నామంటారు.అలాంటప్పుడు విడమరిచి చెప్పండి లేదా చెప్పించండి. విన్నది గుర్తుంచుకోమని, సుదీర్ఘమైనవి తేలిగ్గా రాయమని చెప్పి నిబ్బరం కలిగించండి. అంతేకానీ మాటిమాటికీ సలహాలివ్వొద్దు. వాళ్లంతట వాళ్లు చదువుకునేలా చేయండి. అడిగతేనే ఆసరా ఇవ్వండి. అవసరమైతేనే సాయం చేయండి. పక్కనే ఉండి డిపెండెన్సీ పెంచొద్దు. ఆందోళనకూ గురిచేయొద్దు. ఇంటి వాతావరనాన్ని ఆహ్లాదంగా ఉంచండి. బిగ్గరగా మాట్లాడటం, టివి హోరూ వద్దు. ఇష్టమైనవారితో మాటలు, నచ్చిన వ్యాపకం.. అలా మధ్యలో సేత తీరుతుంటే ఒత్తిడి ఉండదు.కొందరు ముందంతా ఒత్తిడి చేసి చివర్లో పరీక్ష తప్పినా ఫర్లేదనేస్తారు. ఇలాంటి ధోరణి కూడదు. కంట్రోల్, కర్షన్, కంపేరింగ్, కమిట్‌మెంట్ ఈ నాలుగూ వద్దు. పిల్లలను విచ్చిన్నమయ్యే స్థితికి తీసెకెళ్లక స్థిమితంగా ఉంచండి. సత్ఫలితాలు తప్పకుండా వస్తాయి.

## వీటిని ఓవెన్‌లో వేడి చేయొద్దు ..



✦ పుట్ట గొడుగులను తిరిగి వేడి చేస్తే అందులో ఉన్న పోషకాలు నశించడమే కాదు, ఇన్ఫెక్షన్లు కలిగిస్తాయి. ✦ ఉడికించిన కోడిగుడ్లు, చిల్లీ పెప్పర్స్, నరబొకోలి, అవెన్‌లో వేడిచేస్తే అవి హానికరంగా తయారవుతాయి. ✦ అన్నం మిగిలితే.. రెండోరోజు అలాగే తినొచ్చు. ఒవెన్‌లోవేడి చేస్తే మాత్రం విషతుల్యమౌతుంది. ✦. నైట్రేట్లు విస్తారంగా ఉన్న బీట్‌రూట్, క్యారెట్, బచ్చలికూర లాంటివి అవెన్‌లో వేడి చేయకూడదు. ✦ ఉద్యోగినులు చనుబాలు భద్రం చేసి, బిడ్డకు ఆకలేసినప్పుడు తాగించే ఏర్పాటు చేస్తున్నారు. ఆ పాలు అవెన్‌లో వేడి చేయడం మంచిది కాదు. అవసరాన్ని బట్టి వేడినీళ్ల గిన్నెలో పాలపాత్రను ఉంచి గోరువెచ్చగా చేయొచ్చు. ✦ ఫ్రిజ్‌లో ఉంచిన పండ్లు చల్లగా ఉన్నాయని కొన్ని క్షణాలు కూడా అవెన్‌లో వేడి చేయకూడదు. ✦ కాఫీ వెంటనే తాగాలి. చల్లారిందని వేడి చేయకూడదు. ✦ ఉడికించిన బంగాళదుంపలు, ప్రాసెస్ చేసిన మాంసం, టొమాటో సాస్ అవెన్‌లో వేడి చేయకూడదు.

# క్లిష్ట పరిస్థితుల్లో రోహిత్

## ఐపిఎల్‌లో పేలవ ఫామ్.. 14 మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), ముంబయి ఇండియన్స్ అనగానే టక్కున గుర్తొచ్చే పేరు రోహిత్ శర్మనే. అతడే ఆ జట్టుకు మెయిన్ ఫేస్. ఒకప్పుడు నిలకడ ప్రదర్శనతో భారీగా పరుగులు చేస్తూ, జట్టుకు ఎన్నో విజయాలను అందించాడు. కెప్టెన్ గానూ జట్టుకు ఐదు టైటిళ్లు అందించిన ఘనత అతడిది. కానీ ఇప్పుడతడు గత కొన్ని సీజన్లుగా బ్యాటుతో అంతగా ప్రభావం చూపలేకపోతున్నాడు. ఐపీఎల్ 2025 అతడి పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచుల్లో 0,8 పరుగులు చేసి తీవ్రంగా నిరశపరిచాడు. పైగా ఈ రెండుమ్యాచుల్లో ముంబయి కూడా పరాజయాలను అందుకుంది. ఈ ఐపీఎల్‌లో రోహిత్ శర్మ పేలవ ఫామ్ గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మరో మ్యాచులోనూ ప్రభావంచూపలేకపోయాడు. 8పరుగులే చేసి బౌల్డయ్యాడు. అలా గత రెండు మ్యాచుల్లోనూ రోహిత్ విఫల మైన నేపథ్యంలో ముంబయి ఇండియన్స్ తుది జట్టులో అతడి స్థానంపై ప్రశ్నలు మొదలయ్యాయి. రోహిత్ ఇలా పేలవ ప్రదర్శనతో కిందకు పడిపోవడం ఒక్క రాత్రిలో జరిగిందేదీ కాదు. లీగ్‌లో అత్యధిక పరుగులు సాధించిన మూడో ఆటగాడిగా నిలిచినప్పటికీ, గత కొద్ది సీజన్లుగా అతడి ఆట తీరులో స్థిరమైన తగ్గుదల కనిపిస్తోంది. ఐపీఎల్ 2024లో అతడు సెంచరీ చేయడంతో పాటు, గతం కన్నా మెరుగైన స్ట్రైక్ రేట్‌తో ఆడాడు. కానీ అతడి మొత్తం గణాంకాలు పరిశీలిస్తేనే అస్థిరత కనిపిస్తోంది. గత 14 మ్యాచ్‌ల్లో అతడు కేవలం ఒక్క హాఫ్ సెంచరీ మాత్రమే చేశాడు. ప్లేయింగ్ 11లో అతడికి చోటు కల్పించాలా లేదా జట్టుకు మార్పు అవసరమా అంటూ ఆ ఫ్రాంచైజీ తర్జన భర్జన పడుతోంది. ఇతర బ్యాటర్లు అవకాశాల కోసం ఎదురుచూస్తోన్న వేళ, రోహిత్ నిలకడలేని ప్రదప్రర్శనతో అతడిని టాప్ ఆర్డర్‌లో పంపించడం సహా తుది జట్టులో అతడి స్థానంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జట్టులో అతడి స్థానం ప్రమాదంలో పడుతుందనే చర్చ కొనసాగుతోంది. పైగా ఇప్పటికే అతడు 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. దీంతో అతడి ఐపీఎల్ భవిష్యత్ పైకూడా కాస్త అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే మ్యాచ్‌ల్లో రోహిత్ మెరుగైన ప్రదర్శన చేస్తేనే ఆ తర్వాత మ్యాచుల్లో ముంబయి తుది జట్టులో చోటు దక్కించుకునే అవకాశం ఉంటుందనే వ్యాఖ్యలు చోటు చేసుకుంటున్నాయి.

# ఓటమితో ముగిసిన శరత్ ఆట

## 3-0 తేడాతో స్నేహిత్ విజయం



**న్యూఢిల్లీ:** భారత్ టేబుల్ టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ తన ఆటను ముగించాడు. వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ టోర్నీ పురుల సింగిల్స్‌లో పరాజయంతో అతను రిటైర్ అయ్యాడు. ఈ టోర్నీ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో తెలంగాణకు చెందిన సూరావజ్జుల స్నేహిత్ చేతిలో శరత్ 0-3తో ఓటమిపాలయ్యాడు. 25 నిముషాల పాటు సాగిన ఈ పోరులో స్నేహిత్ 11-9, 11-8, 11-9తో విజయం సాధించాడు. శరత్ కమల్ చివరి మ్యాచ్ చూడటం కోసం చెన్నైలోని నెహ్రూ స్టేడియానికి పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. మ్యాచ్ ముగిసిన తర్వాత వారందరికీ అభివాదం చేస్తూ అతను కృతజ్ఞతలు తెలిపాడు. అంతకు ముందే పురుషుల డబుల్స్ విభాగంలో స్నేహిత్‌లోనే కలిసి శరత్ డబుల్స్ సెమీ ఫైనల్ మ్యాచ్ ఆడాడు. ఈ పోరులో కొరియాకు చెందిన జోడి లిమ్ జాంగూన్-అన్ జేహున్ చేతిలో 11-9, 8-11, 6-11 స్కోరుతో శరత్-స్నేహిత్ ద్వయం పరాజయం చెందింది. కాగా 17 ఏళ్ల వయసులో చెన్నైలో నే జరిగిన ఆసియా జూనియర్స్ టోర్నమెంట్‌తో తొలిసారి ప్రొఫెషనల్ టేబుల్ టెన్నిస్ బరిలోకి దిగిన శరత్ రెండు దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించాడు. అసాధారణ రీతిలో 10 సార్లు జాతీయ ఛాంపియన్‌గా నిలిచిన అతడు అంతర్జాతీయ మెగా ఈవెంట్లలో పెద్ద సంఖ్యలో పతకాలు గెలుచుకున్నాడు. ప్రధానంగా కామన్వెల్త్ క్రీడల్లో 7 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలు గెలిచిన శరత్ ఆసియా క్రీడల్లో 2 కాంస్యాలు సాధించాడు. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కూడా అతని ఖాతాలో 4 కాంస్యాలు ఉన్నాయి. 2004 నుండి 2024 మధ్య ఐదు ఒలింపిక్స్‌లలో పాల్గొన్న శరత్ కమల్‌ను భారత్ ప్రభుత్వం పద్మశ్రీ ఖేల్‌రత్న పురస్కారాలతో గౌరవించింది.



# ఆస్ట్రేలియాకు షెఫీల్డ్ షీల్డ్ టైటిల్

**న్యూఢిల్లీ:** సౌత్ ఆస్ట్రేలియా 29 ఏండ్ల తర్వాత తొలిసారి షెఫీల్డ్ షీల్డ్ టైటిల్ను సొంతం చేసుకుంది. అడిలైడ్‌లో ముగిసిన ఫైనల్లో ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న సౌత్ ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో క్వీన్‌లాండ్‌పై గెలిచింది. క్వీన్‌లాండ్ నిర్దేశించిన 270 రన్స్ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన సౌత్ ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 69.1 ఓవర్లలో 270/6 స్కోరు చేసి నెగ్గింది. జాసన్ సంగా (126 నాటౌట్), అలెక్స్ క్యారీ (105) సెంచరీలతో దంచికొట్టారు. ఈ ఇద్దరు కలిసి నాలుగో వికెట్‌కు 202 రన్స్ పార్ట్‌నర్‌షిప్ నెలకొల్పారు. మార్క్ స్టెకిటీ 3 వికెట్లు తీశాడు. అంతకుముందు క్వీన్‌లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 136.2 ఓవర్లలో 445 రన్స్‌కు ఆలౌటైంది. జాక్ క్లెటాన్ (100), జాక్ విడెర్మత్ (111) సెంచరీలు చేయగా, మార్నస్ లబుషేన్ (61), మార్క్ స్టెకిటీ (51) హాఫ్ సెంచరీలు సాధించారు. బ్రెండన్ డాగెట్ 5, నేథన్ మెక్అండ్రూ 3 వికెట్లు పడగొట్టారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ గ్రాండ్ విక్టరీ

## 7 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ చిత్తు

## పాయింట్ల పట్టికలో 6కు పడిపోయిన హైదరాబాద్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, 18వ సీజన్‌లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం సాధించింది. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో విజయాన్ని సాధించినట్లయింది. సన్ రైజర్స్ నిర్దేశించిన 164 పరుగుల లక్ష్యాన్ని 16 ఓవర్లలో ఢిల్లీ 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వైజాగ్ వేదికగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ వ్యూహ్యం విఫలమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ నిర్ణయం తప్పని తొలి ఓవర్‌లోనే నిరూపితమైంది. బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 18.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. పవర్ ప్లేలోనే హైదరాబాద్ జట్టు 4 వికెట్లు కోల్పోవడం గమనార్హం. అభిషేక్ శర్మ (0), నితీష్ కుమార్ రెడ్డి (0), ఇషాన్ కిషన్ (2 పరుగులు) సింగిల్‌డిజిట్ స్కోరుతో పెవిలియన్‌కు చేరారు. ఇలాంటి కష్ట సమయంలో అనికేత్ వర్మ స్కోరును 150కి దగ్గరగా తీసుకువచ్చాడు. అతను హెన్రిచ్ క్లాసెన్‌తో కలిసి 42 బంతుల్లో 77 పరుగుల భాగస్వామ్యాన్ని పంచు కున్నాడు. అనికేత్ 41 బంతుల్లో 74 పరుగులు చేశాడు. ఇందులో 5 ఫోర్లు, 6సిక్సర్లు ఉన్నాయి. అతనితోపాటు, హెన్రిచ్‌క్లాసెన్ 32 పరుగులు, ట్రావిస్ హెడ్ 22 పరుగులు చేశారు. దీంతో 18.4 ఓవర్లలో 163 పరుగులకే పరిమితమైంది. ఢిల్లీ బౌలర్ మిచెల్ స్టార్క్ 5 వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్‌యాదవ్ 3వికెట్లు పడగొట్టాడు. మోహిత్‌శర్మ ఒక వికెట్ పడగొట్టాడు. ఒక బ్యాట్స్‌మన్ రనౌట్ అయ్యాడు. అనికేత్ వర్మ 41 బంతుల్లో 6 సిక్సర్లతో 74 పరుగులు చేశాడు. మిచెల్ స్టార్క్ 5 వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు పడగొట్టాడు. ఇక 164 పరుగుల లక్ష్య ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్లు ఆది నుండీ దూకుడును ప్రదర్శించి అలవోకగా ఛేజ్ చేశారు. ఈ క్రమంలో ఢిల్లీ ఓపెనర్ ఫాఫ్ డు ప్లెసిస్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జాక్‌ఫేజర్ మాగార్క్38 పరుగులు సాధించాడు. డుప్లెసిస్ 27 బంతుల్లో 50పరుగులుచేసి ధనాధన్ ఇన్నింగ్స్ ఆడగా, ఫ్రేజర్-మెక్‌గుర్క్ 38 పరుగులు చేసి రాణించాడు. ఇలా ఈ ఇద్దరు ఓపెనర్లు డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్-మెక్గుర్క్ తొలివికెట్‌కు 81పరుగులు జోడించి మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. అయితే స్వల్పవ్యవధిలో వీరిద్దరూఔటయ్యారు. ఆతర్వాత కాసేపటికే సిక్స్, ఫోర్ కొట్టి మంచి టచ్‌లో కనిపించిన రాహుల్ బౌల్డయ్యాడు. మూడు వికెట్లు జీషన్ అన్సారీ తీసుకోవడం విశేషం. తదుపరి క్రీజులోకి వచ్చిన అభిషేక్ పోరెల్ (34), స్టబ్స్ (21) ఎలాంటి ఒత్తిడి లేకుండా మ్యాచ్‌ను ముగించారు. దీంతో పాయింట్ల పట్టికలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో స్థానానికి చేరుకుంది. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మాత్రం వరుసగా రెండో ఓటమితో 6వ స్థానానికి పడిపోయింది.



ఆట

## ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# భారత్ రెజ్లర్లకు నిరాశ

**న్యూఢిల్లీ:** సీనియర్ ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025 ఫ్రీస్టైల్ రెజ్లింగ్ పోటీలో ఏ రెజ్లర్ కూడా పతక పోరుకు అర్హత సాధించకపోవడంతో భారత రెజ్లింగ్ బృందానికి దురదృష్టకరమైన రోజుగా నిరూపించబడింది. ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన భారత ఫ్రీస్టయిల్ టోర్నీలో రెజ్లర్లకు తీవ్ర నిరాశ ఎదురైంది. పురుషుల 65కిలోల విభాగంలో బరిలోకి దిగిన సుజిత్ కల్కాల్ పాలస్తీనా రెజ్లర్ అబ్దుల్లా అసఫ్‌పై గెలిచినా, తదుపరి కైజీ తనాబే (జపాన్) చేతిలో ఎదుర్కొవాల్సి వచ్చింది. తనాబే ఫైనల్ చేరినా గాయం కారణంగా సుజిత్ రెపిచేజ్‌లో ఆడే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. మిగతా విభాగాల్లో విశాల్ కాళీరామన్ (65 కిలోలు), చిరాగ్ (57 కిలోలు), చంద్రమోహన్ (79 కిలోలు) ప్రత్యర్థుల చేతుల్లో ఓటములు ఎదుర్కొన్నారు. 57 కిలోల విభాగంలో, 2024 యూ23 ప్రపంచ ఛాంపియన్ అయిన చిరాగ్, కిర్గిజ్ రెజ్లర్ చేతిలో తన మొదటి మ్యాచ్‌లో ఓడిపోవడంతో ముందుగానే నిష్క్రమించాడు. కిర్గిజ్ రెజ్లర్ మంగోలియన్ ప్రత్యర్థి చేతిలో ఓడిపోవడంతో చిరాగ్ పతకం సాధించే అవకాశాలకు గాను, రిపేచేజ్ రౌండ్‌లోకి ప్రవేశించాలనే అతని ఆశలు అడియాసలయ్యాయి. 65 కిలోల విభాగంలో, సుజిత్ తన తొలి పోటీలో విజయం సాధించడం ద్వారా ప్రారంభించాడు, భారతదేశం పతక ఆశలను సజీవంగా ఉంచుకున్నాడు. అయితే, అతను తదుపరి రౌండ్‌లో జపాన్ రెజ్లర్ చేతిలో ఓడిపోయాడు. ముఖ్యంగా గాయం కారణంగా అతను పోటీ నుండి వైదొలగాల్సి వచ్చింది. ఇతర పోటీదారులలో, విశాల్ కలిరామన్ (70 కిలోలు), చంద్రమోహన్ (79 కిలోలు), మరియు జాంటీ (97 కిలోలు) కూడా వారి వారి పోటీలలో పరాజయాలను ఎదుర్కొని, వారి పతక ఆశలకు ముగింపు పలికారు.

# బులియన్ మార్కెట్లో పసిడి వర్సెస్ సిల్వర్

**న్యూఢిల్లీ, మార్చి 30:** బంగారం, వెండి రెండూ దీర్ఘకాలిక పెట్టుబడి పోర్ట్‌ఫోలియోలో భాగం కావచ్చు. అయితే, 5, 10, 15 సంవత్సరాల వ్యవధిలో ఏది మంచి రాబడిని ఇస్తుందనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. గత డేటా, మార్కెట్ ట్రెండ్‌లు, గోల్డ్‌సిల్వర్ రేషియో, రిస్క్ స్థాయిలను పరిశీలిస్తే ఈ నిర్ణయం స్పష్టమవుతుంది. బంగారం ధర ఔన్స్‌కు 3,030 (భారత్‌లో 10 గ్రాములకు రూ.88,500), వెండి ఔన్స్‌కు 33 (భారత్‌లో కిలోకు రూ.1 లక్ష). గత ఏడాది బంగారం 40శాతం పెరిగితే, వెండి 34శాతం పెరిగింది. రెండూఆకట్టుకునే రాబడిని ఇచ్చాయి, కానీ వెండి కొంత వెనుకబడింది. 2020 నుంచి 2025 వరకు బంగారం ధర 10గ్రాములకు రూ.48,000నుంచి రూ.88,500



కి పెరిగింది, అంటే సుమారు 84శాతం రాబడి (సంవత్సరానికి 13శాతం సీఏజీఆర్). వెండి ధర కిలోకు రూ.50,000 నుంచి రూ.1 లక్షకు పెరిగింది, అంటే 100శాతం రాబడి (సంవత్సరానికి 15శాతం సీఏజీఆర్). ఈ వ్యవధిలో వెండి బంగారం కంటే మెరుగైన రాబడిని ఇచ్చింది. 2015లో బంగారం ధర రూ.26,400 (10 గ్రాములు), 2025లో రూ.88,500, అంటే 235శాతం రాబడి (సంవత్సరానికి 12శాతం సీఏజీఆర్). వెండి రూ.35,000 (కిలో) నుంచి రూ.1 లక్షకు పెరిగింది, అంటే 185శాతం రాబడి (సంవత్సరానికి 11శాతం సీఏజీఆర్). ఈ వ్యవధిలో బంగారం వెండి కంటే మెరుగ్గా రాబడి ఇచ్చింది. 2010లో బంగారం ధర రూ.18,500 (10 గ్రాములు), 2025లో రూ.88,500, అంటే 378శాతం రాబడి (సంవత్సరానికి 11శాతం సీఏజీఆర్). వెండి రూ.27,000 (కిలో) నుంచి రూ.1 లక్షకు పెరిగింది, అంటే 270శాతం రాబడి (సంవత్సరానికి 9శాతం సీఏజీఆర్). ఈ వ్యవధిలో కూడా బంగారం వెండి కంటే మెరుగైన రాబడిని ఇచ్చింది. ధరల పెరుగుదలకు కారణాలు బంగారం సురక్షిత పెట్టుబడిగా పరిగణించ బడుతుంది. ఇటీవల కేంద్ర బ్యాంకులు ఏటా 1,000 టన్నులకు పైగా బంగారం కొనుగోలు చేస్తున్నాయి. ట్రంప్ టారిఫ్ విధా నాలు, ఆర్థిక అనిశ్చితి, అమె రికాలో మాం ద్యం భయాలు బంగారం డిమాండ్‌ను పెంచాయి. యూఎస్ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తే డాలర్ బల హీనపడి బంగారం ధరలు మరింత పెరగవచ్చు. వెండి డిమాండ్ ఐదేళ్లుగా సరఫరాను మించి పోతోంది. 2025 లో గ్లోబల్ డిమాండ్ 1.20 బిలియన్ ఔన్స్‌లుగా, సరఫరా 1.05 బిలియన్ ఔన్స్‌లుగా అంచనా. పరిశ్రమల డిమాండ్ (ఎలక్ట్రానిక్స్, సోలార్‌ప్యానెల్స్, గ్రీన్ టెక్), పెట్టుబడి ఆసక్తి వెండి ధరలను పెంచుతున్నాయి. వెండి మార్కెట్ చిన్నది (30 బిలియన్ డాలర్ల టర్నోవర్), కాబట్టి సరఫరాలో చిన్నమార్పు కూడా ధరలపై పెద్ద ప్రభావం చూపుతుంది. వెండి బంగారం కంటేఎక్కువ అస్థిరతను కలిగి ఉంటుంది.

# రూ.78,213 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు!

**ముంబై, మార్చి 30:** భారతీయ బ్యాంకుల్లో రూ.78,213 కోట్లకుపైగా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. అంటే ఈ అకౌంట్ల ఎవరివో తెలియనివి. ఒకవిధంగా చెప్పాలంటే బ్యాంకులో డబ్బు జమ చేసి, దానిని విత్‌డ్రా చేసుకోలేక అలాగే ఉండిపోయింది. ఆఖాతాలకు ఎలాంటి వారసులు లేరు. అందుకు రిజర్వ్ బ్యాంక్ ఆ డబ్బును అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా ఉండిపోయాయి. ఇప్పుడు ఈ అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ దాని నిజమైన యజమానులకు మాత్రమే చెందుతుంది. ఈ డబ్బును తిరిగి పొందడానికి ఆర్బీఐ ఏప్రిల్ 1, 2025 నుండి కొత్త వ్యవస్థను అమలు చేస్తోంది. దీని కింద,



బ్యాంకులు తమ వెబ్‌సైట్‌లో క్లెయిమ్ చేయని డిపాజిట్ల పూర్తి వివరాలను ఉంచాలి. ఇందులో ఖాతాదారుడి పేరు, పబ్లిక్ సెర్చ్ ఫీచర్ కూడా ఉంటాయి. ప్రామాణిక ఫార్మాట్: ఇప్పుడు అన్ని బ్యాంకులు ఒకే రకమైన దరఖాస్తు ఫారమ్, పత్రాలను అడుగుతాయి. 2026 నాటికి పూర్తిగా ఆన్‌లైన్ క్లెయిమ్ వ్యవస్థ ప్రారంభించబడు తుంది. ఫారమ్ నింపిన తర్వాత, బ్యాంక్ శాఖ స్వయంగా కస్టమర్‌ను సంప్రదించి డబ్బును బదిలీ చేస్తుంది. ఇప్పటివరకు క్లెయిమ్ చేయని డిపాజిట్లను తనిఖీ చేయడానికి కస్టమర్లు ఆర్‌బిఐ ఉద్గామ్ పోర్టల్‌కు వెళ్లి, ఆపై వాటిని క్లెయిమ్ చేయడానికి బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లాల్సి వచ్చేది. కొత్త వ్యవస్థలో ఈ ప్రక్రియ సులభతరం అవుతుంది. మార్చి 2024 వరకు ఉన్న డేటా ప్రకారం.. ఆర్బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ ఫండ్ (డిఇఎ)లో రూ.78,213 కోట్లు జమ అయ్యాయి. ఈ మొత్తం గత సంవత్సరం కంటే 26 శాతం ఎక్కువ. నిలిచిపోయిన ఈ మొత్తాన్ని తిరిగి ఇవ్వడానికి ప్రత్యేక ప్రచారాన్ని నిర్వహించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్‌లు, బీమా కంపెనీలను ఆదేశించారు. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు, 2024 ప్రకారం, ఇప్పుడు ఒక ఖాతాలో 4 మంది నామినీలను కలిగి ఉండవచ్చు (గతంలో 1 మాత్రమే ఉండేది). దీనివల్ల నిష్క్రియాత్మక ఖాతాల నుండి డబ్బును తిరిగి పొందడం సులభం అవుతుంది. బ్యాంక్ వెబ్‌సైట్‌లో "అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లు" విభాగాన్ని తనిఖీ చేయండి. పేరు, మొబైల్ నంబర్, చిరునామాతో ఫారమ్ నింపండి. బ్యాంక్ ధృవీకరించి మీ ఖాతాకు డబ్బును బదిలీ చేస్తుంది.

# వాణిజ్యం

# టర్మ్ లోన్స్‌తో జర జాగ్రత్త!


**ముంబై, మార్చి 30:** టర్మ్ లోన్ నిర్దిష్ట కాలానికి తీసుకునే రుణం. సాధారణంగా 1 నుంచి 10 సంవత్సరాలు, కొన్నిసార్లు ఎక్కువ కాల వ్యవధితో దీన్ని తీసుకుంటారు. రుణగ్రహీత నిర్దిష్ట వాయిదాల్లో అసలు, వడ్డీతో సహా రుణం తిరిగి చెల్లిస్తాడు. ఈ లోన్లు దీర్ఘకాల ఆర్థిక ప్రణాళిక కోసం ఉపయోగపడతాయి, సాధారణంగా ఆస్తిని హామీగా ఉంచాలి. ఒకేసారి మొత్తం రుణం పొందిన తర్వాత, నెలవారీ లేదా త్రైమాసిక వాయిదాల్లో చెల్లించాలి. వడ్డీ రేటు స్థిరంగా లేదా మారుతూ ఉండవచ్చు. రుణగ్రహీత క్రెడిట్ విశ్వసనీయత ఆధారంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ లోన్ అందిస్తాయి. సులభమైన దరఖాస్తు ప్రక్రియ, ముందస్తు నగదు చెల్లింపు, నిర్దిష్ట వాయిదాలు, తక్కువ వడ్డీ రేట్ల కారణంగా టర్మ్ లోన్లు ప్రజాదరణ పొందాయి. వ్యాపార విస్తరణ, సామగ్రి కొనుగోలు, ఆస్తి కొనుగోలు వంటి పెద్ద ఖర్చుల కోసం వ్యక్తులు, కంపెనీలు టర్మ్ లోన్ తీసుకుంటారు. ఉదాహరణకు, కంపెనీ కొత్త ఆఫీసు తెరవడానికి, వ్యాపారం విస్తరించడానికి, ఆధునిక సామగ్రి కొనడానికి టర్మ్ లోన్ తీసుకోవచ్చు. వ్యక్తులు 2030 సంవత్సరాల్లో తిరిగి చెల్లించే ఆస్తి కొనుగోలు లేదా 37సంవత్సరాల్లో చెల్లించే వాహన కొనుగోలు కోసం తీసుకుంటారు. విద్యార్థులు ట్యూషన్ ఫీజు కోసం కూడా ఈలోన్ తీసుకోవచ్చు, విద్య పూర్తయ్యాక చెల్లింపు ప్రారంభించవచ్చు. టర్మ్ లోన్ రకాలు.. కాలవ్యవధి, చెల్లింపు నిర్మాణం ఆధారంగా టర్మ్ లోన్లు మూడు రకాలు. సంవత్సరం లోపు తిరిగి చెల్లించాల్సిన లోన్. కొన్ని సందర్భాల్లో 18 నెలల వరకు కాలవ్యవధి ఉంటుంది. తక్షణ ఆర్థిక అవసరాల కోసం వ్యాపారాలు, వ్యక్తులు ఈ లోన్ తీసుకుంటారు. దీని వల్ల ఈ లోన్లు దీర్ఘకాల లోన్ల కంటే వేగంగా ఆమోదం పొందుతాయి. కాలవ్యవధి తక్కువ కావడంతో వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణలు: వర్కింగ్ క్యాపిటల్ లోన్లు, ట్రేడ్ క్రెడిట్, ఇన్వాయిస్ ఫైనాన్సింగ్, పేడే లోన్లు, వైద్య బిల్లులు. 1 నుంచి 5 సంవత్సరాల మధ్య తిరిగి చెల్లించే లోన్. నిర్దిష్ట ఈఎంఐల ద్వారా చెల్లింపు జరుగుతుంది. వడ్డీ రేటు షార్ట్ టర్మ్ కంటే తక్కువ, లాంగ్‌టర్మ్ కంటే ఎక్కువ. విస్తరణ, సామగ్రి కొనుగోలు, వ్యక్తిగత అవసరాల కోసం దీర్ఘకాల



ఆర్థిక బాధ్యత లేకుండా నిధులు కావాలనుకునే వారికి ఈ లోన్లు ఉపయోగపడతాయి. ఉదాహరణకు, రెస్టారెంట్ యజమాని కొత్త ఔట్‌లెట్ కోసం 4 సంవత్సరాలకు రూ.20 లక్షల లోన్ తీసుకోవచ్చు, లేదా ఫ్యాక్టరీ యజమాని రూ.10 లక్షల సామగ్రి కొనుగోలు కోసం 4 సంవత్సరాల ఈఎంఐ తీసుకోవచ్చు. ఇతర ఉదాహరణలు: వాహన లోన్లు, విద్యా లోన్లు, వివాహం, ఇంటి మరమ్మతుల కోసం వ్యక్తిగత లోన్లు. ఇది 5 సంవత్సరాల కంటే ఎక్కువ ఉంటుంది. 30 సంవత్సరాల వరకు తిరిగి చెల్లించ వచ్చు. వడ్డీ రేటు షార్ట్ టర్మ్, మిడ్‌టర్మ్ లోన్ల కంటే తక్కువ, కానీ దీర్ఘకాల చెల్లింపు బాధ్యత ఉంటుంది. ఇవి పెద్ద పెట్టు బడుల కోసం అధిక నిధులు అందిస్తాయి. రుణదాతలు క్రెడిట్ చరిత్ర, ఆదాయ స్థిరత్వం, చెల్లింపు సామర్థ్యం తనిఖీ చేస్తారు.

# నగదు విషయంలో ఆ తప్పు చేస్తే అంతే..

**ముంబై, మార్చి 30:** ఇటీవల వెల్లడైన పలు నివేదికల ప్రకారం ఒక వ్యక్తి ఇంట్లో ఉంచుకోగల డబ్బుమొత్తంపై ఎటువంటి చట్టపరమైన పరిమితిలేదు. అయితే ఆనగదు చట్టబద్ధమైన వనరుల నుంచి వచ్చి ఆదాయపుపన్ను దాఖలులో ప్రకటించాల్సి ఉంటుంది. అయితే అంతపెద్ద మొత్తంలో నగదుకు చెల్లుబాటు అయ్యే వివరణ ఇవ్వడంలో విఫలమైతే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పన్ను అధికారులు డబ్బును స్వాధీనం చేసుకునే అధికారం కలిగి ఉండటమే కాకుండా లెక్కకు రాని మొత్తంలో 137% వరకు జరిమానా కూడా విధించేఅవకాశం ఉంది. రసీదులు, బ్యాంక్ విత్‌డ్రా స్లిప్‌లు, లావాదేవీ రికార్డులతో సహా అన్ని నగదు నిల్వలకు సరైన డాక్యుమెంటేషన్‌ను నిర్వహించడం చాలా ముఖ్యం. 50,000 కంటే ఎక్కువ బ్యాంకు డిపాజిట్లు, ఉపసంహారణల కోసం, వ్యక్తులు తమ పాన్ వివరాలను అందించాలి. ఒక వ్యక్తి ఒక సంవత్సరంలోపు రూ. 20లక్షలు, అంతకంటే ఎక్కువ నగదుజమ చేస్తే, పాన్, ఆధార్ రెండింటినీ అధికారులకు అందిం చాలి. రూ.30 లక్షలకు మించి నగదు లావాదేవీల ద్వారా ఆస్తిని కొనడం లేదా అమ్మితే దర్యాప్తును ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకే లావాదేవీలో రూ.లక్ష దాటిన క్రెడిట్ కార్డ్ ఖర్చులు కూడా ఆదాయపు పన్ను అధికారులు పరిశీలిస్తారు. ఆదాయపు పన్ను చట్టం ఒకవ్యక్తి ఇంట్లో ఉంచుకోగల నగదు మొత్తాన్ని స్పష్టంగా పరిమితం చేయలేదు. చట్టంలోని సెక్షన్లు 68నుండి 69బీ వరకు వివరించినవిధంగా వివరించలేని ఆదాయంగా వర్గీకరించబడకుండా ఉండటానికి ఏదైనా గణనీయమైన మొత్తాన్ని సరిగ్గా నమోదు చేయాలి.



# మహిళా టెక్కీలకు సవాళ్లు

**ముంబై, మార్చి 30:** కాంట్రాక్టు ప్రాతిపదికన టెక్నాలజీ ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నప్పటికీ, వారు ఎక్కువగా ఎంట్రీ స్థాయికే పరిమితమవుతున్నారే తప్ప కెరీయర్‌లో పెద్దగా ముందుకెళ్లలేకపోతున్నారు. అలాగే పురుషులతో పోలిస్తే వేతనాల్లోనూ వ్యత్యాసాలు ఉంటున్నాయి. టీమ్‌లీజ్ డిజిటల్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం డిజిటల్ మౌలిక సదుపాయలు మెరుగుపడడం, రిమోట్ వర్క్ అవకాశాలు, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే (డిఇఐ' విధానాలు గత నాలుగేళ్లలో మహిళా టెకీల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి. 2020లో కాంట్రాక్టు టెక్ ఉద్యోగాల్లో మహిళల సంఖ్య 9.51 శాతంగా ఉండగా, 2024లో ఇది 27.97శాతానికి పెరిగింది. ఐటి సర్వీసుల రంగంలో మహిళా సిబ్బంది వాటా 7.8శాతం నుంచి 21.2 శాతానికి పెరిగింది. అయితే ఇది చెప్పుకోదగ్గ స్థాయిలో కెరియర్ పురోగతికి దారితీయడంలేదు. మధ్యస్థాయి ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యం 4.13శాతం నుంచి 8.93శాతానికి మాత్రమే పెరగడం ఇందుకు నిదర్శనం. ఎంట్రీ స్థాయిని దాటి పురోగమించేందుకు మహిళలకు గణనీయంగా అవరోధాలు ఉండడాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నట్లు నివేదిక వివరించింది. 2020-2024 మధ్య టీమ్‌లీజ్ డిజిట్ టెక్ కాంట్రాక్ట్ సిబ్బందిలోని 13వేల మంది అసోసియేట్స్ గణాంకాల విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. వేతనాల విషయానికి వస్తే పురుషులు, మహిళల మధ్య ఎంట్రీ స్థాయి కొలువుల్లో 6శాతం, మధ్యస్థాయి ఉద్యోగాల్లో 19శాతం వరకు వ్యత్యాసం ఉంటోంది. అయితే సీనియర్ స్థాయిలో మాత్రం 13శాతంగా ఉంటోంది. 'కాంట్రాక్ట్ టెక్ ఉద్యోగాల్లో మహిళల సంఖ్య పెరుగుతుండడం హర్షణీయమే అయినప్పటికీ, లింగ సమానత సాధించాలంటే నియామకాల పరిధికి మించి బహుముఖ విధానాలను అమలు చేయాల్సిన అవసరంఉంది. లీడర్‌షిప్ స్థానాల్లో మహిళలకు ప్రాతినిధ్యం అంతగాలేకపోవడం, పురుషులతో పోలిస్తే వేతనాల మధ్య వ్యత్యాసాలు అలాగే కొనసాగుతుండడమనేది వ్యవస్థలో దీర్ఘకాలిక మార్పులను చేయాల్సిన ఆవశ్యకతను సూచిస్తుంది. మహిళలు ఉద్యోగాల్లో చేరడమే కాకుండా, కెరియర్‌లో పురోగమించేందుకు, సారథ్య బాధ్యతల్లో రాణించేందుకు అవసరమైన పరిస్థితులను కల్పించే దిశగా కంపెనీలు కృషి చేయాలి' అని టీమ్‌లీజ్ తెలిపింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.